అభ్యుదయ

మే-జూన్ 1980



శాంతి యోధుడు

సార్త్రే

కలలనూ జ్వాలలనూ కలిపిన రాగం

కళలూ – కాకరకాయలూ అంటూ పట్టుకు దేవుళ్ళాడితే లాభంలేదు. కాస డబ్బు సంపాదించుకొనే మార్గమేదో చూసుకో అన్నాట్ట వెనకటికి మాఘుడు. నిజమే కళలేం కూడు పెడ్తాయా గుడ్డ నిస్తాయా! ఈ అభిప్రాయం కేవలం తింటానికే బతకాలనుకొనే వాళ్ళది. బతకడం తిండికే ననుకొనేవాళ్ళదీనూ.

కానీ కొందరు ఒక ఆశయం కోసం ఆ ఆశయ సాధన కోసం – అందుకను



వైన సిద్ధాంత ప్రచారం కోసం జీవితమంతా శ్రమిస్తూంటారు. కొవ్వొత్తులై పోతుంటారు. సరిగ్గా మోహనదాసు గారిలాటి అభిప్రాయాలున్నవాడే. అలా అయినవాడే.

ప్రజలు ఉద్యమాలు నిర్మిస్తారు. ఉద్యమాల సంఘటనగా చరిత్ర రూపొందుతూంటుంది. అయితే అలాటి ఉద్యమాలు కొన్ని దేశ పురోగతికి చోదకాలుగా ఉంటే, మరికొన్ని దేశాన్ని

అధోగతికి నెట్టేపి ఉంటాయి. అలాంటప్పుడు సరైన రాజకీయ అవగాహనా, సిద్ధాంత ప్రాతిపదికా లేకపోతే తప్పటడుగు వేస్తే ప్రమాదం ఉంది. చరిత్ర నేర్పినగుణ పాఠం ఇది. మోహనదాసుగారికి బలమైన కమ్యూనిస్టు తాత్త్విక పునాది ఉంది దీన్ని ఆచరించగల ధైర్యం స్థైర్యం ఉంది. ఇది "మోహన్‌దాస్‌గారికిచేరెడేసికళ్ళనటం" కాదు. ఆయన జీవితం మనకు వివరించిన దాన్నిపట్టే అనుకోటం.

తెలంగాణా సాయుధ పోరాట కాలంలో కళాకారులమీదా, సాహితీ వేత్తలమీదా ఉక్కుపాదాల ప్రభుత్వం నడిచెళ్ళటం మనమెరిగిందే; అయితే సాహిత్యం — కళలు ప్రజలమధ్యనుండే వస్తాయి.. వాళ్ళ కోసం వస్తాయి. వాళ్ళతోనే వర్ధిల్లుతాయన్న నమ్మకం ఉంది కనక ఉక్కు బూట్లను తుక్కు చేశాయి. తలెత్తి ఎదిరించాయి పోరాటం ఊపిరిగా బట్టకట్టాయి. అలాటి గడ్డు కాలంలో ప్రజానాట్యమండలిలోసభ్యుడుగా,సంగీతకారుడుగా, వివిధ కళా రూపాలను రూపుదిద్దేవాడుగా మోహన్‌దాస్‌గారు ఉద్యమాల మధ్య పుట్టాడు. ఆటుపోట్లకు తట్టుకున్నాడు. నిర్భయం కవచంగా, నిజాయితీ గుండెగా నిన్నమొన్నటిదాకా ప్రజానాట్యమండలి కార్యదర్శిగా మన మధ్య నిలిచాడు.

సంగీతకారులనేకులున్నారు. ప్రజా కళా రూపాలను ఆకళించుకొని — సాహిత్యాన్ని అలా మలచగల సంగీతకారులు కొద్దిమందే ఉంటారు. సంగీత — సాహిత్యాలమీద సమానమైన పట్టుంటేనే ఇది సాధ్యం అవుతుంది. లేనప్పుడు త్యాగరాజ కీర్తన "కేబరే"లో మిళాయించటం జరుగుతుంది. ప్రజాకళాకారుడు కనుక మోహనదాసు గారికివన్నీ కరతలామలకాలు.

వచనం — సంగీతానికి ముడుందా అన్న అనుమానం కొందరికొస్తూంటుంది. దీనికి ఆమధ్య హైద్రాబాదులో సమర్థవంతంగా ప్రదర్శించిన "సాహితీ చౌరస్తా" సమాధానం చెప్పింది. వచన రచయితలు సైతం ఆశ్చర్యం పోయేటుగా బాణీలు కట్టారు మోహనదాసు గారు. వచన కవిత్వం తప్ప మరోటి నేడు జనంమధ్య కెళ్ళలేదనుకొన్న విరసంవాళ్ళ తొలినాళ్ళ అభిప్రాయాలను [తర్వాత మార్చుకొన్నా రనుకోండి] ప్రజానాట్యమండలి అభ్యుదయ రచయితల సంఘాలు ఆదినుంచీ కాదన్నాయి. పునరుద్ధరణ కాలంనుండీ మరింత బలంగా ఈ అభిప్రాయాలను కాదంటూ జనం బాణీలను పట్టుకొంటూ జనం వాణిని వినిపించిన మోహన్‌దాసుగారు కష్టాలనూ — కన్నీళ్ళనూ గుండెలోనే దాచుకున్నాడు. నిత్యం చిరునవ్వుతో జీవించాడు. ఆఖరి శ్వాసదాకా తాను నమ్మిన కమ్యూనిస్టుపార్టీ ఉద్యమాలకూ వాటి భావప్రచారానికీ ఒక "కాకలు తీరిన యోధుడుగా" నిలిచాడు. ప్రజానాట్యమండలి చరిత్రలో తనకో అధ్యాయాన్ని కేటాయించు కొన్నాడు. ప్రజా ఉద్యమాల అమరవీరుల సరసన తన వాటా నుంచుకొన్నాడు.

— ఏటుకూరి ప్రసాద్

శాంతి యోధుడు సార్త్రే

జీన్‌పాల్ సార్త్రే గొప్ప మేధావి. రచయిత. మార్క్సిస్టు వ్యతిరేకి. శాంతి యోధుడు. ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో హిట్లరు ఫాసిస్టు మూకల్ని వ్యతిరేకించడంకోసం ఆయన "ఫ్రెంచి ప్రతిఘటనోద్యమం"లో పాల్గొన్నాడు. ఆ తరువాత జీవితాంతం ఫాసిజాన్ని యుద్ధోన్మాదాన్ని ఆయన వ్యతిరేకిస్తూనే వచ్చాడు. ప్రపంచ శాంతిసంఘంలో ప్రముఖ సభ్యుడాయన. మేధావి అయిన వాడు అతివాది అయితీరాలని ఆయన నమ్మకం.

1905 లో జన్మించాడు. 75 వ ఏట ఈ సంవత్సరమే మరణించాడు.

సార్త్రే అస్తిత్వవాది. అస్తిత్వ వాదం తాత్వికంగా చెప్పాలంటే ఆత్మా శ్రయ భావవాదం. ఇందులో ఈశ్వర వాదం నిరీశ్వరవాదం అన్న రెండు కోవలున్నాయి. సార్త్రే చిన్నతనంలో తన పరిసరాలలో ఉన్న మత ప్రభా వాన్ని ఏవగించుకున్నాడు. అందువల్ల నిరీశ్వరవాద అస్తిత్వాన్ని ఆయన ఎన్ను కున్నాడు.

ప్రపంచ తత్వ శాస్త్రాలన్నిటిలో శిశువు అస్తిత్వవాదం.

దీని పుట్టుకే 1928 లో. ఇందులో మూడు విభాగాలున్నాయి. మత అస్తిత్వ వాదం, నైతిక అస్తిత్వవాదం, సౌందర్య అస్తిత్వవాదం. సార్త్రే సౌందర్య అస్తిత్వవాది. అస్తిత్వ సౌందర్యవాదుల మతం ప్రకారం "అస్తిత్వ ప్రభ" (ఎగ్జిస్టెనియల్ ఇల్యూమినేషన్) ను చిత్రించడం కళలకు పరమలక్ష్యం. అస్తిత్వ ప్రభ అంటే హేతువిరుద్ధ

● రాంభట్ల కృష్ణమూర్తి

వ్యక్తిక అనుభవం [ఇర్రెషనల్ ఇండివిడ్యుయల్ ఎక్స్‌పీరియన్స్] అని అర్థం. మానవునిలోని దానవతను, కృష్ణపక్షాన్ని చిత్రించడం అస్తిత్వ ప్రభకు పరమ లక్ష్యం మానవకేంద్రీయత (ఏంత్రోపోసెంట్రిజం) ఆత్మాశ్రయత (సబ్జెక్టివిజం) ఈ రెండూ సౌందర్య అస్తిత్వవాదానికి రెండు కాళ్లు.

సార్త్రె తన నిరీశ్వర సౌందర్య అస్తిత్వవాదాన్ని రుజువు చేయడం కోసం మార్క్సిస్టు గతితార్కిక భౌతిక వాద పదార్థాలనెన్నిటినో ఆసరాగా తీసుకున్నాడు. తాను మార్క్సిస్టునని కూడా చెప్పుకున్నాడు. చాలామంది ఆ మాట నమ్మారు. ఇంకా నమ్ముతూ ఉన్నారు.

దేశ కాల రాసి గుణాద్యవస్థలు కల ప్రకృతికి వ్యతిరేకి పురుషుడు. ఈ ప్రకృతి పురుషుల సంగ్రామాన్ని ఆయన గతి తర్కమన్నాడు. ప్రకృతి స్వతస్సిద్ధం [బీయింగ్ ఇన్ ఇట్ సెల్ఫ్] పురుషుడు తనకోసం తాను అస్తిత్వంలోకొచ్చాడు [బీయింగ్ ఫర్ హిమ్‌సెల్ఫ్] "మనిషి అస్తిత్వాన్ని కోరుకోలేదు. కాని ఈ జగత్తులోకి వచ్చిన తరువాత తన కర్మలన్నిటికీ తాను బాధ్యత వహించవలసి వస్తుంది" అంటాడాయన. అలా వచ్చిన పురుషుడు, హేతువిరుద్ధమైన ప్రకృతితో పోరాడవలసి ఉంటుంది. పురుషుడు సర్వస్వతంత్రుడు కనుక, ప్రకృతి న్యాయాలేవీ అతడికి వర్తించవు అని సార్త్రె నమ్మకం.

"తనకు తాను తప్ప మరెవరూ లేరు. అది అర్థం చేసుకుంటే తప్ప పురుషుడు ఏమీ చేయలేడు. అనంతమయిన బాధ్యతల మధ్య ఎట్టి సహాయమూలేని ఒంటరివాడు. తనకు తాను నిర్ణయించుకున్నది తప్ప అతనికి వేరె లక్ష్యంలేదు. ఈ భూమ్మీద తనకు తాను నిర్ణయించుకున్నది తప్ప వేరే గమ్యమూ లేదు." ఇదీ అతని అస్తిత్వవాద సారాంశం. అంటే ఒక రకంగా "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అన్న సూక్తి ఈయన తత్వానికి జీవం.

అయితే ఆయన నిరీశ్వరవాదిగనుక అస్తిత్వంఅంటే కేవల అస్తిత్వం కాదు. కర్మ (ఏక్షన్) అస్తిత్వం అని నిర్వచించాడు. అయితే ఆ కర్మకు తాను ఆశించిన ఫలితం రావచ్చును. రాకనూ పోవచ్చును. ఏది వచ్చినా అదే ప్రాప్తం అని సరిపెట్టుకోవడం అస్తిత్వవాద మతం ఇది కొసకు "కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదా చన" అన్న భగవద్గీత తత్వానికి దారి తీస్తుంది. ఆ తత్వాన్ని కూడా ఈశ్వరవాదులు భగవత్పరంగా అర్థం చెప్పుకోవచ్చు. నిరీశ్వరవాదులు సార్త్రె వాదాన్ని సాయం తెచ్చుకోవచ్చును.

సార్త్రె అస్తిత్వవాదం మౌలికంగా భావవాదం అవడంవల్ల దానికి మార్క్సిజాన్ని అనువర్తించడానికి సార్త్రె చేసిన ప్రయత్నం తాత్వికంగా ఫలించలేదు. కాని అతివాదులనుకున్న మార్క్సిస్టేతర మేధావుల మీద మాత్రం ఆయన ప్రభావం చాలా పడింది. ఇప్పటికీ పడుతూనే ఉంది ఆయన శాంతివాదం, ఫాసిస్టు వ్యతిరేక వాదాలతో మార్క్సిస్టులు పూర్తిగా ఏకీభవిస్తారు. అంతటి మేధావి మార్క్సిస్టు ననుకుంటూ ఆత్మాశ్రయ భావవాదమైన అస్తిత్వవాదపు ఊబిలో కూరుకుపోయాడే పాపం అని విచారిస్తారు.

అపరిశుభ్రం

వై. వి. యస్. యస్. యన్. మూర్తి

"దక్షిణాఫ్రికా లో గాంధీ!" అనే పాఠం సారాంశం ముందుగా తెలుగులో చెప్తున్న ఇంగ్లీషు మాష్టరు రంగనాథం క్లాసులోని కలకలానికి పాఠం మధ్యలో నిలిపి "ఏమిటి కారణం?" అన్నట్లు కోపంగా విద్యార్థుల వంక చూశాడు. విద్యార్థినుల వరుసలో ఆఖరు బెంచీ నుండి బేబీ అనే అమ్మాయి "సార్! మురికివాసన సార్:" అంటూ ముక్కు మూసుకొంటూ బెంచీకి దూరంగా నిలబడి రిపోర్టు చేసింది.

"మురికివాసనా! ఎక్కడ?" అన్నాడు రంగనాథం.

"ఇదోసార్! సీతాలు దగ్గర! అది స్నానంచేసి గుడ్డలు మార్చి ఎన్నిరోజులయిందో! దాని దగ్గర ఒకటే వాసన సార్!" అని పుస్తకాల సంచి తీసుకొని దూరంగా వచ్చేసింది. ఆమె వెనుక ఆ బెంచీలో కూర్చున్న మరో యిద్దరు అమ్మాయిలు లేచి వచ్చేశారు. అంతే కాకుండా ముందు బెంచీలో కూర్చున్న అమ్మాయిలు కూడా ఆ మురికి వాసన భరించలేమన్నట్లు బెంచీ ఖాళీ చేసేశారు. ఇదంతా చూస్తుంటే రంగనాథానికి చెప్పలేనంత కోపంవచ్చింది. ముఖ్యంగా ఈ గొడవ వలన పాఠం ఆగిపోయినందుకు ఆయనకు మరీ కోపంగా వుంది. ఈ రకంగా అల్లరి చేస్తున్నందుకు, బేబీని, మిగిలిన అమ్మాయిలను తిట్టాలనుకున్నాడు. వాళ్ళని చూశాక, వాళ్ళంతా ఊరులో బాగా పలుకుబడి ఉన్న పెద్దల సంతానంగా తెలుసుకొని, వాళ్ళను ఏమీ అనలేక, ఈ గొడవకు మూలకారణం సీతాలు కాబట్టి తన కోపం అంతా అటు మళ్ళించాడు రంగనాథం.

"ఎయ్ సీతాలూ ఇలారా!" అని కోపంగా పిలిచాడు రంగనాథం. సీతాలు సిగ్గుతో, బాధతో, దుఃఖంతో ముడుచుకుపోయి తల వంచుకొని పుస్తకాలు తీసుకొని రంగనాథం దగ్గరకు వెళ్ళింది.

"అబ్బా! వాసన! దూరం." అని రంగనాథం జేబురుమాలుతో ముక్కు మూసుకున్నాడు. ఒక నిముషం తరువాత "నీకు ఎన్నిసార్లు చెప్పాలి! రోజూ స్నానం చేసి, మంచి గుడ్డలు కట్టుకొని రావాలని. ఏమిటా చింపిరి జుత్తు? ఫేషన్ చేస్తున్నావా? ఇంత మురికిగా ఉంటే ఎవరూ నిన్ను దగ్గరకు రానివ్వరు తెల్సా! నీ ప్రక్కన ఎవరూ కూర్చోరు. ఊఁ వెళ్ళి శుభ్రమైన గుడ్డలు కట్టుకొని రా!" అన్నాడు రంగనాథం.

"మాష్టారూ! నేను రోజూ స్నానం చేసాను మాష్టారూ! రోజూ ఉతికిన గుడ్డలే కట్టుకుంటాను సార్! పని తెమలక ఈ వేళ తల దువ్వుకోలేదు. రేపటి నుండి తల దువ్వుకొని వస్తాను సార్!" అంది సీతాలు ఏడుస్తూ!

"రోజూ చూస్తున్నాను ఇలాంటి

మురికి గుడ్డలే కట్టుకొని వస్తున్నావ్! పైగా అబద్ధం కూడానా!" అన్నాడు రంగనాథం.

"సత్య ప్రమాణంగా ఉతికిన బట్టలే సార్! రోజూ సాయంకాలం ఉతుక్కుంటాను సార్! ఇవి తప్ప వేరే బట్టలు నాకు లేవుసార్!" అంది సీతాలు సిగ్గుతో తల వంచుకొని. సీతాలు మాటలు విని ఒక్కసారిగా కాసు అంతా గొల్లుమంది.

"సైలెన్స్! సైలెన్స్!" అంటూ రంగనాథం గొంతు అరిచింది. "అంత కష్టపడి ఈ చదువెందుకు? వేరే పని చూసుకోక. వెళ్ళు! వెళ్ళి, శుభ్రమైన బట్టలు కట్టుకుంటేనే రేపటి నుండి కాసుకురా! లేకపోతే రావద్దు. వెళ్లనాటైం వేస్టు," అన్నాడు రంగనాథం బిగ్గరగా కేకలు వేస్తూ. ఉబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ క్లాసునుండి బయటకు నడిచింది సీతాలు. సీతాలు బయటకు వెళ్ళిపోయాక "అమ్మాయిలూ! మీ మీ స్థానాల్లో కూర్చోండి." అన్నాడు రంగనాథం.

"అమ్మా! పీడ వదిలింది. ఇక ఈ బెంచీని ఫినాయిల్ వేసి కడిగితే తప్ప ఆ మురికి పోదు." అంటూ బేబీ ముందు బెంచీలో సర్దుకుంది. మిగిలిన అమ్మాయిలూ ఆ ముందున్న బెంచీల్లో సర్దుకున్నారు. ఎవరూ చివరి బెంచీలో కూర్చోలేదు. ఖాళీగా వున్న బెంచీని చూసి "అవును మురికిగా ఉన్న ఆ బెంచీలో ఆ పిల్లలు ఎలా కూర్చుంటారు?" అనుకొని, రంగనాథం పాఠం మొదలు పెట్టాడు.

క్లాసులో నుండి బయటకు వచ్చిన సీతాలుకు ఏమీ చేయడానికీ తోచలేదు. దుఃఖంతో కుమిలిపోతూ తోటలోకి వెళ్ళి ఒక చెట్టుక్రింద కూర్చుంది. కళ్ళు వొత్తుకుంది. "వాళ్ళంతా హేళన చేస్తున్నంత మురిగ్గా ఉందా తను? తను రోజూ స్నానం చేస్తూనే ఉంది. తనను మురికి అన్నవాళ్ళే చాలా సార్లు గొప్పగా" ఈ వేళ పరమ బోర్‌గా ఉండే స్నానం చెయ్యలేదోయ్!" అని చెప్పుకోవడం చాలా సార్లు వింది తను. అవును వాళ్ళు ఏం చేసినా గొప్పగానే ఉంటుంది. ఆ బేబీ జుత్తు ఎప్పుడూ చీకేసిన తాటి టెంకలా ఉన్నా! 'అందమైన తలకట్టు' అని పొగుడుతారు అంతా. అసలీ గొడవ అంతా ఆ బేబీ వల్లనే వచ్చింది. దాని మాటే అందరికీ వేదవాక్కు. పెద్ద ధనవంతుల బిడ్డకదా! అందరికీ అదంటే మోజు. రోజూ కారులో వస్తుంది. రకరకాల బట్టలు ఖరీదైనవి వేసుకొని ఫేషనుగా అలంకరించుకుంటుంది. పైగా బాగా చదువుతుంది. దానికంటే నాకు ఎక్కువ మార్కులురావడం అదిసహించలేక అలాచేస్తుంది. అదేమంటే అందరూ అదే అంటారు. ఈవేళే కాదు ఇలాఎన్నిసార్లుతననిఅదిఅవమానించలేదు. ఒకసారి బొంబాయి నుండి వాళ్ళ బాబాయి ఏదో కొత్తరకం పెన్ను తెచ్చాడని అందరికీ చూపించింది. ఆ పెన్ను ఎంతో బాగుంది. ఆ పెన్ను చూడాలని తనకీ అనిపించి తనూ ఒక్కసారి చూస్తానని అడిగింది.

"ఏమిటీ! పెన్ను చూస్తావా? నీ మడి చేతులో పట్టుకుంటే మకిలి దేరిపోదా? అంది పెన్ను దాచేస్తూ. ఇలా ఎన్నో సార్లు అది తనని అవమానిం

చింది. ఈ స్కూల్లో అది ఆడింది ఆట, పాడింది పాట. మాష్టారయినా దాన్ని మందలించక క్లాసులో తననే అవమానించారు. తను శుభ్రంగా లేదట. అందుకే తనకు దగ్గరగా ఎవరూ రారట. "శుభ్రమైన గుడ్డలు కట్టుకోకపోతే క్లాసుకు రావద్దు" అన్నారు మాష్టారు. తనకు ఖరీదయిన బట్టలు ఎక్కడనుండి వస్తాయి? తన తండ్రి రోజువారీ కూలి పని చేస్తాడు. తల్లేమో నాలుగైదు ఇళ్ళల్లో పాచిపని చేస్తుంది. తను. చదువులో చురుగ్గా ఉండడం చూసి అన్నలు తనను చదువులో పెట్టారు. వాళ్ళు పట్నంలో ఏదో పనిచేస్తూ అప్పుడప్పుడు పదీ – పరకా పంపిస్తున్నారు. కాబట్టి ఈ మాత్రమయినా ఉంది తను, లేకపోతే చదువుకోగలిగేదా తను? మాష్టారు చెప్పినట్లు ఖరీదైన గుడ్డలు కట్టుకుంటే తప్ప చదువుకోకూడదన్న మాట. మామూలు గుడ్డలు మురికివాసన కొడ్తాయి కాబోలు!" అనుకుంది సీతాలు. సీతాలు అలా ఆలోచనల్లో పడి కొట్టుకుంటుండగా ఎవరిదో పిలుపు వినిపించింది. "ఏం సీతా! ఇక్కడకూర్చున్నావ్? క్లాసుకుపోలేదా?" అన్న తెలుగు మాష్టారు రామశాస్త్రి గారి గొంతు వినగానే తల ఎత్తి చూసింది సీత. తెలుగు మాష్టారుని చూడగానే సీతకు దుఃఖం ఆగలేదు. భోరున ఏడ్చేసింది. "ఏం సీతా! ఏం జరిగింది? ఎందుకేడుస్తున్నావ్?" అని అడిగాడు రామశాస్త్రి. సీతాలు వివరంగా జరిగినదంతా చెప్పింది. సీతాలు చెప్పిన మాటలు విని నిర్ఘాంతపోయాడు రామశాస్త్రి. గొంతు పెగల్లేదు. సీతాలును ఎలా ఓదార్చాలో తెలియలేదు ఆయనకు. అలా ఆలోచిస్తూ ఉండిపోయి ఒక నిమిషం తరువాత "సరే! సీతా! నువ్వు క్లాసుకు పద, ఇప్పుడు రాబోయేది నాక్లాసేకదా?" అన్నాడురామశాస్త్రి.నేనుపోను మాష్టారూ అంతా ఏడిపిస్తారు." అంది సీతాలు

"నేనిప్పుడే వస్తాను కదా! నువ్వు వెళ్ళు." అన్నాడు రామశాస్త్రి. సీతాలు అయిష్టంగా అక్కడినుండి కదలి వెళ్ళిపోయింది. రామశాస్త్రి నిట్టూర్చి ఒక సిగరెట్టు వెలిగించి ఒక దమ్ము పీల్చాడు. అసలు క్లాసుకి వెళ్ళేముందు ఒక సిగరెట్ తాగి వెళ్ళటం రామశాస్త్రి అలవాటు. ఆ అలవాటు ప్రకారం తోటలోకి వచ్చాడు. అక్కడ సీత చెప్పింది విన్నాడు. సీత చెప్పిన విషయం తలుచుకుంటే ఎంతో బాధ అనిపించింది. ఆ పైన సిగరెట్టు తాగాలనిపించక సిగరెట్టు ఆర్పేసి ప్రక్కకు విసిరిపారేశాడు. నోరు కడుక్కునిస్టాఫ్‌రూంకువచ్చి పుస్తకాలుతీసుకొనిక్లాసుకువెళ్ళాడు రామశాస్త్రి. రామశాస్త్రి క్లాసుకు వెళ్ళేసరికి "మళ్ళీ తయారయింది మురికి దెయ్యం!" అని ఒకరంటున్నారు. "దేష్టాదేవి!"అని మరొకరు అంటుంటే అంతా పగలబడి నవ్వుతున్నారు. క్లాసులో అడుగు పెట్టిన రామశాస్త్రిని చూసి అందరి గొంతులూ మూగపోయాయి. రామశాస్త్రి టేబుల్ దగ్గర నిలబడి "ఎవరు దేష్టాదేవి?" అని ప్రశ్నించాడు. ఎవరూ మాట్లాడలేదు. క్లాసంతా ఒకసారి కలయ చూశాడు రామశాస్త్రి. ఓ మూల ఒదిగిపోయి నిలబడి ఉంది సీతాలు.

"సీతా! ఏం అక్కడ నిలబడ్డావ్?

కూర్చో!" అన్నాడు రామశాస్త్రి. సీత తల వంచుకొని చివరి బెంచీలో ఒక మూల కూర్చుంది. అంతవరకూ ఆ బెంచీలో కూర్చున్న ఇద్దరు అమ్మాయిలు లేచి ముందు బెంచీల్లో సర్దుకున్నారు. రామశాస్త్రి ఒకసారి తీక్షణంగా క్లాసువంక చూసి "సీతా! ఇలారా! ముందుకు వచ్చి మొదటి బెంచీలో కూర్చో. తెలివిగలవాళ్ళు ముందు బెంచీలో కూర్చోవాలి. నువ్వు క్లాసు ఫస్టుకదా! నువ్వే ముందు కూర్చోవాలి. నీ ప్రక్కన బేబీ! ఆ ప్రక్కన రాణి, వాణి ఇలా వరుసగా కూర్చోవాలి. తెలివి తక్కువవాళ్ళు ఎక్కడకూర్చున్నా ఒకటే! రా! ఇలా వచ్చి బేబీ ప్రక్కన కూర్చో." అన్నాడు సీతాలు రాలేదు.

"ఏం రమ్మంటే రావేం?" అని గద్దించాడు రామశాస్త్రి. సీతాలు భయం భయంగా వెళ్ళి బేబీప్రక్కన కూర్చుంది. సీతాలు ప్రక్కన కూర్చోగానే బేబీ దిగ్గునలేచి నిలబడింది. "ఏం?" అన్నట్లు ఆమెవంక చూశాడు రామశాస్త్రి.

"సార్! అది ఇక్కడ కూర్చుంటే నేను క్లాసులో ఉండను సార్!పోతాను." అంది బేబీ.

"ఏం? ఎందుకు కూర్చోవు క్లాసులో?" అన్నాడు రామశాస్త్రి.

"అది మురిగ్గా ఉందిసార్! దాని ప్రక్కన కూర్చుంటే రోగాలు వస్తాయి సార్!" అంది బేబీ తొణకకుండా.

"ఆహా! అలా అని ఎవరు చెప్పారు?" అన్నాడు రామశాస్త్రి.

"మా డాడీ! సార్!" అంది గర్వంగా బేబీ.

"సీతాలు మురికిగా ఉందని నీ కెలా తెల్సు? బట్టలు వాసన చూశావా?" అని అడిగాడు రామశాస్త్రి.

"బట్టలే కాదుసార్! దాని జుత్తు ఎలా ఉందో చూడండి సార్ మురికిగా అందుకే అదంటే నాకు రోత." అంది బేబీ గర్వంగా.

"ఓహో! అలానా! మరి నీ జుత్తు ఎలా వుంది? నీ జుత్తుకు సంస్కారం జరిగి ఎన్ని యుగాలయింది? లేక అది ఫేషను అనుకుంటున్నావా? మరి నీ ప్రక్కన కూర్చుంటే వాళ్ళందరికీ రోగాలు రావా? ఇందాకటి నుండీ చూస్తున్నాను. అదీ! ఇదీ! అంటున్నావ్! సీతాలుకంటే ఏ విషయంలో నువ్వు గొప్ప. సీతాలూ-నువ్వూ ఒకటే క్లాసు. నీకంటే సీతాలుకే ఎక్కువ మార్కులొస్తాయి అన్నింటిలో! ఇహ పోతే నీ జుత్తు ఎంత శుభ్రంగా ఉందో నీకు తెల్సు, వాళ్ళందరికీ తెల్సు. సాటి విద్యార్థినిని అలా అవమానించడానికి మీకు సిగ్గు వేయడంలేదా? నీవు పెద్ద ధనవంతుల బిడ్డవయితే మీ వాళ్ళకు గొప్ప. ఇక్కడ అంతా సమానమే. మురికిని మనం సహించకూడదు. బాహ్యంగా ఉన్న మురికి కడుక్కుంటే పోతుంది. మనస్సులో పేరుకుపోయిన మురికి ఒక అంతట పోదు. ముందు మీ మనస్సులను ఉతుక్కోండి. నువ్వు మురికి! మురికి! అంటున్నది గుడ్డల్ని కాదు, సీతాలు పేదరికాన్ని. పేదరికం అంటే నీకు అసహ్యం కాబట్టి సీతాల్ని నువ్వు అసహ్యించుకుంటున్నావు. అది నీ తప్పుకాదు, నీ చుట్టూ ఉన్న ధనానిది-

గౌరవంగా తప్పుకోండి

– మెంటమ్ కవిరాజ్

యుద్ధభేరి మ్రోగించ
సన్నద్ధమై పొరలివచ్చే
శ్రమజీవుల దండును
అడ్డుకొనే శక్తి–ఎక్కడుంది?
ఎవరికుంది??

ఆవేశంగా
ఆకాశంలోకి అగ్నిశిఖలై
లేస్తున్న హస్తాలతో
నేస్తం పట్టే అవకాశం ఇక లేదు
గౌరవంగా తప్పుకోండి–వాళ్ళ
హక్కుల్ని స్వేచ్ఛగా అనుభవించనీయండి

ఆ సమాజానిది. ఇదే మీకు ఆఖరిసారిగా చెప్పడం. సాటి మనిషిని ప్రేమించండి. గౌరవించండి. గౌరవం పొందండి. ఏ ఒకరిని ఏ ఒకరు అవమానించినా, ఆ యవమానం మీ అందరిదీ!" అన్నాడు ఉద్రేకంగా రామశాస్త్రి. బేబీ నిస్సహాయంగా అందరివంకా చూసి అయిష్టంగా కూర్చుంది. అంతకు ముందే చాలా మంది ముఖాలు వాడిపోయాయి. తలలు దించుకున్నారు అంతా.

* * *

"ఏమండీ రామశాస్త్రిగారూ! మీరు పాఠాలు చెప్పడానికి వెళ్తున్నారా? సంఘ సంస్కరణకు వెళుతున్నారా క్లాసులికి ? పనికిమాలిన అమ్మాయి నెవరినో వెన కేసుకొచ్చి మన డాక్టరుగారి అమ్మాయి బేబీని, ఇంకా రాణి–వాణీలను అవమానించారట. ఇదేమయినా బాగుందా? డాక్టరుగారు తలచుకుంటే మీ బ్రతుకు ఏమవుతుందో తెల్సా. మీరు నానా మాటలు అని అవమానించారని బేబమ్మ అన్నం తినకుండా పండుకుందట. వాళ్ళ నాన్నగారి విషయం మీకు తెలుసుకదా! ఈ విషయం తెలుసుకొని ఆయన ఉగ్రుడై పైకి రిపోర్టు చేస్తానంటూ నా దగ్గరకు వచ్చి ఒకటే చిందులు! ఏదో ఈసారికి ఎలాగో సర్దిచెప్పాను. మరో సారి ఇలా జరగడానికి వీల్లేదు తెల్సిందా! మీ పని మీరు చేసుకోండి. అనవసర వ్యాపకాల జోలి మీ కెందుకు? వెళ్ళండి. "అన్నాడు హెడ్మాష్టరు వాసుదేవరావు కోపంతో చిందులువేస్తూ. రామశాస్త్రి ముఖం కందగడ్డ అయిపోయింది. ఒక మాట కూడా మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండా తరిమేస్తున్న హెడ్మాష్టరును కోపంగా, చిరాగ్గా–వింతగా చూసి బయటకు వచ్చాడు. మెల్లగా తోటలోకి నడిచి సిగరెట్టు ముట్టించాడు.

"ఆహా! ఇదా మన ప్రగతి? చదువుకున్న వీళ్ళ మనసులే ఇంత అపరిశుభ్రంగా ఉంటే లోకం తెలియని ఆ పసివాళ్ళ మాటేమిటి? ఇలాంటి వారి శిక్షణలో ఉంటే వాళ్ళ భవిష్యత్తేమిటి? ఈ అపరిశుభ్రాన్ని కృష్ణాన్ని పోగొట్టడం ఎలా అనుకొని బాధగా నిట్టూర్చాడు

తెలుగు నవల

'నవల'అంటే నవ్యమైనది.నవ్యతను దర్శించేది అని అర్థం. తగినంత విస్తృతి కలిగి, కథాత్మకమై, గద్యంలో వ్రాయబడ్డ కాల్పనిక సాహిత్యాన్నినవల అంటున్నాం. తొలి తెలుగు నవలా రచయితలు నరహరి గోపాలకృష్ణమ చెట్టిగారు దీనిని నవీన ప్రబంధము అనీ, వీరేశలింగం పంతులు గారు వచన ప్రబంధము అనీ అన్నారు.ఇటాలియన్‌లో సంక్షిప్త గద్య ప్రబంధాన్ని వర్ణించే 'నావెల్లా' అన్న అన్న పదాన్ని ఆంగ్లేయులు నావెల్‌గా ఎలా గ్రహించి మార్చుకున్నారో,తెలుగు వారు కూడా అలానే నావెల్ అన్న పదాన్ని తెలుగులో నవలగా మార్చుకున్నారు. ఇతర పాశ్చాత్య దేశాలలో ఇటువంటి ప్రక్రియకు 'రోమా' అని పేరు. దానికి భిన్నంగా ఒక్క ఇటాలియన్, ఇంగ్లీషు భాషల్లోనే ఈ నామ సామ్యం ఏర్పడ్డది. అలానే ఇతర భారతీయ భాషల్లో నవలా సాహిత్యం కూడా ఆంగ్ల భాషా ప్రభావజనితమే అయినా వానిలో ఎక్కడా కనిపించని నామ సామ్యం ఆంగ్ల ఆంధ్ర పదాలకు కుదరడంలోనే తెలుగు మీద ఆంగ్ల భాషా ప్రభావం, అలానే తెలుగు నవల మీద ఆంగ్ల భాషా ప్రభావం కూడా వ్యక్తం అవుతున్నాయి. తొలి తెలుగు నవలా రచయిత నరహరి గోపాలకృష్ణమ చెట్టి గారు ఈ ప్రక్రియను 'నవీన ప్రబంధము' అన్నా, వీరేశలింగం పంతులు గారు, వారి అనుయాయులు దీనిని 'వచన ప్రబంధము' అన్నా-ఆంగ్ల మర్యాదలను తెలుగుకు అంటుకట్టినట్టు స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ ప్రక్రియకు నవల అన్న పేరు పెట్టింది కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు ఆంగ్ల భాషలో కూడా దీనికి కొత్తది అన్న అర్థమే కనుక ఈ కొత్త ప్రక్రియను నవల అంటున్నానన్నారాయన. 1893లో ఆయన దీనిని నవల అని తాను ఎందుకంటున్నాడో వివరిస్తూ - 'ఆంగ్లేయ భాషలో నావల్ అనునీ పదము 'కొత్త' యను నర్థము గల 'నవ్' అను పదము నుండి పుట్టినది. ఈ నవ్' అనుదానికి 'నవ యను సంస్కృత పదంబునకు గల సంబంధము తేటతెల్లంబె కదా! కావున నవల యనగా నవాన్, విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా—అనగా క్రొత్త విశేషంబులు గలవని యర్థమువచ్చుచున్నది. హూణ భాషయందునూ నీ మాటకిదే యర్థమగుటచే నవలను పదమునకు సరియైన పేరొక సంస్కృత పదమునకై ప్రయత్నము చేయక 'నవల' యని ఈ పదమునే నేనిటవాడుచున్నాను' అన్నారు. అలా తెలుగులోకి వచ్చింది 'నవల' అన్న పేరు.

పాశ్చాత్య ప్రభావం

డా|| మొదలి నాగభూషణ శర్మ

ఈ విధంగా తెలుగు మీద పాశ్చాత్య ప్రభావం 'నవల' అన్న పదంతోనే ప్రారంభమయింది. నిజానికిఈ ఈ ప్రక్రియను మనం తెచ్చుకున్నది. ఆంగ్ల భాషా సంపర్కం వల్ల. అందువల్ల అటు సిద్ధాంతావిష్కరణంలోను. ఇటు శిల్ప ప్రయోగంలోనూ కూడా పాశ్చాత్య నవలల, పాశ్చాత్య సిద్ధాంతాల ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో కన్పించక మానదు.

తెలుగు నవల మీద పాశ్చాత్య ప్రభావం ఎంతగా ప్రసరించిందో, అది ఎంత వరకూ పరిమితమో తెలుసుకోవడానికి వీరేశలింగం పంతులు గారి 'రాజశేఖర చరిత్ర' చక్కని ఉదాహరణ. సమర్థి లింగయ్య చెట్టిగారు "Can you not undertake the writing of an original novel in Telugu?" అని ప్రశ్నించగా. దానిని మన్నించి పంతులు గారు తెలుగులో నవలా రచనకు పూనుకొన్నారు. కాని ఆయన అనుసరించిన మార్గం ఈనాటి పాఠకులకు కొత్తగా కనిపించినా, ఉద్యమ ప్రారంభకులకు అది తప్పని సరిమార్గమే! ముందు ఒక చిన్న ఇంగీషు ప్రబంధమును దేనినైనను తెలిగించి, శైలి కుదురుపరుచుకొని తరువాత స్వకపోల కల్పితమైన ప్రబంధమును వ్రాయబూనుకొనవలెనని' తలచి అందుకుగాను గోల్డ్‌స్మిత్ వ్రాసిన 'ది వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్, నవలను ఎన్నుకొన్నారు. కొంత అనువదించిన తరువాత 'విదేశ కథ భాషాంతరమును మనవారి కింపుగా నుండదని తలచి.... దానిని మానివేసి రాజశేఖర చరిత్రను వ్రాయనారంభించితిని'అని పంతులుగారు తమ స్వీయ చరిత్రలో చెప్పుకొన్నారు.

ఈ నవలను వ్రాయడంలో కూడా పంతులుగారు గోల్డ్‌స్మిత్ నవలనే అనుసరించారు. పాత్రలు, వారి మనస్తత్వాలు, కథలోని ప్రధాన సంఘటనలు యివి అన్నీ గోల్డ్‌స్మిత్‌వే. ఆయా ఘట్టాలకు అనువైన సామాజిక చిత్రణ-దురాచారాల ఖండన-యివి పంతులుగారి మౌలికాలు. ఇదే విధానాన్ని అంటే కథాబీజాన్ని, సంఘటనలను పాశ్చాత్య భాషల నుంచి స్వీకరించి, అవసరమైనచోట్ల వానిని దేశకాలానుగుణ్యంగా మార్చి నవలను వ్రాయడం పంతులుగారి రచనా పద్ధతి.

కేవలం ఈబాహ్యమైన లక్షణాలలోనే కాక ఎన్నో కథాగతమైన అంతర లక్షణాలలో కూడా తెలుగు నవలలు పాశ్చాత్య నవలలను అనుసరించాయి. మొట్టమొదటి ఆంగ్ల నవలలను – ముఖ్యంగా 18 వ శతాబ్దం నవలలను – పరిశీలిస్తే అవి చాలాభాగం వ్యక్తుల జీవిత చరిత్రలుగా ప్రారంభింపబడ్డాయని

తెలుస్తుంది. Pamela, clarissa, the history of tom jones వంటి నవలలు ఒకే వ్యక్తి చుట్టూ అల్లబడిన కథలు. వీనిలో కథానాయకుడో, నాయికో కథా సూత్రాన్ని పట్టుకొని నడిపిస్తారు. మానవుని కార్యవిఘాతాలను వ్యక్తీకరిస్తూ వానిని అధిగమించే అతని కార్యసిద్ధి ఈ నవలలకు ముగింపు. తెలుగులో మొదటి పాతిక సంవత్సరాల్లో వచ్చిన నవలలన్నీ ఈ లక్షణాలను పుణికి పుచ్చుకొన్నవే.

వీరేశలింగంగారి తరువాత సాంఘిక, చారిత్రక నవలలకు ఒరవడి పెట్టింది చింతామణి పత్రిక. సాంఘిక నవలా లక్షణాలంటూ ఆ పత్రిక నిర్దేశించిన సూత్రాలన్నీ 18 వ శతాబ్ద ఆంగ్ల నవలా లక్షణాలే; అలాగే చారిత్రక నవలా లక్షణాలను కూడా ఆ పత్రిక నిర్దేశించింది. "ఇటువంటి గ్రంథములను వ్రాయ ప్రయత్నించువారు ముందుగా ఇంగ్లీషు భాషలో నున్న తార, సీత, అక్బర్, చాంద్ బీబీ, టిప్పుసులాన్ మొదలైన హిందూదేశముతో సంబంధించిన ప్రబంధములను, స్కాట్ జాక్సవెర్న్ మొదలగు వారు రచించిన ప్రబంధములను కొన్నిటిని చదువుట మంచిదని తలంచుచున్నాము" అని చింతామణి పత్రిక 1896 లో ప్రకటించింది. ఈ ప్రకటనవల్ల మూడు రకాల నవలలు తరువాత పాతిక సంవత్సరాలలోను తెలుగు దేశంలో విరివిగా వ్రాయబడ్డాయి. భారతీయులైన రమేశ చంద్రదత్తు వంటి వారు వ్రాసిన భారతీయ ఇతిహాసం ఆధారంగా వ్రాయబడిన నవలలు, భారతీయేతరులైన మెడోస్ టేలర్ వంటి ఆంగ్ల రచయితలు, భారతీయ చరిత్ర ఆధారంగా వ్రాసిన ఆంగ్ల నవలలు, పాశ్చాత్యుల చారిత్రక నవలలు – ఇవి అన్నీ తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. చిలకమర్తి వారి అహల్యాబాయి, ఖండవిల్లి వారి లక్ష్మీసుందర విజయము వంటి నవలలు ఈ బహుమానాన్ని పొందినా చింతామణి ప్రకటనవల్ల ఆంగ్లానువాదాలు అనుసరణలే ఎక్కువగా వచ్చాయి. చిలకమర్తివారే రమేశచంద్రదత్తు వ్రాసిన నవలల నెన్నింటినో అనుసరించారు. కేతవరపు వెంకటశాస్త్రి వంటి వారు స్కాట్ నవలలను అనువదించారు.

ఈ విధంగా ప్రారంభమైన తెలుగు నవలమీది పాశ్చాత్య ప్రభావం మూడు విధాల ప్రసరించిందని చెప్పవచ్చు. ఒకటి అనువాదాలు – అనుసరణలు. రెండు సిద్ధాంత ప్రభావితాలు, మూడు శిల్పప్రభావితాలు. పాశ్చాత్య దేశాలలో యీ శతాబ్దంలో ఆవిర్భవించిన వినూత్నమైన సాంఘిక ఆర్థిక, మానసిక శాస్త్ర సిద్ధాంతాలు ప్రాతిపదికగా తెలుగులో వచ్చిన నవలలను సిద్ధాంత ప్రభావితాలు అనవచ్చు. భావ వ్యక్తీకరణంలోను, కథా సంఘటనలలో కాక ప్రపంచ నవలా సాహిత్యంలో శిల్పం దృష్ట్యా జరుగుతున్న వినూత్నమైన ప్రయోగాలను అనుసరించి తెలుగులో వచ్చిన నవలలను శిల్ప ప్రభావితాలు అనవచ్చు.

ముందు సంక్షిప్తంగా అనువాదాలు అనుసరణలను గురించి – నరహరి

గోపాలకృష్ణమచెట్టి, కుందుకూరి వీరేశ లింగం పంతులు గార్లతో ప్రారంభమైన అనుసరణ పద్ధతి చిలకమర్తి ప్రభృతులు చాలామంది అనుసరిస్తూ వచ్చారు. స్వతంత్ర రచనలకు అనువాదాలకు మధ్యే మార్గం యిది. అనువాదాలు వచ్చాక ఈ అనుసరణ పద్ధతి-నవలా సాహిత్యంలో మాత్రం తగ్గుముఖంపట్టిందనే చెప్పొచ్చు. ప్రఖ్యాత సాహిత్యవేత్తలు చాలామంది- ప్రపంచ ప్రఖ్యాతలయిన పాశ్చాత్య నవలలను అనువదించారు. మొదటితరం రచయితలు కేశవరపు వేంకటశాస్త్రి ప్రభృతులు. ఇక రెండవతరంలో సూరంపూడి సీతారాం, నండూరి రామమోహనరావు తెన్నేటి సూరి, బెల్లంకొండ రామదాసు వి. డి. ప్రసాదరావు, డి. రామలింగం శ్రీవిరించి, శ్రీనివాస చక్రవర్తి, శివం, అవసరాల సూర్యారావు, నండూరివిఠల్. రెంటాల గోపాలకృష్ణ- వంటివారు ఫ్రెంచి, రష్యన్, అమెరికన్, నవలల అనువాదాలు చేసినవారిలో ప్రఖ్యాతులు. ప్రపంచ సాహిత్య చరిత్రలో పేరెన్నిక గన్న నవలలనుఆయా భాషలనుంచిగాక, ఆంగ్ల భాషాంతరీకరణాల నుంచి తెలుగు లోకి అనువదించడం ఈ అనువాదాల్లో విశేషం. వి. యస్. శర్మ, ఉప్పల లక్ష్మణరావు వంటి కొద్దిమంది మాత్రమే సరాసరి ఆయా భాషల నుంచి తెలుగు లోకి అనువాదాలు చేశారు. ఇతర దేశాల నవలా సాహిత్యంలోని ఆణిముత్యాలను తెలుగు ప్రజలకు అందించిన రచయిత లందరూ సాహిత్యసేవ చేసినవారే.

సిద్ధాంత ప్రభావితాలలో ముఖ్యంగా పేర్కొనవలసినవి మూడు విభిన్న మార్గాలు. ఇవి కాల్పనిక సిద్ధాంతస్ఫోరకాలు. వాస్తవిక-అతి వాస్తవిక సిద్ధాంత ప్రేరితాలు మానసిక శాస్త్ర ప్రేరితాలు. /1921లో మాలపల్లి రచనతో ఆవిష్కృతమైన వాస్తవిక నవలోద్యమానికి తరువాత ఇరవై సంవత్సరాల వరకు సవతి తల్లి ప్రేమే లభించింది/ 1945-50లో రాజకీయ నవల ప్రాచుర్యానికి వచ్చిన తరువాత కాని తిరిగి సాంఘిక దృక్పథం అభ్యుదయ స్ఫోరకమైన వాస్తవికత తెలుగు నవలలో స్థిరపడలేదు 1925-40 మధ్యకాలంలో ప్రచారంలోకి వచ్చిన కాల్పనికోద్యమానికి నవలా సాహిత్యంలో ప్రతినిధులైన ముగ్గురు రచయితలు- అడవి బాపిరాజు, విశ్వనాథసత్యనారాయణ, చలం- ఒక వినూత్నమైన నవలాప్రపంచాన్ని సృష్టించారు. దానిని పాశ్చాత్య నవలా పరిభాషలో యుటోపియా-డిస్టోపియా అంటారు. అసలుయుటోపియా అన్నది ఆదర్శరాజ్య చిత్రణ, ఈ ముగ్గురు రచయితలు మూడు రకాలయిన ఆదర్శలోకాలను తమ నవలా సృష్టికి మూలభూతం చేసుకొన్నారు.

తెలుగుదేశ చరిత్రలో గర్వించదగిన ఆదర్శ వ్యక్తులతోను, వారి ఉదాత్త చర్యలతోను నిండిన వీరోచిత ప్రపంచాన్ని సమకాలీన జీవితంలో కూడా ఆదర్శ వ్యక్తులు జీవించే ఓ సుందర ఉదాత్తమయ ప్రపంచాన్ని తన నవలల్లో సృష్టించాడు అడవి బాపిరాజు తానుఆశించిన పూర్వ సంప్రదాయానుగుణమైన సమాజం వైపుకు సమకాలీన సమాజాన్ని తిరిగి తీసుకొనిపోవాలన్న ఆశ

యంతో గతిస్తున్న సంస్కృతి, ప్రాభవాలు ప్రాతిపదికగా ఊహించిన ఆదర్శ లోకాలను, తద్భిన్నంగా వున్న సమకాలీన సమాజం అనే ఆపన్నలోకాన్ని సృష్టించాడు విశ్వనాథ. అలాగే చలం కూడా స్త్రీకి సర్వస్వాతంత్ర్యమూ ఉన్న ఒక ఆదర్శ లోకాన్ని ఊహించి. అటువంటి లోకాన్ని, అందుకు భిన్నంగా— తన చుట్టూ ఉన్న స్త్రీని బానిసగా చేయాలనుకొనే ఆపన్న లోకాన్ని సృష్టించాడు. ఈ ముగ్గురూ కాల్పనికతను మూడు దృక్కోణాల నుంచి దర్శించినా పర్యవసానంగా ఒకే రకమయిన నవలా లోకాన్ని సృష్టించారు. వీరి నవలల్లో వాస్తవికత లేకపోలేదు. ఐతే ఈ వాస్తవికతను ముగ్గురూ మూడు విధాలరూపొందించుకున్నారు. అడివి బాపిరాజు తాను సృష్టించిన ఆదర్శలోక వాతావరణ చిత్రణ ద్వారా సహజత్వాన్ని సాధించాడు. దైనందిన జీవిత చిత్రణ, వాతావరణ, కల్పన, భౌతిక వివరాల వర్ణన— వీనితో తన కాల్పనిక లోకాలకు సహజత్వాన్ని ఆపాదించుకొన్నాడాయన. విశ్వనాథది ఒక ప్రత్యేకమైన విధానం. హెన్రీజేమ్స్—లా తన పాత్రల చిత్రీకరణలో ఆయన మనోవిశ్లేషణాత్మక వాస్తవికతను సాధించి తద్వారా సహజత్వాన్ని సాధించాడు. ఇక చలం— తన వాద ప్రాబల్యంతో అవాన్నికున్న సమకాలీన ప్రాధాన్యంతో సహజత్వాన్ని సాధించాడు. చలం నవలలు చదువుతున్నంతసేపూ అందులో జరిగిన సంఘటనలు యధార్థాలా, ఆ విధంగా జీవించి పూనుకొన్న ఆ స్త్రీ గతి ఆ తరుణత ఏమిటి? అనే పూర్వాపరాలు ఆలోచనలోకి రావు. ఒక నియమితమైన వాతావరణంలో పెంచబడి, సమాజ అత్యాచారాలకు గురియైన ఒక స్త్రీ ఇదిగాక మరేమి చెయ్యగలదు— అన్న భ్రాంతిని కలుగజేస్తాయి చలం నవలలు.

వాస్తవిక అధి వాస్తవిక నవలలు:

కథను నడుపుతూనే మధ్య మధ్య సమకాలీన సమస్యలు మీద రచయిత వెలిబుచ్చే అభిప్రాయాలతో ప్రారంభమైన తెలుగు నవలలోని సమాజ చిత్రణ మాలపల్లితో నిలదొక్కుకుని, మాతృమందిరంతో కొత్త పుంతలు తొక్కి, 'రాజు మహిషి'తో పరకాష్ట చేరుకుంది.

మనుషుల జీవితాన్ని యదార్థంగా చిత్రించడం అన్ని నవలలకు ధ్యేయమే అయినా, ఈ యదార్థ చిత్రణలకు రచయిత తానుకొన్ని సంఘులునలను ఎన్నుకొని దాని నుంచి కథను, పాత్రలను మలచే వాస్తవిక రూపకల్పన యదార్థ నవలా రచయితలు మామూలుగా అనుసరించే పద్ధతి. ఈ విధమైన వాస్తవికతకు భిన్నంగా అతి వాస్తవికత రూపొందించబడది. ఇందులో రచయిత నియమితమైన జీవితాన్ని యధాతథంగా చిత్రిస్తాడు ఇందులో ఎన్నికకి తావులేదు. రచయిత తీర్పుకు తావులేదు. తాను చూచిన. గ్రహించిన, ఆకట్టుకున్న ఒక సత్యాన్ని యధాతథంగా పాఠకుల ముందు ఉంచడం రచయితల ధ్యేయం. పాత్ర చిత్రణ కన్నా పాత్రల ప్రవృత్తి చిత్రణకు అధిక ప్రాధాన్యమిచ్చే ఈ రకం రచనలు తెలుగులో అతి తక్కువగా వచ్చాయి. ఇందులో రావూరి భరద్వాజ వ్రాసిన

పాకుడురాళ్ళు, కాదంబరి ఎన్నదగిన ప్రయోగాలు.

ప్రపంచ నవలా సాహిత్య చరిత్రలో మనోవైజ్ఞానిక నవల ఆవిర్భావం ఒక మైలురాయి. ఫ్రాయిడ్, ఆడ్లర్, యూంగ్, ఎరిక్‌సన్‌ల మనోవిశ్లేషణ సిద్ధాంతాలు. వాళ్ళు చేసిన ప్రయోగాల ఫలితాలు పాత్ర చిత్రణలో, కథా కథనంలో ఒక సంచలనాత్మకమైన మార్పును తెచ్చాయి. ఐతే ఈ సిద్ధాంతాల ఆవిర్భావానికి పూర్వం కూడా పాత్రగతమైన మనస్తత్వ పరిశీలన నవలలో లేకపోలేదు. అందువల్ల మనోవిశ్లేషణ నవలలకు విస్తృతమైన అర్థాన్ని రూపొందించే ప్రయత్నంలో పాశ్చాత్యులు ఆ రకం నవలలను మూడు విధాలుగా విభజించారు. సిద్ధాంతాల ప్రసక్తి లేకుండా పాత్ర చిత్రణలో పాత్రగతమైన మనోవైచిత్రిని, వివిధ మనోభావాల సంఘర్షణను వ్యక్తీకరించే నవలలు మొదటివి మనోవైజ్ఞానిక సిద్ధాంతాల ప్రాతిపదికగా పాత్రను మనోభావాలను వ్యక్తీకరించేవి. విభిన్న పాత్రల మధ్య నెలకొనే సంక్లిష్ట సంబంధాలను వివరించేవి రెండవ వర్గానికి చెందినవి. ఫ్రాయిడ్, ఆడ్లర్ మొదలైనవారి సిద్ధాంతాలు ప్రాతిపదికగా గల నవలలు ఈ పద్ధతికి చెందినవి. ఇక మూడవ కోవకు చెందినవి. ఈ సిద్ధాంతాల ఫలితంగా పాత్రల అంతరంగాలలో మెదిలే అస్పష్టమూ, అసంబద్ధమూ అయిన భావతరంగాలను వెలిబుచ్చ దానికి రూపొందించిన చైతన్య స్రవంతి - మొదలైన శిల్ప విధానాలు.

ఇందులో మొదటి పద్ధతికి చెందిన మనోవిశ్లేషణ నవలలను ఎక్కువగా వ్రాసినవాడు విశ్వనాథ, ఆయన 'మాబాబు' వంటి నవలల్లో పాత్రగతమైన మనోవిశ్లేషణకు ప్రామాణికతను కలిగించాడు

ఇక సిద్ధాంతాలను స్వీకరించి వానిని తమ మనోవైజ్ఞానిక నవలల్లో ప్రయుక్తం చేసినవారిలో బుచ్చిబాబు, గోపీచంద్ రాచకొండ, జి. వి. కృష్ణారావ్ ప్రభుతులు ముఖ్యులు. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' లో ఈడిపస్, ఎలెక్ట్రా కాంప్లెక్సుల ప్రభావం, గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'లో సూపర్ ఇగో-ఇగో-ఈడ్‌ల సంఘర్షణ, రాచకొండ 'అల్పజీవి' లో. ఆడ్లర్ ప్రతిపాదించిన 'ఆత్మన్యూనత్వ' ప్రతిపాదన, కృష్ణారావు 'కీలుబొమ్మలు' లో మానవజీవితాలపై కలల. కలలవంటి అస్పష్ట సందేహాల ప్రభావం - ఇవన్నీ తెలుగుతనాన్ని రంగరించుకొని, తెలుగు నవలను సుసంపన్నం చేశాయి. ఫ్రాయిడ్, బెర్గ్‌సన్‌లు నిర్వచించిన క్రమబద్ధం కాని కాలప్రవాహ భావాన్ని భాస్కరభట్ల కృష్ణారావు తన 'వెల్లువలో' 'హూచిక పుల్లలు' నవలలో ప్రతిపాదించాడు,

మనోభావాల వ్యక్తీకరణను శిల్ప విధానంగా మలుచుకొన్న వినూత్న కథా కథన పద్ధతులను గురించి చెప్పుకొనే ముందు మరికొన్ని పాశ్చాత్య నవలా రీతుల్ని, వాటికి తెలుగులో అస్పష్టంగా కనిపించే ఉదాహరణల్ని పేర్కొంటాను. జాగృతం కాని సమాజ వ్యవస్థను, చేతన కాని మానసిక స్థితికి చెందిన ఒక వ్యక్తి జీవితాన్ని హాస్య, వ్యంగ్యాత్మ

కంగా చిత్రించే Picarerque నవలకు ఉదాహరణలుగా చిలకమర్తి వారి 'గణపతి'ని, మొక్కపాటి వారి 'బారిస్టరు పార్వతీశా'న్ని పేర్కొనవచ్చు.

అర్థరహితమయిన మానవ ప్రపంచాన్ని తాత్త్వికదృష్టితో చూచి మానవ జీవితాల అసంబద్ధతను వ్యక్తీకరించే నవలను grotesque novel అంటారు. Thomas mann, escenter epass వంటి జర్మనుల చేతుల్లో ఒక విమాత్నమయిన ప్రక్రియగా రూపొందిన యీ రకం నవలలు జి.వి. కృష్ణారావు ఎప్పుడో వ్రాసిన 'జఘనసుందరి', రావూరి భరద్వాజ వ్రాసిన 'కరిమింగిన వెలగపండు.'

ఇవికాక జర్మనీ దేశంలోనే ప్రఖ్యాతమైనది bilding rowar (uitiation novel) కౌమారం నుంచి యౌవన దశలోకి ఎదుగుతున్నవారి మానసిక సంఘర్షణ, వారిని కొత్త అనుభవాల వైపుకు తిప్పే స్థితిగతుల చిత్రణఈనవల ముఖ్యోద్దేశం. పీరాజీ 'తొలిమజిలీ', కొమ్మూరి 'హౌస్ సర్జన్', నవీన్ 'అంపశయ్య' ఇటువంటి నవలలు.

మానవుడు తన జీవిత సార్థకతను, అర్థాన్ని గురించి తాత్త్విక చింతన చేసుకొనే అస్తిత్వ (existentialism) నవలకు వడ్డెర చండీదాస్ వ్రాసిన 'హిమజ్వాల', వినుకొండ నాగరాజు వ్రాసిన 'ఊబిలో దున్న' ఉదాహరణలు.

ఇక-పాశ్చాత్య నవలల్లో ప్రయుక్తం చేసిన శిల్ప వైవిధ్యాన్ని తెలుగువారు ఎంతో నేర్పుగా తమ నవలల్లో ఉపయోగించుకొన్నారు. చైతన్య స్రవంతి పద్ధతిని అనుసరించిన నవీన్ 'అంపశయ్య', 'ముళ్ళపొదలు', పరిమళా సోమేశ్వర్ 'అంతరంగతరంగాలు' ఈ కోవకు చెందిన ముఖ్య ప్రయోగాలు. కాని పాత్రగతమైన అంతరంగ కథనాన్ని నేర్పుగా ఉపయుక్తం చేసుకున్న రచనల్లో రావిశాస్త్రి 'అల్పజీవి', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపులో మరకలు', చలం 'అమీనా' ముఖ్యమైనవి.

ఇతర శిల్ప విధానాలలో ప్రథమ పురుష కథనం, వేరువేరు వ్యక్తుల ప్రథమ పురుష కథనంవంటివి తెలుగులో విరివిగానే ప్రయుక్తం చేయబడ్డాయి. లేఖనాత్మక నవలా విధానం కూడా ముప్పాళ కృష్ణవేణి, గన్నిశెట్టి, పాము నిచ్చెనవంటి రచనల్లో మనకు కనిపిసుంది. అలానే డైరీల ద్వారా కథను నడిపించడం కొడవటిగంటి 'సరోజ డైరీ', ముప్పాళ 'నా డైరీలో ఒకపేజీ' వంటి రచనల్లో ప్రయుక్తం చేయడం జరిగింది. ఇలా ఎన్నో-మొత్తంమీద తెలుగు నవలమీద పాశ్చాత్య ప్రభావ విస్తృతి తెలుగు నవల చరిత్ర అంత విస్తృతం.

(-ఆకాశవాణి హైదరాబాద్ సౌజన్యంతో)

విశాఖ వాడుక
భాషా సదస్సుకి
సమర్పించిన పత్రం

స్నాతకోత్తర స్థాయిలో "వాడుక భాష" తెలుగు

ప్రొఫెసర్
కొత్తపల్లి
వీరభద్రరావు

మానవుల్లో "భాష"గా చెలామణీలో ఉన్న భావ వ్యక్తీకరణోపకరణం అందరికీ అందుబాటులో ఉన్న సాధనం. మనిషిగా పుట్టిన ప్రతివాడికీ భాషించడానికి కావలసిన అవయవాలన్నీ సహజంగా ఉంటాయి. తాను పుట్టిన సమాజం తాలూకు భాష ప్రతి మనిషికీ వచ్చి అది మాతృభాష అవుతుంది. ఇది ఎంత సహజంగా కనబడినా, ఆనువంశికంగా ఏ భాషా ఎవడికీ సంక్రమించేదికాదు. వివిధ ప్రజలలో వివిధ భాషలు ఆనువంశికంగా వచ్చేవే అయితే, ఒకరి భాష ఇంకొకరు నేర్చుకోవడం అనే ప్రశ్నే ఉండదు. మనిషికి భాషించే శక్తి సహజ సిద్ధంగాని ఏ భాషా అజన్మసిద్ధం కాదనేదే దీని తాత్పర్యం. ఇందువల్ల, మనుష్యుల్లో జన్మతః ఎక్కువ తక్కువలు లేనట్లే భాషలో కూడా గొప్పవి, తక్కువవి అనేవి లేవు. తాను పుట్టిన – లేకపోతే, తాను ఉపయోగంలో ఉన్న సమాజం తాలూకు అవసరాల్ని తీర్చే శక్తి ప్రతి భాషకీ ఉంది. ఈ దృష్టిలో చూస్తే, మనం నాగరిక భాషలనుకొనే వాటికి ఉన్నన్ని శక్తి సామర్థ్యాలు అనాగరిక భాషలను కొనే వాటికీ ఆ పరిధిలో ఉన్నట్లు అర్థమవుతుంది. ప్రతి వ్యక్తి మాతృభాష, అతని భావోద్రేకాలతో, ఆశలతో, ఆశయాలతో ముడిపడి ఉండి వైయక్తికంగా అతనికీ సమాజానికీ మధ్య వారధిలా ఉంటుంది. సమాజం అతని భాషని తీర్చిదిద్దుతుంది. అతను తన భాషద్వారా సమాజాన్ని ప్రభావితం చేస్తాడు.

ఏ వ్యక్తికయినా, ఇతర భాషల్లాగే, మాతృభాష కూడా నేర్చుకోకుండా

వచ్చేది కాదని కొంచెం ఆలోచించే ప్రతి ఒక్కరికీ తెలిసే విషయమే. ఈ నేర్చుకోవడం అనేది పుట్టింది మొదలు ప్రారంభం అయ్యే క్రియ. మాట్లాడే శక్తి ఉన్న ప్రతివ్యక్తి ఏదో ఒక భాషలో జీవితాన్ని ప్రారంభించి కాల క్రమంగా దాన్లో ప్రావీణ్యాన్ని - అవసిరాల్ని బట్టి, అవకాశాన్నిబట్టి, తన శక్తి సామర్థ్యాల్ని బట్టి పెంపొందించుకొంటూవస్తాడు ఈ మాతృభాష నేర్చుకొనే కొనేకాలంలోనే_ఇంటా,బయటా ఎన్నో విషయాలు నేర్చుకొంటాడు. అడుగడుగునా,తప్పొప్పులు _సమాజ దృష్ట్యా, శిష్ట జనవ్యవహారం, దృష్ట్యా - తెలుసుకుంటూనే ఉంటాడు. ఇది ప్రతి వ్యక్తిలోను జీవితాంతంజరుగుతూనే ఉంటుంది. ఇంచుమించు, ఇదే పద్ధతిని, ఇతర భాషల్ని కూడా వీలువెంబడి నేర్చుకొంటాడు. అవన్నీ అతనికి ద్వితీయ భాషలు.

సామాజిక విషయమైన భాష ద్వారా వ్యక్తి తన దైనందిన వ్యవహారాలు నడుపుకోవడమే కాకుండా - తన సాహిత్య సంస్కృతుల్ని, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాల్ని అభివృద్ధిపరుచుకొంటాడు. సామాజిక వ్యవహారాలకు పనిముట్టుగా పనికివచ్చే భాష, చిట్టచివరకి సామాజిక ప్రగతికి ప్రతీకగా కూడా నిలుస్తుంది. ఇంత విస్తృత పరిధిలో వికసిస్తూ విహరించే భాష, వ్యక్తి కృషి లోపంవల్ల గాని సమాజం వహించే తటస్థ్యంవల్ల గాని నిర్వీర్యంకావడం ఉంది. తోడిన కొద్దీ నీరూరే జలఉన్న నుయ్యిలాంటిది భాష. వాడినకొద్దీ వాడి తేరి నిశితత్వం సంతరించు కొంటుంది భాష. దాని నైపుణ్యం పెరుగుతుంది. ఏదైనా ఒక భాష శక్తి సామర్థ్యాలు,సంపన్నత అనేవి దాన్ని ఆ భాషా భాషీయులు వాడుకొనే రీతులమీద, పరిస్థితులమీద ఆధారపడి ఉంటాయి. జీవితంలోని, సమాజంలోని వివిధ ప్రయోజనాలకు భాషను వినియోగిసే అది నిరంతరం అభివృద్ధి పొందుతూనే ఉంటుంది. దాని సామర్థ్యం పెరుగుతూనే ఉంటుంది. మానవ ప్రగతికి అంతం లేనట్లే, భాషా శక్తికి అవధులు లేవు.

అభివృద్ధి పొందిన దేశాలు తమతమ భాషల్ని కాలక్రమానుగతంగా తీర్చి దిద్దుంకొంటూ వచ్చి నేటికి వాటిని ఆధునిక విజ్ఞాన ప్రసారానికి ఉత్తమ సాధనాలుగా మలుచుకొన్నాయి. ఈ కృషి నిర్విరామంగా జరుగుతూ ఉండవలసిందే. ఈనాడు ప్రపంచ విజ్ఞాన రంగంలో ప్రముఖపాత్ర వహిస్తూ ఉన్న ఇంగ్లీషు మొదలైన భాషలు, ఆయా దేశాల్లో ఒకప్పుడు - మన భాషల విషయంలో మనం, అప్పుడు, ఇప్పుడు, అప్పుడప్పుడు అనుకొనే విధంగానే _ నవీన భావాల్ని వ్యక్తం చెయ్యడానికి శక్తిమంతమైనవి కావనే భావం కింద నలిగిపోయినవే. ప్రజల అభివృద్ధి, భాషాభివృద్ధి సమాంతరంగా నడిచేవి అనే విషయం మనం గుర్తించాలి

నవీన భారతీయ భాషల్ని మనం అనేక శతాబ్దులుగా కావ్యభాషలుగా తీర్చి దిద్దుకొంటూ రావడంవల్ల హృదయ సంబంధమైన వివిధవిషయాల్ని, భావాల్ని వ్యక్తం చెయ్యడానికి సామర్థ్యం వున్న

పదజాలం, వాక్య నిర్మాణ రీతులు మన భాషల్లో కోకొల్లలుగా పెరిగి వున్నాయి. మన సమాజ వ్యవస్థ నిలిచివున్న పునాదుల్ని గట్టిపర్చేవిగా నిలిచివున్న భావజాలాన్ని చిత్రించగలిగిన శబ్దాలు, ఉక్తి వైఖరులు విరిగిపడేటంత ఎత్తుగా పెరిగి వున్నాయి. కాని, ఆధునిక విజ్ఞానాన్ని అనుభూతుల్ని, అవసరాల్ని తగు మాత్రంగా నయినా వ్యక్తం చెయ్యగల సమర్థత నవీన భారతీయ భాషల్లో చాలా వాటికి ఇంకా పూర్ణంగా లేదంటే సత్య దూరంకాదు. సమాజంలోని వ్యవహారలకు అన్ని రంగాల్లోను పనికివచ్చే ప్రయోజనాత్మకతను మన భాషలింకా సాధించలేక పోయినాయి అంటే మన భాషల అభివృద్ధికి మనమింకా పఠన పాఠనాదుల విషయంలో ఎంత కృషి చేయవలసి ఉందో తెలుస్తుంది.

మన భాషలిప్పుడు విద్యారంగంలోను పరిపాలనా రంగంలోను ఉన్నత స్థాయులలో ఉపయోగంలోకివస్తున్నాయి మన తెలుగు విద్యారంగంలో-ఇంచుమించుగా అన్నిస్థాయులలోనుమాధ్యంగా వికసిస్తోంది. పరిపాలనా రంగంలో జిల్లాలను దాటుతూ రాజధానివైపు పయనిస్తోంది. భారత దేశంలో అన్ని ప్రాదేశిక భాషలకు ఇదివరకు ఎన్నడూలేని ప్రాభవం సంప్రాప్తమయింది. ప్రజలు అన్ని రంగాల్లోనూ వాళ్ళ వాళ్ళ భాషల్లో కార్యకలాపాలు నెరవేర్చుకోవడంనేర్చుకొంటున్నారు. ఒకప్పుడు పండితుల చెప్పుచేతల్లో వినయ విధేయతల్ని అలవర్చుకొని కవుల మార్గాన్నిబట్టి విడిగా "మడి"గా నడుస్తూ వచ్చిన కావ్య భాష కూడా నేడు ప్రజల సొత్తై స్వేచ్ఛను, స్వచ్ఛతను ఇతోధికంగా సంతరించుకొని పురోగమిస్తోంది. ఈ వాక్యాలు ఇంచుమించుగా అన్ని భారతీయ భాషలకూ వర్తిస్తాయి. మన తెలుగు సంగతి మనకు బాగా తెలిసిందేకదా!

ఈ అనుకూల పరిస్థితులున్నప్పుడు మన భాష పఠన పాఠనాల విషయంలో సముచితమైన మార్పులు తెచ్చి సక్రమ మార్గంలో స్వల్పకాలంలో అది అభివృద్ధి పొందేటట్లు చెయ్యవలసినబాధ్యత అందరిమీదా వుంది. ముఖ్యంగా విద్యాసంస్థల్లోపనిచేస్తున్నవాళ్ళమీదఎక్కువగా వుంది.ఈమార్పులుప్రాథమికపాఠశాలదశనుంచి విశ్వవిద్యాలయ దశవరకురావలసి ఉన్నాయి. ఈ మార్పులకు వెనుకవున్న సామాజికాది పరిస్థితుల్ని విద్యార్థులు, అధ్యాపకులు బాగా అర్థంచేసుకోవాలి. ఈ అవగాహన లేనప్పుడు ఆచార్యులు చిత్తశుద్ధితో వీటిని ఆచరణలో పెట్టలేరు. ఆనందంతో విద్యార్థులు వీటిని ఆదరించలేరు. సమాజంలో లోతుగా మార్పుల్నితెచ్చే ఏ ప్రణాళికలు ఆచరణలో పెట్టవలసివచ్చినా. ముందుగా ఆ మార్పుల ఫలితాల్ని అనుభవించే ప్రజల సహకార సంపద లభించాలి. విద్యాసంబంధమైన మార్పులు దీర్ఘ కాలికాలు, గంభీరాలు కావడంవల్ల! అన్ని వర్గాల వారి ఆమోదం ఈ మార్పులు సత్ఫలితాలు ఇవ్వడానికి కావాలి. తెలుగు భాషా సాహిత్యాల్ని చాలావరకు తీర్చిదిద్దేవాళ్ళు అభిమానవిషయంగా తెలుగు తీసుకొని చదివేవాళ్ళూ, వాళ్ళకు చదువు చెప్పేవాళ్ళూ అనడం నిర్వివాదమయిన

విషయం. వీళ్ళిద్దరూ చిత్తశుద్ధితో ప్రవర్తి సే తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధిలో సంశయంలేదు.

స్నాతకోత్తర స్థాయిలో తెలుగును అధ్యయనం చేసేవాళ్ళు, ఆ భాషలో పండితులు, పరిశోధకులు కావాలనే నిర్ణయానికి వచ్చిన వాళ్ళకింద లెక్క. లేకపోతే ఎందుకీ శ్రమ? వీళ్ళ పాఠ్యప్రణాళికలో తేవలసిన మార్పుల్ని గురించి నేనిక్కడ ఎక్కువగా ప్రస్తావించను. అక్కడ తెచ్చే మార్పులు, విద్యార్థుల్ని పాత విషయాల్లో పండితులయ్యేటట్లు తీర్చిదిద్దటమే కాకుండా కొత్తవిషయాల్ని ఆహ్వానించే వాళ్ళలా, సమాజ పురోగతిని కాంక్షించి కృషిచేసే వాళ్ళలా, లౌకిక ప్రపంచంలో విజ్ఞతతో వ్యవహరించే వాళ్ళలా తీర్చిదిద్దేవిగా వుండాలి ఇదంతా విషయానికి సంబంధించినవి ఇంక భాషకు సంబంధించిన మార్పుతో ఇక్కడ ప్రత్యేక సంబంధం వుంది.

కొన్ని విశ్వవిద్యాలయాలలో వాడుక భాషలో సమాధానాలు వ్రాయవచ్చనే అనుజ్ఞవుంది. ఎం. ఫిల్. పి. హెచ్ డి. లలో కూడా వాడుక భాషను ఉపయోగించ వచ్చుననే అనుమతి వుంది. కాని నా అనుభవంలో కనబడినది ఏమంటే— అనుమతి చాలదని, విద్యార్థులకు అనుమతి ఉంది గాని వాడుక భాష నేర్పడమనేది మన పాఠ్య ప్రణాళికల్లో కనబడదు. ఆధునిక భాష పేరిట, భాషాశాస్త్రాధ్యయనంపేర ఏదో కొంత చెబుతున్నాము. అది చాలదు. మన కందరికి అనుభవమైన విషయమే నేను చెబుతున్నాను. ఎం.ఏ. పేపరు చూసినా, ఎం.ఫిల్; పిహెచ్.డి. పరిశోధన సిద్ధాంత వ్యాసాలు చూసినా అక్కడ కనబడే భాష చాలా నిరుత్సాహ జనకంగాఉంది. వాడుకభాష అంటే తనకు ఆ క్షణం ఏమితోస్తే, ఏ శబ్దం తట్టితే, ఏ క్రియారూపం జ్ఞాపకం వస్తే – అది/అవి ప్రయోగించి పారవేయడం కాదనీ, వాడుక భాషలో కూడా అందమయిన ప్రయోగాలు ఉన్నాయనీ అవి తెలియక పోతే నేర్చుకొని వాటిని తనవి చేసుకొని ప్రయోగించిననాడే రచన అందంగా ఉంటుందని విద్యార్థి తెలుసుకోవాలి. ఇవి విద్యార్థికి నేర్పడానికి మన పాఠ్య ప్రణాళికల్లో తగిన అంశాలు బోధించాలి.

వీటిని బోధించడానికి ముందు పాఠ్య సామగ్రి కావాలి. ఈ సామగ్రిని రెండు రకాలుగా విభజించవచ్చు. (1) సాహిత్య సంబంధి, (2) భాషాసంబంధి. వాడుక భాషలో అలనాటినుండి నేటివరకు – అంటే శాసనాలనుండి నేటి పత్రికల వరకు – ఉన్న మంచి రచనల్ని ఏర్చి కూర్చి – యుగాల ననుసరించిగాని, శతాబ్దుల ననుసరించిగాని – విభజించి; తెలియని మాటలకు, ప్రయోగాలకు 'నోట్సు' వ్రాసి వాచకాలుగా ప్రచురించాలి. ఈ 'సాహిత్య సామగ్రి' యావత్తు మొదటి రకమైన 'సాహిత్య సంబంధి'గా వచ్చి రెండో 'భాషా సంబంధి'కి లక్ష్య ప్రాయంగా ఉంటుంది. లక్షణ రచనకు ముందు లక్ష్యం ఉండాలి గదా! ఇదంతా 'వాడుకభాష'లోని వచన రచనలని చెప్పనక్కరలేదు.

ఇంక లక్షణ రచన, సమర్థులయిన నవీనులయిన భాషాశాస్త్రవేత్తల హస్త

గతం కావాలి, వీళ్ళు పండితులూ సహృదయులూ కావాలి. వాడుకభాషలో మాండలికాలకు కూడా సముచిత స్థానం ఉంది గనక ప్రాదేశిక సామాజి పరిధుల్లో జరిగిన మాండలిక పరిశోధన సామగ్రిని కూడా వినియోగించుకొని ఈ లాక్షణికులు ముందడుగు వెయ్యాలి. మాండలికాది పరిశోధనల్లో పురోగమిస్తూ ఉన్న సాహిత్య అకాడమి, తెలుగు అకాడమి మొదలయిన సంస్థలు ప్రచురించిన మూలభూత రచనలు ఈ సందర్భంలో పేర్కొనదగినవి. వీటినన్నింటిని వినియోగించుకొని వ్యాకరణాది లక్షణ గ్రంథాలు బయలుదేరిననాడే వాడుకభాష సుందరంగా వాగ్రూపంగా లిఖితరూపంగా వృద్ధిపొందుతుంది. 'భాషాసంబంధి' సామగ్రిలోనే చేర్చదగినది, వ్యావహారిక భాషా ప్రయోగాలతో ఉన్న నిఘంటువు. మన తెలుగులో నేటికీ సంప్రదాయ వ్యాకరణాలు, పండితులూ రూపసాధనకిచ్చే ప్రాముఖ్యం, శబ్దప్రయోగానికి ఇయ్యడం లేదు 'హూబోడి' (దీన్లో అరసున్నలు ఎన్నో?)ని సాధించమనే వాళ్ళేగాని, సముచిత స్థానంలో ఆమెను కూర్చోబెట్టండి అనేవాళ్ళు లేరు!

ఈ సామగ్రిని ఒక వైపు తయారు చేసుకొంటూనే, ఉన్నంతలో వ్యావహారిక రచనల్ని స్నాతకోత్తర స్థాయిలో విమర్శ దృష్టితో విద్యార్థులచేత చదివించాలి. కఠిన శబ్దాలకు అర్థాలు తెలియడమే పాండిత్యమనే భ్రమప్రమాదాలు దేశంలో విద్యార్థుల్లో అధ్యాపకుల్లో తొలగాలి కఠిన శబ్దాల్నిగూర్చి ఒక్క మాట చెప్పాలి. అసలు మాతృభాషలో అర్థంకాని కఠిన శబ్దాలు కొంత చదివిన వాళ్ళకు ఎలా తటస్థిస్తాయి? ఉదాత్త భావాలు పూర్తిగా సామాన్యుడికి ఆకళింపునకు రాకపోవచ్చు. కాని వాడిన శబ్దాలు ఎందుకు అర్థంకాకుండా పోతున్నాయి? వేమన్న పద్యాల్లో సాధారణంగా అర్థంకాని శబ్దాలుండవే! అర్థంకాని గంభీర భావాలుండవచ్చు. దీనికి కారణం తెలుగులో పుంఖాను పుంఖాలుగా సంస్కృతాది భాషల్లోనుండి మాటలు గుప్పించడం. తెలిసిన తత్సమాలు, తద్భవాలు, మిగిలిన మాటలు, దేశి శబ్దాలతో కలిపి ఎంత ప్రయోగించినా పరవాలేదు. ప్రాచీన కావ్యాల్ని మనం చదవడంతప్ప ఇంకేమీ చేయలేం గనుక, వాటిని స్నాతకోత్తరస్థాయి విద్యార్థిచేత చదివిద్దాం కాని, నాయనా అలా వ్రాయకు. ఎవళ్ళూ చదవరు అని కూడా చెబుతూ ఉందాం. వాడుక భాషలో విద్యార్థిచేత వ్యాసాలు వ్రాయించి వాటిని దిద్దుతూ వాడుకభాషను సుందరంగా ఎలా వ్రాయాలో నేర్పుతూ ఉండాలి. లక్ష్య లక్షణ సమన్వయం తరగతుల్లో జరుగుతూ ఉన్నప్పుడే వాడుకభాష స్నాతకోత్తర స్థాయిలో నిలుస్తుంది.

వాడుకభాష స్వరూప స్వభావాలను చరిత్ర దృష్టితో అధ్యయనం చేయించే ప్రణాళిక ఒకటి స్నాతకోత్తర స్థా...లో ఉండాలి ఈ సందర్భంలోనే "ప్రయోజనాత్మక" తెలుగును గురించి కూడా కొంత చెప్పాలి. ఆధునిక యుగంలో మన అవసరాలను పురస్కరించుకొని తెలుగును కేవలం సాహిత్య భాషగా

నెత్తురు కవిత

శ్రీ నగేష్

కవీ
కళ్ళు తెరువు
కాలం మారిపోయింది
కావ్యకన్యల కలలు
కలంతో ముడివేసే
కాలం తీరిపోయింది.
దేశాన్ని
రాబందులు భక్షిస్తున్నాయి
తిరగబడి అరిచేవాళ్ళని
మరతుపాకి గుళ్ళు తినేస్తున్నాయి
అన్యాయమని చాటేవాళ్ళని
కసాయి కత్తులు కాటేస్తున్నాయి
కోటిప్రజల కోరికల స్వర్గాల్ని
సామాన్యుడి మాన ప్రాణాల్ని
అధికార దాహాలు
కొల్లగొట్టేస్తున్నాయి.
కళ్ళువిప్పి నిజం చూచి
కలల్లో అమృతం తాగటం మాని
కలంతో నెత్తురుకవిత రాయి
కాలంతో కలుపు నీ చేయి

కాకుండా ఇతర వృత్తులవాళ్ళు ఉపయోగించు కొంటారు. వాళ్ళే మన ఇంజనీర్లు, డాక్టర్లు, ఉద్యోగులు, కంపెనీ యజమానులు, కార్ఖానాల పనివాళ్లు – వీళ్ళు వాళ్ళూ ఏమిటి? అందరూ, వీళ్ళకి తెలుగు రావడానికి కొలబద్ద "మను చరిత్ర పద్యం" కాదు. వాళ్ళ భావాల్ని సూటిగా తేటగా తెలుగులో చెప్పగలిగి ఉండడం. దీనికి ప్రయోజనాత్మకంగా అభివృద్ధి పొందిన వాడుక తెలుగు మాటలు చాలా ముఖ్యం. స్నాతకోత్తర స్థాయిలో తెలుగు చదువుతూ భవిష్యత్తులో తెలుగు స్థానాన్ని వికాసాన్ని నిర్ణయించే ఈ విద్యార్థులు తమ ప్రణాళికలో భాగంగా "ప్రయోజనాత్మక" తెలుగును కూడా అధ్యయనం చెయ్యాలి. ఇది సహజంగా వాడుక భాషే అవుతుంది.

ఇన్ని విధాలుగా వాడుక భాష స్నాతకోత్తర స్థాయిలో పఠన పాఠనాల్లో ఉండి మన పురోగతికి తోడ్పడ గలదు. దీని అభివృద్ధికి ముఖ్యమైన "సాహిత్య సంబంధి, భాషా సంబంధి" పాఠ్య సామగ్రి సిద్ధం కావలసి ఉంది. వాడుక భాష మంచి చెడ్డలు, గ్రాహ్యమా అగ్రాహ్యమా? అది అనే చర్చలకాలం అయిపోయింది. వాడుక భాష వచ్చి ఉంది. సామాన్యుడు వేచి ఉన్నాడు. ఈ ప్రజాయుగంలో ఇద్దరికీ అవినాభావ సంబంధం, విశ్వవిద్యాలయాలు విహాయస మార్గంనుండి భూమికి దిగి అందరికీ పనికివచ్చే అందరూ బగుపడే విషయాలు చెప్పడం మనకూ, భావితరానికీ కూడా మంచిది. ఇష్టమున్నా లేకపోయినా మంచిపని చేస్తే కష్టం లేకుండా ప్రగతి సాగుతుంది లేకపోయినా ప్రగతి ఆగదు. కష్టపడవలసి వస్తుంది. అంతే భేదం.

విశాఖ వాడుక భాషా సదస్సుకు
సమర్పించిన పత్రం

ఆధునిక తెలుగు కవిత్వంలో భాష

డా|| కె. కె. రంగనాథాచార్యులు

మనిషిని ఇతర ప్రాణికోటి నుంచి వేరుచేసేది భాషా, పనిముట్లూను. చరిత్రలో మనుష్యులు ఇతర జంతు జాలం నుంచి వేరుగా రూపొందడానికీ, వాళ్ళు ఒక సమాజంగా ఏర్పడటానికీ, ఆలోచనా శక్తి పెరగటానికీ, సామాజిక ఉత్పత్తులను పెంచుకోవటానికీ, ప్రకృతి శక్తులను జయించటానికీ మానవజాతి ఈరోజు కనిపిస్తున్న అభివృద్ధి దశను చేరుకోవటానికీ భాష ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడింది. భాష ఎట్లా పుట్టిందో మనం ఈరోజు స్పష్టంగా చెప్పలేకపోయినా భాషలేని మానవ సమాజాన్ని మనం ఊహించుకోలేం. వర్గాలుగా మానవ సమాజం చీలక ముందు నుంచీ భాష ఉంది.

ఏ దశలోనైనా సమాజ స్థితికి మూలం (base) ఆర్థిక సంబంధమైంది. పరస్పర ఆర్థిక సంబంధాలే సమాజ స్వరూపాన్ని నిర్ణయిస్తాయి. ఉపరితల విషయాలైన (superstructure) రాజకీయం, మతం సాహిత్యం, రాజ్యాంగం మొదలైనవి ఈ మూలంపైన ఆధారపడి ఉంటాయి. మూలం మారినప్పుడు ఉపరితలానికి సంబంధించినవన్నీ వాటంతట అవే కూలిపోతాయి. వర్గాలు ప్రధానమైన సమాజంలో ఉపరితల విషయాలు కూడా వర్గసంబంధులై ఉంటాయి.

కాని భాష మూలంలో కాని, ఉపరితలంలో కాని భాగం కాదు. భాషకు మూలం ఆర్థిక శక్తులూ, ఉత్పత్తి శక్తులూ కావు. అది ఒక వర్గం సృష్టించింది కాదు. సమాజంలోని అన్ని వర్గాల సమిష్టి సృష్టి అది. అది ప్రత్యేకంగా ఒక వర్గం అవసరం కోసం కాక, అన్ని వర్గాల అవసరం కోసం రూపొందింది. పాత వ్యవస్థలోను, కొత్త వ్యవస్థలోను ఒకే రకంగా, పాలకులు: పాలితులు, పీడకులు పీడితులు అందరికీ ఒకేవిధంగా భాష ఉపకరిస్తుంది. అంటే చారిత్రకంగా అనేక కాలాల ఉత్పత్తిగా భాషను గ్రహించవచ్చు. అనేక కాలాల పరిణామ క్రమంతో అన్ని వర్గాల సమిష్టిగా సృష్టిగా అభివృద్ధి చెందిన భాష

మూలం కంటే ఉపరితలంకంటే ఎక్కువ కాలం ఉంటుంది. మూలం మారినప్పుడల్లా దానితోపాటు భాష పూర్తిగా తొలగటం కాని, దాని నిర్మాణ స్వరూపం తొలగటంకాని కొత్త పదజాలంతో, వ్యాకరణంతో కొత్త భాష పుట్టటంకాని జరగదు ఆయా కాలాల్లో భాషలో మాండలిక భేదాలూ, స్థానిక భేదాలూ ఏర్పడినా అది ఆ జాతి ప్రధాన భాషలో భాగాలేకాని అవి వేరు భాషలో వర్గ భాషలో కావు. కాకపోతే మారిన సమాజంలో సాంస్కృతిక, వైజ్ఞానిక అవసరాలను బట్టి, ఉత్పత్తుల అభివృద్ధి క్రమాన్ని బట్టి కొత్త వస్తువులను, భావాలను సూచిస్తూ కొత్త పదాలు భాషలో చేరవచ్చు. మౌలిక పదజాలానికి సంబంధించినంత వరకు అది అలాగే భాషకు ప్రాణంగా నిలుస్తుంది. వాటి ప్రయోగం ఆ భాషకు చెందిన సమానమైన వ్యాకరణ సూత్రాలపైననే జరుగుతుంది.

తెలుగు భాషకు సంబంధించినంత వరకు భాషలో వచ్చిన మార్పులను గురించి మనం చెప్పుకునేటప్పుడు ప్రధానంగా అది పద నిర్మాణానికి, ధ్వని నిర్మాణానికిసంబంధించినది మాత్రమే. వ్యాకరణం, అంటే ప్రధానంగా వాక్య నిర్మాణ పద్ధతులకు సంబంధించినంత వరకు తెలుగు భాషా చరిత్ర తెలిసిననాటి నుంచి మార్పు చాలా తక్కువగా కనిపిస్తుంది. తెలుగులో గ్రాంథిక, వ్యావహారిక భాషా భేదాలు ప్రధానంగా పద నిర్మాణంలో, ధ్వని నిర్మాణంలో ప్రాచీనతను, ఆధునికతను సూచించేవిగా మాత్రమే మనం భావించాలి.

మానవ సమాజంలో భాష అంటూ ఉన్న నాటినుంచీ సాహిత్యం ఉంది. ప్రతి ఆదిమ సమాజంలోనూ సామూహిక గానాలూ, కథలూ మొదలయిన రూపంలో సాహిత్యం కనిపిస్తోంది. ఏభాషలోనైనా సాహిత్యం మొదలయినప్పుడు సాహిత్య భాషకీ, వ్యావహారిక భాషకీభేదం ఉండి ఉండదు. క్రమంగా ఇతర సామాజిక సంప్రదాయాలలాగే రచనా భాషా సంప్రదాయం కూడా ఒకటి ఏర్పడి స్థిరపడుతుంది. భూస్వామ్య వ్యవస్థలో పాలకుల ప్రయోజనాన్ని కాపాడటానికి అనుకూలంగా ఇతర సామాజిక విషయాలను స్థిరీకరించటానికిప్రయత్నించి నట్టుగానే, సాహిత్యానికి సంబంధించి, భాషకు సంబంధించి వర్గ ప్రయోజనాలకనుగుణంగా కొన్ని సంప్రదాయాలను స్థిరీకరించటానికి ప్రయత్నం జరుగుతుంది. తెలుగులో భూస్వామ్య వ్యవస్థ స్థిరపడిన దశలో నన్నయనాటి నుంచి ప్రారంభమయిన సాహిత్య చరిత్రను పరిశీలిస్తే మనకీవిషయం స్పష్టపడుతుంది. భూస్వామ్య సమాజంలో లిఖిత సాహిత్యం పేరిట స్థిరపడిన సాహిత్యం కొందరికోసం మాత్రమే సృష్టించటం జరుగుతుంది. ఆ కారణంవల్ల, భావజాలంతో పాటు రచనా భాషను మార్చుకోవలసిన అవసరం కూడా వారికి లేదు. నన్నయ భారత భాష, నన్నయకు మూడువందల సంవత్సరాలకు పూర్వమే స్థిరపడింది. అంటే నన్నయకు పూర్వమే సాహిత్య భాష లేక గ్రాంథికభాష,

వ్యావహారిక భాషా భేదాలు స్థిరపడ్డాయన్నమాట. గ్రాంథిక భాషలో ఆనాటి నుంచి కొన్ని శతాబ్దాల వరకు మార్పులు లేకపోవటానికి కారణం అప్పటి సమాజంలోని ఉన్నత వర్గాలకు పనికి వచ్చే సాహిత్య సృష్టికి, వారికున్న పరిమిత విజ్ఞానానికీ ఆ భాష సరిపోవటమే. లిఖిత సాహిత్యంతో సమాంతరంగా జానపదుల సాహిత్యం అనేది ఆదిమకాలంనుంచి ఈనాటి వరకూ కొనసాగుతూనే ఉన్నది. జానపదులలో, సాహిత్య భాషకు, వాడుక భాషకు లిఖిత సాహిత్యంలో ఉన్నంత భేదం కనిపించదు. ఉన్నత, పండిత వర్గాల భాషలో కూడా అనేకమయిన మార్పులు వచ్చాయనటానికి శాసనాధారాలున్నాయి. కాని సాహిత్యంలో అప్రయత్నంగా ప్రవేశించిన కొన్ని సందర్భాలలోతప్ప సాహిత్య భాషను అవి పూర్తిగా ప్రభావితం చేయలేదు.

పెట్టుబడిదారీ సమాజంలో భూస్వామ్య వ్యవస్థలో లాగా భిన్న నాగరికతల సంబంధాలు, భిన్న సమాజాల సంబంధాలు పరిమితం కావు. బూర్జువా సమాజంలో దేశాలు ఇతర జాతులతో, దేశాలతో సంబంధం లేకుండా స్వయం సంపూర్ణంగా నిలబడలేవు. అన్ని ప్రాంతాలవారికి, అన్ని వర్గాలవారికి బూర్జువా సమాజంలో పరస్పర సంబంధాలూ, అభిప్రాయ వినిమయాలూ తప్పనిసరి. ప్రజాస్వామ్యం పేరుతో పాలక వర్గానికి సాధారణ ప్రజలతో సంబంధం పెట్టుకోవలసిన అవసరం వస్తుంది. ఎన్నికలు మొదలయినవాటి పేరుతో ఎక్కువ మందికి తమ అభిప్రాయాలను చెప్పుకోవలసిన అవసరం వస్తుంది. అందుకోసం ఎక్కువ మందికి తెలిసే భాష అవసరం అవుతుంది. సామాజికమయిన సంస్కరణలు, ఉద్యమాలు అవసరమైనట్లుగానే భాషా విషయకమైన ఉద్యమాలు అవసరమవుతాయి ఈ సామాజిక అవసరాలను బట్టి వచ్చిందే తెలుగులో వ్యావహారిక భాషోద్యమం.

సాహిత్యంలో ఆధునికయుగ ప్రధాన లక్షణం వచన ప్రక్రియల ప్రాధాన్యం. ఆధునిక యుగ ప్రారంభానికి ముందు తెలుగులో సాహిత్యం అంటే కావ్య సాహిత్యం మాత్రమే. పారిశ్రామికీకరణ, వైజ్ఞానికీకరణ మనిషి విశ్లేషణాత్మక శక్తిని పెంచినప్పుడు దాని కనుగుణంగా వచన ప్రక్రియలు పెంపొందుతాయి. నవల, కథ, వ్యాసం, విమర్శ, చరిత్ర రచన మొదలయిన ప్రక్రియలు వచనంలో భాగంగా ఆధునిక యుగంలో విస్తరించాయి. ఆధునిక సామాజిక అవసరాలను బట్టి అవి ఎక్కువ మందికి అందుబాటులో ఉండాలంటే ఎక్కువ మందికిసమానంగా తెలిసిన భాషలో రచనలు జరుగవలసి వచ్చింది. వ్యావహారిక భాషోద్యమం దీనికి దోహదం చేసింది. ఒకవైపు భూస్వామ్య సమాజానికి ప్రతినిధులుగా పండితవర్గం ప్రాచీన భాషను నిలబెట్టే ప్రయత్నాన్ని వ్యావహారిక భాషోద్యమానికి వ్యతిరేకంగా కొనసాగించింది. గ్రాంథిక భాషావాదుల విరోధాలనెదుర్కొని వ్యావహారిక భాష అన్ని రకాల వచన ప్రక్రియల్లోను స్థిర

పడింది. వ్యావహారిక భాష అనే పేరుతో ఇక్కడ పేర్కొంటున్నది. చదువుకున్న వారు, శిష్టులు అనబడే వారిలో సమానంగా పరిణామం చెందిన భాష ఆధునిక సాహిత్యంలో వచన ప్రక్రియలలో భాష ఇట్లా ఉండగా కవిత్వంలోని భాష విషయంలో దీనికి కొంత భేదం కనిపిస్తుంది.

తెలుగులో ప్రాచీన సాహిత్యంలో ప్రధాన ప్రక్రియ పద్య కావ్యం మాత్రమే. ఆ కావ్య రచన కొనసాగింపుగా ఆధునిక కవిత్వాన్ని గురించి కవితా భాషను గురించి విశేషణ చేయవలసి ఉంటుంది. ఈ కారణం వల్లనే కావ్య భాష పేరిట స్థిరపడిన ప్రాచీన భాషా ప్రభావం ఆధునిక కవిత్వం ప్రారంభమైన దశలోనేకాదు, ఇటీవలి కాలం వరకూ కనిపిస్తుంది. కావ్య భాష కావ్యాల్లో ప్రయోగించిన పరిమితమైన ఛందస్సులకు అనుగుణంగా స్థిరపడిన భాష. ఈ విషయంలో గురజాడ చెప్పిన మాటలను ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి." కావ్య భాష, కవిత్వ రచనలో ప్రయోగించే భాష. ప్రజలంతా నిరక్షరాస్యులు కావటంవల్ల, సక్రమమైన ప్రజాస్వామికఉద్యమాలూమతోద్యమలూ ఏవీరాకపోవడంవల్ల తెలుగు కవులకువచనంలోరాయవలసినఅవసరంకనిపించలేదు దీర్ఘంగా ఉండే వచన భాగాలు ఒక ఛందస్సు విషయంలో మాత్రమే పద్యాలకు దూరంగా ఉన్నాయి. భాషా, శైలీ రెండింటికీ సమానమే. ప్రాచీనాంధ్ర సాహిత్య భాష కావ్య భాష. అది క్లిష్టమైనపద్యరచనారీతిలోసంపూర్ణసంప్రదాయబద్ధంగా వెలువడే పద్య కావ్యాలకు అనుగుణంగానే అభివృద్ధి చెందవలసి వచ్చింది. నిశ్చితమైన భావాలువ్యక్తం చేసేందుకు ఛందోబంధాలనుంచిఎక్కడికక్కడబయటపడేందుకు పనికి వచ్చే పదాల్నీ, వ్యాకరణాను గుణమైనరూపాల్నీ ఎంతో అమూల్యమైన ఆస్తిగా మన భాషలో భద్రపరచి పెట్టుకున్నారు." (గురజాడ అప్పారావు, డి సెంట్ పత్రం, పే.95) ఆధునిక కవిత్వం ప్రారంభ దశలో భావాల్లో, వస్తువులో నవ్యత కనిపించినా కవులు ఛందస్సును పాటించినంత వరకు ప్రాచీన కావ్య భాషే ప్రధానంగా కనిపిస్తుంది. మాత్ర ఛందస్సులో వచ్చిన గేయాలలోకూడా కావ్య భాషా ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. పద్యాలలోకాని, గేయాలలోకాని వ్యావహారిక భాషను ప్రయోగాత్మకంగా ఉపయోగించినవారు లేకపోలేదు, వచనంలో మంచి వ్యవహారికాన్ని ఉపయోగించిన రచయితలు పద్యాలలో గేయాలలో కావ్యభాషా ధోరణులను వదలలేకపోయారు.

ఆధునిక కవిత్వాన్ని ప్రధానంగా నాలుగు దశలుగా విభజించవచ్చు. 1. భావకవితాదశ. దేశ భక్తి కవిత్వం పునరుద్ధరణ కవిత్వం ఈదశలోనే వచ్చాయి. ఈ దశలో పద్య రచనే ఎక్కువగా కనిపిస్తుంది. గేయ రచనలు కూడా ఈ మార్గంలో వచ్చాయి.2అభ్యుదయ కవితా దశ. ఈ దశలో గేయాలు, వచన కవితలు రెండూ సమానంగానే వచ్చాయి. 3. వచన కవితాదశ. ఇది కేవలం రూపాత్మకమైంది మాత్రమే. అభ్యుదయ వాదులతోపాటు సనాతన వాదులూ సమకాలీన అవసరాలను బట్టి వచన కవిత్వాన్ని ఆశ్ర

యించారు. 4. విప్లవ కవితాదశ. ఈ దశ వచన కవితలలో ప్రారంభమైనా గేయరచనలే ఎక్కువగా వచ్చాయి. పైన చెప్పిన ఉద్యమ దశలలో రూపాత్మకంగా వచ్చిన మార్పులు భాషా రూపాలను నిర్ణయించాయి.

భావకవితాదశ

భావ కవిత్వంలో ఎక్కువగా పద్య రచనలు, గేయ రచనలు వచ్చాయి. రూపాత్మకంగా కావ్యరచనా సంప్రదాయాన్ని అనుసరించి స్వీకరించిన వృత్తాలో కావ్య భాషే కనిపిస్తుంది. రాయప్రోలు, కృష్ణశాస్త్రి మొదలైన వారి రచనలన్నీ దీనికి నిదర్శనాలే. వీరు రాసిన గేయాలలో కూడా కావ్య భాషే కనిపిస్తుంది. వ్యావహారిక భాషావాది. వచన రచనలలో వ్యావహారిక భాషను సమర్థవంతంగా ఉపయోగించిన వాడు ఆయన గురజాడ ముత్యాల సరాలలో కూడా ఎక్కువ భాగం కావ్యభాషే కనిపిస్తుంది. ఉదా:-

విరిగి పెరిగితి, పెరిగి విరిగితి
కష్ట సుఖముల పారమెరిగితి
పండనున్న ఆశలెన్నో
ఎండి రాలగ బొగిలితిన్ (లంగ
రెత్తుము)

తెల్లవారలు నీతి నిపుణులు
ఢిల్లి పట్టము కట్టిరిపుడె
కల్ల యెరుగని జార్జిరేని
కజాత శత్రునకున్
(జార్జి చక్రవర్తిని గురించి రాసిన
ముత్యాల సరం)

భాషలో ఏనాడో జారిపోయిన ద్రుతాంతాలను మాత్రా సంఖ్యానుగుణం గురజాడ ఉపయోగించుకోవడం గమనించవచ్చు. అయితే 'దేశభక్తి' గీతంలో గురజాడ చక్కని వ్యావహారికాన్ని ఉపయోగించాడు. గేయాలలో వ్యావహారిక భాషను చక్కగా ఉపయోగించిన వారిలో అడవిబాపిరాజు బసవరాజు అప్పారావు మొదలైన వాళ్ళను చెప్పుకోవాలి. విశ్వనాథసత్యనారాయణ కూడా తన 'కిన్నెరసాని' పాటలలో చాలా భాగం వ్యావహారిక భాషనే ఉపయోగించాడు. ఉదా:-

చేతులారా తాను
చేసుకున్నానని
యింతి కిన్నెరసాని ఏడ్చినా ఏడ్పులో
సుదతి కిన్నెరసాని చూపినా దుఃఖమూ
అవికూడ జలములై ఆమెలో కల
సినై.

మొత్తం మీద ఆధునిక కవిత్వం ప్రారంభ దశలో చాలా కాలం కావ్య భాషా ప్రభావం నుంచి బయట పడలేదనే చెప్పవచ్చు. చాలాచోట్ల కవితా రూపంతో పాటుకవితావస్తువుకూడా భాషారూపాన్ని నిర్ణయించటం కనిపిస్తుంది.

అభ్యుదయ కవితా దశ

ఈదశలో గేయాలూ, వచన కవితలూ రెండూ సమానంగా కనిపిస్తాయి. ఇక్కడ కూడా గేయాల్లో కావ్యభాష, వచన కవిత్వంలో వ్యావహారికభాష కనిపిస్తాయి. అభ్యుదయ కవిత్వానికి మొదటి వాడైన శ్రీశ్రీ వంటి కూడా గేయాలో కావ్యభాషా ప్రభావం నుంచి తప్పుకోలేక పోయాడు. ఉదా:-

చక్రవర్తి అశోకుడెచ్చట
జగద్గురు శంకరుం డెచ్చట
ఏవి తల్లీ నిరుడు కురిసిన
హిమ సమూహములు
కాళిదాస మహా కవీంద్రుని
కవన వాహినిలో కరింగిన
ఉజ్జయిని నేడెక్కడమ్మా
ఉంది? చూపించు. (ఏవి తల్లీ?)

శ్రీ శ్రీ వచన కవిత్వంలో వ్యావహారిక భాషను శక్తివంతంగా ఉపయోగించాడు.

రెండు రెళ్ళు నాలుగన్నందుకు
గూండాలు గుండ్రాళ్ళు విసిరేసీమతో
క్షేమం అవి భాజ్యం అంటే
జైళ్ళ నోళ్ళు తెరచే భూమిలో
అస్వతంత్రుని జయించటానికి
అహింసాయుధం ధరించామంటూ
రక్తపాతం లేకుండానే
రాజ్యం సంపాదించామంటూ
అవి నీతి భారీ పరిశ్రమలో
అన్యాయాల ధరలు పెంచేసి
స్వాతంత్ర్యాన్ని బ్యాంకులో వేసు
కొని
చక్రవడ్డీ తిప్పే కామందులకు ....
(ఖడ్గసృష్టి)

కాళోజీ నారాయణరావువంటి వారిలో కూడా గేయంలోను, వచన కవితలో ఈ భాషాభేదాన్ని చూడవచ్చు. కాళోజీ రాసిన ముత్యాల్య సరానికి ఉదాహరణ:-

మాతృ దేశము మాట ముచ్చట
ముదము గూర్చెడు మదికి ననియెడి
పరమనీచుడు ధరణినంతట
గల వెతికిన గానగున్
(మాతృ దేశము)

కాళోజీ వచన కవితకు కిందిది మచ్చు.

అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు
ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగ బెట్టటం కాదు
ఇందాకా ఏం చేశాడో చూడు
ఇప్పుడు కట్టే ముడుపు కాదు
ఇందాకా చెల్లించింది చూడు
(తస్మాత్ జాగ్రత! జాగ్రత!)

ఇలాగే గేయాలూ వచన కవితలూ రాసిన చాలా మంది కవులలో ఈ భాషాభేదం స్పష్టంగా కనిపిస్తుంది. దీనికి కారణం గేయాలలో పాదనియతి, మాత్రా సంఖ్యానియమాలు ఉండటం, వచన కవితలో ఆ అవసరం లేక పోవటం అని చెప్పవచ్చు, గేయ కవిత్వంలోని నియమాల కనుగుణంగా ప్రాచీన భాష, నవీన భాష అనే భేదం లేకుండా గేయంలో ఇమిడే పద రూపాల్ని కవులు గ్రహించవలసి వచ్చింది. పైన చూపిన శ్రీ శ్రీకి సంబంధించిన ఉదాహరణలో వస్తు భేదాన్ని కూడా గమనించ వచ్చు. 'ఏవి తల్లీ' గేయంలో భావ కవితా ధోరణులు, ఖడ్గ సృష్టిలో సమాజాన్ని గురించిన ఆలోచనలు వస్తువులు. ఈ భేదం కూడా కొంతవరకు భాషా భేదానికి కారణం కావచ్చు.

వచన కవితా దశ

వ్యావహారికభాషకూ,వచనకవితా ప్రక్రియకూ చారిత్రక పరిణామ సంబంధాన్ని కలిపేప్రయత్నంచేశారు కుందుర్తి (అమ్మ

తం కురిసిన రాత్రి: పీఠిక). వచన కవిత్వంలో ఛందోనియమాలూ, పాదనియతులూ లేక పోవటం భాషా రూపాల ఎన్నికలో కవికి స్వేచ్ఛ లభించిన మాట నిజమే దీన్ని ఇతరవచన ప్రక్రియలలో ఉండే స్థితితో పోల్చవచ్చు. ఈ కారణం వల్లనే వచన కవిత్వంలో కవులు స్వేచ్ఛగా వ్యావహారిక భాషను ఉపయోగించారు. వచన కవిత మధ్య తరగతి ప్రక్రియ. భాష కూడా మధ్య తరగతి చదువుకొన్న వర్గంవారి భాష. శ్రీ శ్రీ. కుందుర్తి, ఆరుద్ర మొదలైన కవులందరూ వచన కవిత్వంలో కర్తృలేని వ్యావహారికాన్ని ఉపయోగించారు. వచన కవిత్వంలో కూడా గ్రాంధిక వాసనలను, పలుకుబడులను వదల్లేక పోవటం. అంత్య ప్రాసల క్రీడలను వదలుకోలేక పోవటం కొందరు కవుల్లో కనిపిస్తుంది. ఆధునిక కవిత్వంలో అనేకమైన మార్పులు వచ్చిం తరువాత కూడా కావ్య భాషా ప్రభావం నుంచి తప్పించుకోలేకపోటానికి ఇది నిదర్శనం.

విప్లవ కవితా దశ

ప్రారంభంలో విప్లవ కవులలోని చాలా మంది విప్లవ కవిత్వమే వ్రాసినా తమ ఉద్యమం ఎవరికోసం ఉద్దేశించబడిందో వారికోసం గేయ రచనలను, జానపద బాణీలను స్వీకరించారు. భాషా విషయకంగా ఆధునిక యుగ ప్రారంభంలో వచ్చిన గేయాలకి, విప్లవ కవితలుగా వచ్చిన గేయాలకి భేదం వుంది. భావకవితా యుగంనాటి గేయాలలో గ్రాంధిక భాష అధికారం చేసింది. విప్లవ గేయాలలో మాండలిక భాషా ప్రయోగం కనిపిస్తుంది. భావకవితా యుగంనాటి గేయకవులు కావ్యభాషలో రూపవైవిధ్యాన్ని ఛందస్సుకనుకూలంగా వాడుకుంటే విప్లవ రచయితలు మాండలిక రూప భేదాల్ని గేయ ఛందస్సుకనుకూలంగా వాడుకుంటున్నారు. ఈ రెండు రకాల గేయ రచనలలోని భాషా భేదానికి వస్తువు కూడా కారణమే.

తెలుగులో ఆధునిక కవితా భాషకు సంబంధించిన పై చరిత్రను పరిశీలిస్తే కావ్యభాషా సంప్రదాయ ప్రభావం ఎంత బలంగా ఉందో తెలుస్తుంది. ప్రతిభావంతులయిన చాలామంది కవులలోకూడా భాషా విషయకంగా ఏకరూపత కనిపించదు. భాషా రూపాల మిశ్రణం చాలా మంది రచనలలో కనిపిస్తుంది. పూర్తిగా గ్రాంధికంలో వుండే రచనలను వదిలివేస్తే భాషా మిశ్రణాన్ని కింది విధంగా విభజించవచ్చు.

(a) గ్రాంధిక వ్యావహారిక భాషా మిశ్రణం:— వ్యావహారిక భాషలోనే మొత్తం రచనఉన్నా, గ్రాంధికరూపాలు రచనలలో చొచ్చుకొని రావటం చాలా మంది కవులలో కనిపిస్తుంది. ఉదాహరణకు చూడండి:—

నన్ను తిట్టిన తిట్లతోనే
మల్లెపూవుల మాల కట్టెన
నాకు వ్రాసిన ప్రేమలేఖలు
పోస్టుచేయుట మానివేసెన్
(శ్రీ శ్రీ మంచి ముత్యాల సరాలు)

ఓల్గా ఘనీభవించెను
యాంగ్సీనది పొంగెను
హోరు హోరుగా—హాయలు
హాయలుగా

బిగించిన పిడికిట్లో
సూర్యుడు ఉదయించెను
విశాల విశ్వ క్షేత్రంలో
తెగిన అలలు రగిలెను
నేల తల్లి ఒడిలో
రాలి తార నవ్వెను
(శివసాగర్: రుతు గీతం)

శివసాగర్ వచనకవిత్వంలో చక్కని వ్యావహారికాన్ని ఉపయోగించాడు.

న్యాయమూర్తులంగారూ
సూర్యోదయం కుట్రకాదు
నిండుచూలాలి ప్రసవవేదన
కుట్రేనంటారా!
చరిత్ర రథగమనాన్ని ఏమంటారు?
న్యాయమూర్తులంగారూ
భూమిని చాపగా చుట్టి
చంకనబెట్టుకున్న రాక్షస
భూస్వామ్యం కుట్ర
నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దళారీతనం కుట్ర
(కుట్రదారు వాఙ్మూలం)

(b) వ్యావహారిక, ప్రాంతీయ వ్యావహారికాల మిశ్రణం:- సాధారణ రచనా భాషలో సాగే రచనలలో రచయిత ప్రాంతీయ వ్యావహారిక రూపాలు చొచ్చుకొని రావటం కొందరి రచనలలో కనిపిస్తుంది. వరవరరావు రచనలు ఇందుకు ఉదాహరణలు.

ఎక్కడో దూరాన సుందరము
ముసల్మాను గోరీపై లేచిన
ఎర్రగులాబీలోని సువాసన చూడ్డానికి
ఇంకా వ్యర్థ ప్రయాసచేస్తూనేఉన్నది
(భళ్ళున తెల్లవారునింక భయంలేదు)

ఇక్కడ 'ఉన్నది' అనే క్రియా రూపం తెలంగాణా ప్రాంతంలోనే ఎక్కువ వ్యవహారంలో వుంది. అలాగే 'పడిపోయింది', 'చల్లబడ్డది', 'తొడగినవి', 'ఉంది', 'ఉన్నది', 'అడిగినావు', 'అడిగావు' మొదలయిన రూపభేదాలు కలగా పులగంగా కనిపిస్తాయి. వరవరరావుదే 'ఎన్నికల పాట' అనే కవితలో వ్యావహారిక, ప్రాంతీయ, వ్యావహారిక గ్రాంధిక భాషా మిశ్రణఎట్లా సాగిందో చూడండి.

ఎన్నికలు, ఎన్నికలు
ఎన్నిసార్లెన్నికలు
ఏండ్లు మారెను తప్ప ఏమి
మారిందని
ఉన్నోళ్ళు ఉన్నోళ్ళు ఊళ్ళు
పంచుకొనిరి
గరీబోళ్ళకు మటుకు కన్నీళ్ళు
మిగిలినవి

(c) ప్రాంతీయ వ్యావహారిక, మాండలికాల మిశ్రణం:- ఉదాహరణకు వరవరరావుదే. 'మాపటోళ్ళే రేపటోళ్లు' అనే రచనలోని భాగం

పోలీసులొచ్చిం౯డు,
పోలీసులొచ్చిం౯డు
పోలీసులొచ్చినారు.

'ఒచ్చినారు' తెలంగాణా ప్రాంతంలో చదువుకున్నవారు ప్రత్యేకసందర్భాలలో ఉపయోగించే క్రియా రూపం కాగా, తెలంగాణా ప్రాంతంలో చదువుకోని వారితోపాటు చాలామంది ఉపయోగించే మాండలిక రూపం 'ఒచ్చిండ్రు' ఈ రూప భేదం రచయితలకోసం ఉపయో

గించుకున్నట్టు కనిపిస్తుంది.

(d) గ్రాంధిక, వ్యావహారిక, ప్రాంతీయ వ్యావహారికాల మిశ్రమణం:- ఇది ప్రధానంగా పట్టాభివంటి వారి రచనలలో కనిపిస్తుంది. పఠాభి 'ఫిడేల్ రాగాల డజన్' భావకవిత్వ హేళన ప్రతిభావంతంగా చేసిన కావ్యం. అని, పఠాభి భావకవిత్వంలోని గ్రాంధికభాషనీ, ఆ భాషలో అలవాటుగా కవిత్వపు భాషవేసుకొని తిరిగే పలుకుబడిని బట్టబయలుచేశాడనే అభిప్రాయా (వెల్చేరు నారాయణ రావు పే. 160-161) నికి "అనుసరిస్తాను నవీన పంథా కానీ/ భావకవిన్ మాత్రము కాన్నే,నే/ నహంభావ కవిని" వంటి రచనా భాగాలు నిదర్శనాలే ఐనా భాషా విషయకంగా తనకు తెలియకుండానే విభిన్న భాషా రూపాలు కలగాపులగం కావటం ఆయన రచనలలో చూడవచ్చు. పఠాభి మొత్తం రచనలలో గ్రాంధికం, వ్యావహారికం, ప్రాంతీయ వ్యావహారికం - వీటికి తోడు ఆంగ్ల పదాలు కలగా పులగంగా కనిపిస్తాయి. ఉదాహరణకు

బజ్జీ,వడ మున్నగునవి తినుచున్నారు
పురవాసులు కొందరు, కొందరు
పౌరుగింటి పిల్లనుగూర్చి బలే
గరం గరంగా వర్ణిస్తున్నారు(వర్షం)

తినివేస్తాము, తిరుగుచుంది వంటివి ప్రాంతీయ వ్యావహరకం కాగా వర్ణిస్తున్నారు సాధారణ వ్యావహారికం, తినుచున్నారు గ్రాంధికం.

(e) ఆంగ్ల భాషామిశ్రణం : భాష ఆధునిక వ్యావహారికమే అయినా ఇంగ్లీషు పదాలను అవసరాన్ని మించి వాడి సర్కస్ ఫీట్లు చేసిన కవులలో ఆరుద్రను చెప్పుకోవాలి.

బ్రెయిన్‌లో బ్రెన్‌గన్
రెయిన్‌లా ఆలోచన బ్రెయిన్
స్పైనల్ కార్డులో స్పెయిన్
గ్లూమీ తిమిరాలు చెరిపించి
సైతాన్ మనల్ని పరిషించునపుడు
[త్వమేవాహమ్]

తెలంగాణా ప్రజా ఉద్యమం కథా వస్తువుగా రచించిన 'త్వమేవాహమ్'లో కృత్రిమమైన ఈ ఆంగ్లభాషా పదాల మిశ్రణం చమత్కారాన్ని సాధించినా ఉద్యమ ధ్యేయాన్ని దెబ్బతీసిందని చెప్పవచ్చు. ఇంగ్లీషు పదాలను సందర్భశుద్ధితో వాడి కవితా ప్రయోజనాన్ని సాధించినవాళ్ళు లేకపోలేదు.

అలాగే నేనూ ఒకప్పుడు
రొమాంటిక్ ప్రమాదంలోపడి
అమాయకంగా నీ బ్యూటీ
అభివర్ణించాను వృత్తాలలో
ఇది మా భూలోకం కథ
ఇదీ మానవుడి ప్రోగ్రెస్ రిపోర్ట్
[శ్రీశ్రీ : శరశ్చంద్రిక]

(f) దీర్ఘ సంస్కృత సమాసాలూ. కృత్రిమ పదబంధాలూ : అందమైన వ్యావహారికంలో వచన కవిత్వం రాసిన తిలక్‌లో సంస్కృత సమాసాలు, ప్రబంధ వాసనలతో పదబంధాలు మనకు కనిపిస్తాయి. కేవల మానవతాదృష్టి, అనుభూతి ప్రాధాన్యం, రొమాంటిసిజమ్ ఇవి కనిపించినచోట్ల ఇలాంటి శైలి తిలక్‌లో కనిపిస్తుంది. ఉదా : నేను

చూశాను నిజంగా మూర్తీభవ దైన్యాన్ని, హైన్యాన్ని క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని, గచ్ఛచ్ఛవాకార వికారాల్ని ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి? ఏ విజ్ఞాన ప్రకర్షకు ప్రకృతి? ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి.......

నేను చూశాను నిజంగా క్షయగ్రస్త భార్యఇక బ్రతకదని-డాక్టరుచెప్పినప్పుడు.

ప్రచండ వాతూలహతనీపశాఖవ
గజగజ
వణకి పోయిన అరక్త అశక్త
గుమాస్తాని
అయిదారుగురు పిల్లలు గలవాణ్ణి
[ఆర్తగీతం]

"చరన్మొథ్య క్రూరమృగాల సంకులారణ్యం", "చలజ్జీవన దైనందిన కోలాహల పాంశుపరాగం" వంటి పద బంధాలు వచన కవిత్వానికి ఆధునికతను సంతరింపజేసేవికావు. జ్వాలాముఖిలో పదబంధాలపైనా, సమాస కల్పనలపైనా మోజు ఎక్కువగా కనిపిసుంది. 'శత సహస్ర కిరణారుణ జ్వాలాతోరణ తూర్యారావాలు', 'అహమంధతా సముద్రంలో రాగద్వేషాల క్రకచాలు', 'మరుగుతున్న జిజ్ఞాసా రసాయనాల సుడిగుండాలు'. 'మానవతా శార్దూలాల దహన క్రియాదారుణాలు', 'నాగరికతా జిజీవిషవర్ష ప్రహారాల్లో మతజిఘాంస ప్రచండ పదఘట్టనలో/ విజ్ఞానేరమ్మదం వికటాట్టహాసంలో', 'పశ్చిమ సంధ్యానంతర చీకటి సమస్యా ఫలితంగా/ వికృత వికార విశుద్ధ గోళంగా/ తేవిళ్ళ ఖురుసుపై ఆయాసపు దీర్ఘ గర్భం', 'సృష్టి స్థితిలయ వికారాల చక్రనక్రాల స్వాహాకారాల నుండి విముక్తి', 'సుందర హర్మ్యాంతర్గత సుప్రీం ధర్మదేవత ధర్మదర్శన శూన్యాలు' వంటి పద విన్యాసాలకు ఈ కవులు తమే స్వయంగా వ్యాఖ్యానం రాసుకుంటే బాగుంటుంది.

(8) శిష్టవ్యావహారిక వాక్య విన్యాసంలో మాండలికాలు : చదువుకోనివారి మాండలిక భాషలో రచనలు అనే పేరిట కృత్రిమమైన రచనలు కొన్ని వచ్చాయి. పదాల స్వరూపం మాండలికాల్లోంచి గ్రహించిందే అయినా వాక్యనిర్మాణం చదువుకోని వాళ్ళ భాషలో కనిపించని పద్ధతిలో కనిపిస్తాయి. ఉదా :

సలిని మింగేసే దెయ్యం నా
రేత్రి రైలు పరిగెడతా ఉంటే
తలుపులూ కిటికిటీలూ మూసీసుకొని
వుండ సుట్టుకి పోయినోలకి
అలిల్లోనే బండి నిలితే
ఎచ్చగా దిగొచ్చనిపించింది
[రంధి సోమరాజు : శీతకట్టు]

గాలివోన బాదుళ్లో
దొంగలు గోడలు తవ్వే సప్పుళ్ళో
తెలవక గు-డెలరసేతిలో ఎట్టుకొని
పైకి మాతరం
అబ్బా! సలి అంటారు
పెల్లాల నందిటి నక్కిన పిరికోలు
[రంధి సోమరాజు : వోనాకాలం]

పై కవితా వాక్యాల్లో కనిపించే వాక్యవిన్యాస పద్ధతులు పై మాండలికాల్ని మాట్లాడేవారి భాషలో సాధ్యం కాదని పిస్తుంది. ఇంతకుముందే పామర మాండలికంలో నందూరి సుబ్బారావు వంటివారు

కవిత్వం రాశారు. కాని ఆలోచనలు, అభివ్యక్తీకరణలు వీటి విషయంలో ఆయన కవిత్వం పామరజనానికి దగ్గరగా వెళ్ళిందని చెప్పలేం. చదువుకున్నవాళ్ళ సాహిత్యంలో మాత్రమే ఎంకిపాటలకు స్థానముంది. సెట్టు, సల్లంగావంటి చకార స్థానంలో సకార ప్రయోగాలు, పదాది వకార లోపంతో కూడిన ఇసిరి కాడతారు, ఎంకి మొదలైన ప్రయోగాలు, పదాది హకారం లోపించిన 'అంసల్లె' కొంటి పదాలు, మహాప్రాణాలు అల్పప్రాణాలైన 'బమ' వంటి పదాలు, పామర మాండలికంలోనివి నండూరి వాడినా మొత్తంగా ఎంకిపాటలలోని భాష ఒక మాండలిక భాషకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పటానికి వీల్లేదు మాండలిక భాషలో ప్రత్యేక కృషితో రచన చేయాలనే ప్రయత్నం వల్ల ప్రయోజనం ఏమీలేదు రచయితకు ఆ భాషపైన ప్రత్యేకమైన అధికారం ఉన్నప్పుడే అలాంటి రచనలు చేయడం మంచిది. లేకపోతే అలాంటి రచనలు కృత్రిమంగా తయారయ్యే అవకాశం ఉంది.

వ్యావహారిక భాష పేరిట ఉద్యమాల్ని చేపట్టిన పెద్దలు ముఖ్యంగా ఉద్దేశించింది శిష్టవ్యావహారికం. అంటే చదువుకున్న మధ్య తరగతి జనం భాష. విద్యారంగంలో పాఠ్యగ్రంథాలు, విషయ వివరణకు చెందిన వ్యాసాలు, రచనలు, పత్రికాభాష మొదలయిన వాటిలో అన్ని ప్రాంతాలకీ సమానంగా వ్యావహారిక భాష రూపొందటం వాళ్ళ ధ్యేయం. అంటే ప్రాచీనమైన గ్రాంథికభాష స్థానంలో ఆధునికమైన గ్రాంథికభాష నొకదాన్ని ప్రవేశపెట్టటమే వ్యావహారిక భాషోద్యమ లక్ష్యం. కాని సృజనాత్మక సాహిత్యంలో భాషావిషయకంగా నియమాలు, నిబంధనలు అనవసరం. ముఖ్యంగా ప్రజలను, చదువుకోని వారిని చైతన్యవంతుల్ని చేయటం లక్ష్యంగా రచనలు చేస్తున్న తరుణంలో, జనం కోసం గేయప్రక్రియలను, జానపద బాణీలను చేపడుతున్న సమయంలో భాషా విషయకంగా మాండలికాలను స్వేచ్ఛగా ఉపయోగించగలిగిన అవకాశం ఉండాలి. రచయితల్లో చాలామంది నగరాల్లో నివసించే మధ్యతరగతివాళ్ళు కావటం నిజమే కావచ్చు. వీరి భాష శిష్ట వ్యావహారికం కావచ్చు. కాని గ్రామాలలో జనంతో సంబంధం పెట్టుకొని వారి భాషలో మెలకువల్ని తెలుసుకొని రచనలు చేయగలిగితే కవిత్వం సాధారణ జనం దగ్గరకు వెళ్ళటానికి వీలుంటుంది. మాండలికాలలో రచనలు చేస్తే అవి అన్ని ప్రాంతాలవారికీ అర్థంకావన్న అభిప్రాయం ఒకటిఉన్నట్టు కనిపిస్తుంది. కాని ఏ మాండలికాన్నయినా రచనలో ప్రవేశపెట్టటం ద్వారా దాన్ని అన్ని ప్రాంతాలలో ప్రచారానికి తీసుకొని రావచ్చు. గద్దర్, వంగపండు ప్రసాదరావు మొదలైన వారి రచనలు ప్రాంతీయ మాండలికాల్లోఉన్నా మొత్తం ఆంధ్రదేశంలో జనాన్ని ఆకర్షిస్తున్నాయి. రాచకొండ, బీనాదేవి, దాశరధి రంగాచార్య వంటి వారి రచనలు కూడా దీనికి నిదర్శనాలు. కొడవటిగంటి కుటుంబరావు చెప్పినట్టు ఎప్పటికయినా మాండలికాలన్నీ పర్యాయపదాల కింద చలామణీ అయ్యే రోజు రావచ్చు. దాని ఫలితంగా గ్రాంథిక రూపాలను, వ్యావహారిక రూపాలను గేయాలలో పర్యాయంగా

వాడవలసిన అవసరంపోయి ఆధునిక భాషలో భాగంగా మాండలికాలను పర్యాయాలుగా వాడటానికి అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా రాచకొండ విశ్వనాథశాస్త్రి మాటలను జ్ఞాపకం చేస్తూ ముగిస్తాను. "సాహిత్యం పెద్దల పెత్తనపువేటు ఆస్తిగా ఎల్లకాలం ఉండిపోదు; అలా ఉండిపోవాలని శతాబ్దాలుగా తెలుగు పెద్దలు చేసిన ప్రయత్నాల మీద పెద్ద దాడి చేసినవారు కీ॥ శే॥ గిడుగు రామమూర్తిగారు. ఆ గిడుగు పిడుగు కూడా కోట కూల్చినప్పుడు శిష్టులే అందులో ప్రవేశిస్తారనుకున్నారు. కాని అది అలా జరగదు. శిష్టులకంటె జనులే విశిష్టులు. శిష్టులొక్కరే కోట గోడలు కూల్చలేరు. జనం ఆ గోడల్ని కూలుస్తారు. ఆ స్వేచ్ఛని అందరూ అనుభవిస్తారు." (రాచకొండ విశ్వనాథ శాస్త్రి 1977)

ఉపయుక్త గ్రంథాలు : వ్యాసాలు.

1. అప్పారావు, గురజాడ. 1914 (అను: దక్షిణామూర్తి, పోరంకి 1968) డిసెంట్ పత్రం, విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణాలయం.
2. ఆంజనేయులు, కుందుర్తి. 1964 .... నవత 3: 143–146
3. " 1967. పీఠిక: బాలగంగాధర తిలక్: అమృతం కురిసిన రాత్రి, విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణాలయం
4. " 1978. మహాప్రస్థాన కావ్యమీమాంస. సృజన 4: 45–50.
5. కుటుంబరావు, కొడవటిగంటి. 1980. సాహిత్య ప్రభావం, అరుణతార 3: 1: 17–18
6. కృష్ణమూర్తి, భద్రిరాజు. 1979. తెలుగు రచనా భాషా పరిణామం. *రంగనాధాచార్యులు, కె.కె. (సం.) తెలుగు సాహిత్య వికాసం.* హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
7. కోటేశ్వరరావు, మొలకలపల్లి. 1979. మాండలికాలు అవసరమే. సృజన 9:5 67–68.
8. నారాయణరావు, వేల్చేరు. 1978. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం. విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణాలయం.
9. బాలగంగాధరతిలక్. 1964. .... నవత 3: 147–150.
10. రాధాకృష్ణ, బూదరాజు. 1972. వ్యావహారిక భాషా వికాసం. విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణాలయం.
11. రామారావు, చేకూరి. 1970. మారుతున్న విలువలు – భాషా సమస్య *రచన* సికిందరాబాదు: యువభారతి: 139–146.
12. విశ్వనాథశాస్త్రి, రాచకొండ. 1977. పీఠిక: ప్రసాదరావు, వంగపండు: పొలికేక. విశాఖపట్టణం.
13. వేణు, మూడార్. 1979. విప్లవ భావ ప్రచారానికి మాండలిక భాషా రచనలు అవసరమా? సృజన 94: 65–67.

ప్రేమ్‌చంద్ - మోరిజ్

డా॥ ఎవా అరదీ

ప్రఖ్యాత హంగేరియన్ నవలా కారుడు సిగ్మండ్ మోరిజ్ శత వార్షికోత్సవాన్ని మేము 1979 లో జరుపుకొన్నాం. మీరు 1980 లో మున్షీ ప్రేమ్‌చంద్ శత వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నారు. అందుచేత, ఈ ఉభయుల సాహిత్య కృషిని తులనాత్మకంగా సమీక్షించడం సముచిత మనుకొంటాను. ఈ యిద్దరు మహారచయితలు ఒకే కాలంలో రచనలు చేశారు. అయితే, వారి సాహిత్య కృషిని సరిపోల్చి చూడ్డానికి యిదొకటే చాలదు.

మోరిజ్ రచించిన "ఏడు పెన్నీలు" అనే కథానికనూ, మరో పదకొండు హంగేరియన్ కథానికల్నీ హిందీలోకి అనువదించి, ఈ మధ్యనే రెండేళ్ళక్రితం ఒక పుస్తకంగా ప్రచురించారు. 1979 ఆకురాలు కాలంలో, ఢిల్లీలోని హంగేరియన్ సాంస్కృతిక పరిషత్తు హాలులో, మోరిజ్ శత వార్షికోత్సవ సందర్భంలో ప్రసంగిస్తూ ఒక ప్రఖ్యాత భారతీయ విద్వాంసుడు అన్నారు : "ఈ కథానికను ("ఏడు పెన్నీలు") రచించింది ప్రేమ్ చందా, మోరిజా? అని ఎవరైనా అడగవచ్చు." ఆయన అలా ఎందువల్ల అన్నారు? ఆ ఉభయులూ ఒకే కాలంలో జీవించి, ఒకే విధంగా ఆలోచించారు గనక.

ఒకే చారిత్రక పూర్వరంగం

1879 ప్రాంతంలో హంగరీ స్వాతంత్ర్య సమరం క్రూరంగా అణచివేయబడింది. ఆస్ట్రియా చక్రవర్తి, జోసెఫ్ ఫెరెన్స్, ఫ్యూడల్ - పెట్టుబడిదారీ దోపిడీని పటిష్ఠంచేస్తూ, ఆస్ట్రియా-హంగరీలపై ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నాడు. విదేశీపెట్టుబడుల సాయంతో నడపబడే పరిశ్రమలు హంగరీదేశపు వ్యవసాయాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఆస్ట్రియా ప్రభుత్వపు దిగుమతి సుంకాలు గోధుమ ధరల్ని విపరీతంగా పడగొట్టేయి. లక్షలాది బీద, మధ్య తరగతి రైతులు భూస్వాముల కమతాల్లో కూలీలుగాను పట్టణ పరిశ్రమల్లో కార్మికులుగాను చేరి పనిచేయవలసి వచ్చింది. ఇంకా అనేకులు అమెరికా ఖండానికి వలస వెళ్ళారు. దేశాన్ని పెద్ద వ్యవసాయ సంక్షోభం అలముకొంది. అర్థ వలస దేశం ఐన హంగరీ ప్రజల దారిద్ర్యం హద్దులు మీరింది.

ఆనాడు భారతదేశం కూడా యించుమించు యిలాంటి స్థితిలోనే ఉండేది. హంగరీలోకంటె క్రూరంగా భారతదేశంలో 1857 తిరుగుబాటు అణచి

వేయబడింది. హంగరీలో ఆస్ట్రియా పెట్టుబడుల లాగే, భారతదేశంలో బ్రిటిష్ పెట్టుబడులు రైతాంగాన్ని పీల్చి పిప్పి చేశాయి. దీనికి తోడు, కులవ్యవస్థ భారత ప్రజానీకాన్ని అజ్ఞానాంధకారంలో ముంచెత్తింది. మూఢవిశ్వాసాల కిక అంతులేదు. మేధావివర్గం కోట్లాది శ్రమ జీవుల బాధల్ని పట్టించుకొనేవారు కాదు. మొత్తంమీద, ఆ రోజుల్లో, వలస దేశమైన భారతదేశం అర్థవలస స్థితిలో ఉన్న హంగరీకన్న దుర్భరస్థితిలో ఉండేది.

ప్రేమ్‌చంద్, మోరిజ్‌లు

అట్టి పరిస్థితుల్లో, సీగ్మండ్ మోరిజ్ 1879 జూన్ మాసంలో తిస్జా నది ఒడ్డున ఒక కుగ్రామంలో జన్మించారు. 13 నెలల తరవాత, 1880 జులై 31 న ప్రేమ్‌చంద్ వారణాసి వద్ద లంహి గ్రామంలో జన్మించారు వారిద్దరూ రైతు కుటుంబాల్లో పుట్టేరు. ప్రేమ్‌చంద్ తండ్రి ఆ గ్రామానికి పోస్టుమాస్టరయినప్పటికీ, కుటుంబ దారిద్ర్యమేమీ తీరలేదు.

ఈ పోలికలకన్న ముఖ్యమైన విషయమేమంటే, వీరిద్దరిమధ్య పదివేలమైళ్ళ దూరం ఉన్నప్పటికీ, ఒకరినొకరు ఎరగకపోయినప్పటికీ, తమ నవలల్లోను, కథానికల్లోను వారవలంబించిన దృక్పథం, వారు సాక్షాత్కరించిన దృశ్యం ఒకటే. హంగేరియన్ గ్రామాన్ని మోరిజ్ ఎంత చక్కగా తెలుసుకొన్నారో, భారత రైతాంగాన్ని ప్రేమ్‌చంద్ అంత చక్కగా అవగాహన చేసుకున్నారు. వారిద్దరూ, గ్రామాల్లోని సామాన్యుల జీవితాన్ని, వారి ఆలోచనా రీతుల్ని, భావ ప్రపంచాన్ని, తమ పరిసరాలలోని వైరుధ్యాల్ని కూలంకషంగా పరిశీలించి అవగతం చేసుకొన్నారు. మోరిజ్ హంగేరియన్ గ్రామాన్ని ఒక కొత్త వాస్తవిక పద్ధతిలో వర్ణించారు. అలాగే, ప్రేమ్‌చంద్ కూడా ఒక విప్లవాత్మక పద్ధతి నవలంబించారు. అదేమంటే, రైతుల జీవితాన్ని, వారి పోరాటాన్ని, భావ సంచయాన్ని సాహిత్య వస్తువులుగా ఎంచుకొన్నారు. హిందీలో సాంప్రదాయకమైన, ప్రబోధాత్మకమైన, తాత్విక సంబంధమైన వచన సాహిత్యాన్ని ఆధారంగా తీసుకొని, ప్రజలకత్యంత సన్నిహితమైన ఆధునిక రూపాల్ని ఆయనెంచుకున్నారు. అవి నవల, కథానిక. ఈ విధంగా, ఇతివృత్తాన్ని, శిల్పాన్ని ఎంచుకోడంలో విజయం సాధించాక, హిందీసాహిత్యంలో మొదటి సారిగా స్పష్టమైన, సంక్షిప్తమైన, అతి సులభమైన శైలిని రూపొందించారు. ఆయనది అందరికీ అర్థమయ్యే భాష. అది అప్పటికే "ప్రేమ్‌చంద్ భాష"గా పేరుపొందింది. తర్వాతి తరం రచయితలు దాన్నే నమూనాగా తీసుకొన్నారు. మోరిజ్ లాగే ప్రేమ్‌చంద్ కూడా తన రచనల్లో సిసలైన, సజీవులైన పాత్రల్నే సృష్టించారు. వాటిని శక్తివంతంగా చిత్రించారు. అవి ఎప్పుడూ సహజ భావ రీతుల్లోనే సంచరిస్తాయి.

ఉభయుల కథానికలు

మోరిజ్ "ఏడు పెన్నీలు" అనే కథానికలో తీసుకున్న లాంటి యితి

వృత్తాన్నే ప్రేమ్‌చంద్ తన "సుమా యస్"లో తీసుకున్నారు. మోరిజ్ కథానికలో లాగే, యిందులో కూడా, దుఃఖాంతఘట్టం వంకరలు లేని సరళ రేఖలా తోసుకొసుంది. అయితే, ఒక భేదం ఉంది. హృదయాల్ని కంపించి వేసే దృశ్యాలను సరళమొనరే, కాంతి రేఖలేవీ యిందులో లేవు. ప్రేమ్‌చంద్ మరొక ప్రఖ్యాత రచన "కఫన్" (శవా ని కిప్పే బట్ట). ఇందులో కథానాయకుడు ఘీసూ, తన జీవితంలో ఒక్కసారి భూస్వామి పెళ్ళి భోజనం తరువ తీరా తిందామనుకొంటాడు. దీన్నే మోరిజ్ రచించిన "విషాదాంతఘట్టం"తో పోల్చవచ్చు. అయితే ఒక భేదం ఉంది. ఆ కథ "కఫన్" కంటే ఎక్కువ. జుగుప్స, విషాదం కలిగిస్తుంది.

ఉభయుల నవలల్లో నాయకులు

కథానికల్లో మాత్రమే కాక, వీరిద్దరి నవలల్లోని కథానాయకులు యించుమించు ఒకలాగే ఉంటారు. మోరిజ్ రచించిన "భూస్వామి తందనాల"లో కథానాయకుడు జోలన్. అతడు వ్యవసాయంలో కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టడానికి యత్నిస్తాడు వాటిని యితరులు ఆటంక పరుస్తారు. ప్రేమ్‌చంద్ రచించిన "ప్రేమాశ్రమ్"లో కూడా, కథానాయకుడు ప్రేమ్‌శంకర్ వ్యవసాయంలో సంస్కరణలు ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తాడు. తేడా ఏమంటే, అతని ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇలాగే, మోరిజ్ నవల "కాగడా"లో కథానాయకు డొక భావాత్మక విప్లవకారుడు అలాంటివాడే, ప్రేమ్‌చంద్ "కర్మభూమి"లోని కథానాయకుడు అమర్‌కాంత్ మోరిజ్ కథానాయకుడు తిస్జా నదివద్దకు వచ్చినట్లే, ప్రేమ్‌చంద్ కథానాయకుడు గంగానది తీరంలోని ఒక గ్రామం చేరుకుంటాడు, పోరాటం నడపడానికి కాని హంగేరియన్ కథానాయకుణ్ని భూస్వామి మత గురువుఎదుర్కొన్నట్టే, ప్రేమ్‌చంద్ కథానాయకుణ్ణి కూడా జమీందారు, పురోహితుడు ఎదుర్కొంటారు. ప్రేమ్‌చంద్ "గోదాన్" లోని కథానాయకుడు హరీ మోరిజ్ నవలలోని కథానాయకుడు సుఖజీవి కల్లాకపటం లేని అమాయక రైతులు ఉపాయం ఎరగనివాళ్ళు; తిరగబడలేనివాళ్ళు హరి మాదిరిగా హంగేరియన్ కథానాయకుడు శారీరకంగా అశక్తుడవకపోయినా, వాని జీవితం దుఃఖభరితమవుతుంది. ఎందుచేతంటే, యీ ప్రపంచం ఎల్లప్పుడూ దారిద్ర్యం, పరాధీనతతోనే ఉంటుందనీ, అలా ఉండడం సహజమనీ అనుకుంటాడు. పైగా, అతడీపాడు ప్రపంచంతో సంతృప్తి చెందుతాడు.

ఒకసారి ప్రేమ్‌చంద్ 1933 లో సతీ సమేతంగా రైల్లో ప్రయాణంచేస్తూ తీర్థయాత్రలకు వెళ్తున్న గ్రామీణుల్ని చూచి యిలా అన్నారట : "ఇలాంటి వాటికోసం డబ్బు ఖర్చుపెట్టవద్దని వీళ్ళకు చెప్పాలని ఉంది ఎందుచేతంటే, యీ ప్రయాణంవల్ల నాలుగు నెలల ఆదాయం మంట కలుస్తుంది. మతం కోసం యీ వెర్రివాళ్ళు ఆకలికి బలిఅయి చస్తారు.... పాపం, వీళ్ళలో చదవగలవాళ్ళు అట్టే

మెదడు

బొల్లిముంత నాగేశ్వరరావు

అచ్చులసార్లు
ఈ వంటిలోని కాళ్ళకో
అడుగు వేసుకుంటాపోయి -
ఏల సార్లు ఈ సేతుల్తో
ధాన్నెం పండించి -
గాదెల్ని నింపించి
పదుల సార్లన్నా
ఈ వంటిలోని కడుపుకు
కమ్మగా ఏడన్నమూ
కాసింత పచ్చడీ, కూరా -
సివర్లో పెరుగూ
ఏసుకు తింటానికి
నోసుకోపోటానికి
ఏరేమరేటి కారణం లేదు -
ఒక్కసారన్నా
ఈ వంటిలోని 'మెదడు'తో
దొరోరు సేసే దోపిడీని గురించి
ఆలోసించకపోటవే....

మంది లేరు. నా నవలల్ని ఎవరైనా ఫిలింలుగా తీస్తే, అవి గ్రామాలదాకా వెళ్తే, రైతులు యింతకన్నా చాలా సంగతులు తెలుసుకుంటారు."

భారతదేశం స్వతంత్రదేశ మయింది. ప్రేమ్‌చంద్ కాలధర్మం చెందేరు. ఆ తర్వాత ఆయన కోరిక నెరవేరింది. ఎందుచేతనంటే, ఆయన రచించిన చాల నవలల్ని. కథానికల్ని ఫిలింలుగా తీశారు. కొన్ని టెలివిజన్‌లోకి కూడా ఎక్కాయి.

ముగింపు

సాహిత్యం సమకాలీన పరిస్థితులకు దర్పణంగా ఉండాలి. హిందీ సాహిత్యంలో ఎవరైనా ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించారా అంటే, అది ప్రేంచంద్ అని చెప్పాలి. ఆయన తన రచనల్లో నాటి క్రౌర్యాల్ని, ఆశల్ని కోర్కెల్ని, కుల ద్వేషాల్ని, భూస్వాముల అమానుషత్వాన్ని, సాంప్రదాయాల మౌఢ్యాన్ని వర్ణించారు. 1921–1936 మధ్య 15 సంవత్సరాలలో ప్రేమ్‌చంద్ రచించిన గొప్ప నవలలూ, యిప్పటికీ ప్రపంచ ప్రఖ్యాతి గడించిన కథానికలూ హిందీ సాహిత్యాన్ని అంతకు ముందు 100 సంవత్సరాల్లో కనీ వినన౦తగా పరిపుష్టం చేశాయి.

ప్రేమ్‌చంద్ పట్ల ప్రజాభిమానం ఈ దేశంలో రోజురోజుకు పెరుగుతోంది. కారణమేమంటే, ఆయన మానవజీవితానికి సంబంధించిన సకల సమస్యల్ని తన రచనల్లో చూపించారు. గ్రామ జీవితం ద్వారా మానవ సంబంధాలన్నిటినీ కళాత్మకంగాను, వాస్తవికంగాను చిత్రించారు.

గాంధీజీ ఒక సందర్భంలో ప్రేమ్‌చంద్‌ని గురించి యిలా వ్రాశారు.

"మన దేశం స్వాతంత్ర్యం సంపాదించుకొని, గ్రామాల్లోవి బాధలు, దారిద్ర్యం, అవమానం, అవిద్య సమసిపోయిన నాడు, భారతదేశంలో ఒకప్పుడు రైతు యిలాంటి జీవితం గడిపేవాడంటే ఎవరూ నమ్మరు. వారు ప్రేమ్‌చంద్ ప్రఖ్యాత నవలల్ని, కథానికల్ని చదివినట్లయితే, ఆనాటి సమాజం ఎలా ఉండేదో తెలుసుకోగల్గుతారు."

'80 జనవరి కథలు - ఒక పరిశీలన

డా॥ అత్తలూరి నరసింహారావు

"లోకాన్ని మానవ లోకాన్ని మానవ నైజాన్ని అర్థం చేసుకొని మనిషి ఈ లోకంలో ఈ సంఘంలో మంచి సభ్యుడుగా ఉండేటట్టు చేసే కథలు (ఆ విధంగా ఉండాలని అతని చేత ప్రయత్నం చేయించే కథలు)మంచి వని నేను తలుస్తాను....

ఈ వాక్యాలు రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారివి. తెలుగులోనూ ఇంగ్లీషు లోనూ ఇంతకన్నా మంచి వివరణ మంచి కథల మీద కనిపించలేదు. కళలకి సంబంధించిన ఏ విభాగానికయినా ఈ వివరణ సరిగ్గా సరిపోతుంది.

1980 జనవరి నెలలో వచ్చిన కథలు దాదాపు 175. వీటిల్లో చిన్న కథలు, అనువాద కథలుకూడా ఉన్నాయి.

ఈ కథలన్నీ చదివితే కథల సంఖ్య, కథకుల సంఖ్య, పత్రికల సంఖ్య పెరిగి నంతగా స్థాయి పెరగలేదనిపిస్తుంది. అల నాటి కథకులతో పోలిస్తే ఈ నాటి కథకు లకి ఉన్నతమైన ఆదర్శాలుగానీ, విలు వలుగానీ, ప్రతిభగాని లేవేమోనని పిస్తుంది. గత పాతికేళ్ళనుంచి ఈజీతత్వం, రాజీతత్వంమన రక్తంలో, మన జీవిత విధానంలో ప్రవేశించినట్టే రచనల్లోకూడా ప్రవేశించినట్లు కని పిస్తుంది.

ఇదిగో ఇది గొప్పది అని ఎత్తి చూపించే కథ ఈ 175 కథలలో ఒక్కటీ కనిపించలేదు. రచయితలు చాలా ఉత్సా హంగా రాస్తున్నారు.బాగానే వుంది. కాని ఎందుకోసం? ఏ విలువలకోసం? ఏ ఆదర్శాలకోసం? ఏ జీవిత స్వప్నాల కోసం? ఈ ప్రశ్నలకి ఈ కథలలో ఎక్కువ భాగం స్పష్టంగాగాని, అస్ప ష్టంగాగాని సమాధానం ఇచ్చే స్థితిలో లేవు.

కథకులు కథలు రాస్తున్నారు. పత్రి కలు ప్రచురిస్తున్నాయి. పాఠకులు చదువు తున్నారు. ఈ ముగ్గురి మధ్య సమ న్వయం లేదు, సామాజికమైన అను బంధం లేదు.

కథలు రాయటంకోసం కథలు రాస్తు న్నారు. పెట్టుబడి పెట్టిన పత్రికలు వ్యాపారంకోసం ప్రచురిస్తున్నాయి. పాఠకులు సరదాకో కాలక్షేపానికో చదువుతున్నారు.

ఈ పరిస్థితి పూర్వం లేదా అంటే ఉంది. అయినా గొప్ప కథలు వచ్చాయి గదా అంటే వచ్చాయి. అప్పటికీ ఇప్ప ఒక తేడా వుంది. పూర్వం ఏదో ఒక జీవితాదర్శం కూడా ఉండేది.ఏవో కొన్ని విలువలు కథకుల్ని కదిలించేవి. ఏదో ఒకరకమైన సామాజిక ప్రయోజనం

కోసం ఆనాటి రచయితలు పాటుపడ్డారు. రచన ప్రాణప్రదంగానే గాక చిత్త శుద్ధితో కూడా చేశారు.

సరిగా ఇవే ఈనాడు కరువయ్యాయని పిస్తుంది. ఈనాటి జీవితం వాటిని అనుమతించటం లేదు లాగుంది. ఈనాడు డబ్బూ, హోదా ఈ రెండే ఎక్కువ భాగం జీవితాన్ని శాసిస్తున్నాయి. కృత్రిమపు విలువలే అసలైన విలువలుగా చలామణి అవుతున్నాయి. ఆదర్శాల స్థానంలో ఆత్మవంచన చోటు చేసుకుంటోంది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలోని శూన్యత్వం, దివాళాకోరుతనం ఈ నాటి కథలలో ప్రతిఫలిస్తోంది. ఒక మహత్తరమైన మార్పుకి ముందుండే పతనావస్థ ఎక్కువగా కనిపిస్తుంది.

ఈ కథలలో గొప్పవేగాని మంచివి లేవనటానికి వీల్లేదు. రకరకాల విషయాలమీద కథలు రాశారు. వస్తువైవిధ్యం విరివిగా ఉంది. కాని లేనిదల్లా కథనడిపే నైపుణ్యం, పాత్ర పోషణ, వాక్య నిర్మాణం. ప్రతివారికీ సొంత చిరునామాలాగా ప్రతి కథకుడికీ సొంత శైలి ఉండాలి. ఈనాటి కథకులలో కొందరు కేరాఫ్ చిరునామాలవాళ్ళే. మరి కొందరు చిరునామా లేనివాళ్ళు.

ఈరోజు పట్టణాలు పల్లెటూళ్ళని శాసిస్తున్నాయి. రచయితలుగా ఇప్పటికే స్థిరపడిపోయిన వాళ్ళని వదిలేసినా కొత్తగా రచనలు చేసే వాళ్ళయినా పల్లెటూళ్ళ జీవితాన్ని సమగ్రంగా చిత్రించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. ఆర్థర్ హేలీలా సమగ్రంగా తెలుసుకుని మూడు నాలుగు సంవత్సరాలకి ఒక నవల రాసినట్టు మన కథా రచయితలు కూడా సంవత్సరానికి ఒకటి రెండు రాస్తే గొప్ప కథ రావటానికి అవకాశముంది.

స్త్రీ కేంద్రంగా ఉన్న ప్రేమ, విడిపోవటం, అనుమానాలు, అపార్థాలు, సెక్సు, ఒంటరితనం - ఇతివృత్తంగా ఉన్న కథలే జనవరిలో ఎక్కువగా వచ్చాయి. ఆ తర్వాత ఉన్నత వర్గాల దౌర్జన్యం, అట్టడుగు వర్గాల దయనీయ జీవితం ఇతివృత్తంగా ఉన్న కథలు ఎక్కువగా వచ్చాయి. ఆ తర్వాత మధ్య తరగతి జీవితానికి సంబంధించిన కథలు వచ్చాయి. తర్వాత పిల్లలకి సంబంధించిన కథలు వచ్చాయి. ఆ తర్వాత ఆఫీసులకి సంబంధించిన కథలు, రచయితలకు సంబంధించిన కథలు వచ్చాయి. ఆ తర్వాత మానసిక చిత్రణలు, ఉపాధ్యాయుల మీద రాసినవి వచ్చాయి. గ్రామీణ జీవితానికి సంబంధించి మూడు నాలుగు కథలకన్నా ఎక్కువ రాలేదు. సినీమాయా జీవితం, మోసం, ఆచారాల అనర్థాలు, ఆదర్శం, లోకస్వభావం, పోలీసులు- వీటి గురించి తలా రెండు మూడు కథలు వచ్చాయి. మొత్తంమీద సస్పెన్స్ కథల జోరు తగ్గినట్టు ఉంది. ఒకటి రెండు కన్నా ఎక్కువ రాలేదు. ఇవి కాక జైలు కెళ్ళిన మనిషి అంతరంగ చిత్రణ, కళాకారుల ఇబ్బందులు, స్కైలాబ్ ప్రభావం, కొజ్జాల దయనీయస్థితి-వీటికి సంబంధించి కూడా రచయితలు కథలు రాశారు. చివరగా, మంత్రిణికి అనుకూలమయిన కథతోపాటు చాలా అసందర్భపు కథలు కూడా అచ్చయ్యాయి.

మరో గమనించదగిన విశేషం-

స్త్రీలకన్నా పురుషులే ఎక్కువ మంది కథలు రాస్తున్నారు.

మంచి కథలు కొన్ని :

'మనకేలః'– ఆర్. యస్. కృష్ణమూర్తి 19–2–80 ఆంధ్ర ప్రభలో వచ్చింది. చిన్నప్పుడు ఇద్దరూ కలిసి చదువుకున్నవారే. ఒరేయ్ ఒరేయ్ అని పిలుచుకున్నవాళ్ళే. ఆస్తిపరుడయిన రెడ్డి పెద్దవాడయి, పెత్తనం వచ్చేసరికి రెడ్డిగారూ అని పిలవాల్సిన పరిస్థితి పంతులికి వచ్చింది. ఓయ్ పంతులూ అని పిలిచే అలవాటు రెడ్డిగార్కి వచ్చింది ఇద్దర్నీ ఆర్థిక పరిస్థితి చీల్చింది. రెడ్డిగారి పెత్తనంలో పంతులు ఉపాధ్యాయుడిగా ఊపిరి పీలుస్తున్నాడు. సేవలు జేస్తున్నాడు, సమర్థిస్తున్నాడు. అధికార శక్తిముందు సామాన్య మానవుల మనుగడ ఏ స్థితిలో వుందీ తెలియజేస్తుంది. పెద్దల జీవితంలోని ఒక పేజీ, వాళ్ళ పడగ నీడనున్న పంతులు జీవితంలోని రాజీ– స్పష్టంగా కనిపిస్తుంది.

'టీచర్స్ డే'

గంగరాజు కృష్ణకుమారి 11–1–80 ఆంధ్ర పత్రికలో వచ్చింది. ఒక సాంఘిక సేవా సంస్థ టీచర్స్ డే నాడు హడావుడిగా ఒక సభ ఏర్పాటుచేసి, ఒక పండితుడ్ని సన్మానించాలనుకుంటారు. ఆయన రాకపోతే రాజారావు అనే ఉపాధ్యాయుడ్ని మొహమాటం పెట్టి, ఒప్పించి సభకు తీసుకువస్తారు. ఉపన్యాసాల వర్షం, సన్మానం అయిన తరువాత గొప్పవార్ని, పెద్ద వార్ని పంపే హడావుడిలో కార్యకర్తలు రాజారావుని నిర్లక్ష్యంచేస్తారు. దాంతో ఒక రిక్షా మాట్లాడుకుని రాత్రివేళ ఇంటికి వెళ్తాడు ఇంటిదగ్గర రిక్షావాడు చలికి చిన్నదుప్పటి ముక్క ఏదన్నా ఇవ్వమని అడుగుతాడు సభలో ఇచ్చిన శాలువా రాజారావు రిక్షా వాడికి ఇచ్చేస్తాడు తృప్తిగా. తనకివేసిన పూలమాల అర్ధాంగి మెడలో వేయాలనుకుంటూ ఇంట్లోకెళతాడు ఆనందంగా. ఉపాధ్యాయ దినానికి దహన సంస్కారాలు చేసిన ఈ కథ సూటిగా, చక్కగా ఉంది.

'సర్కస్'

ఉప్పులూరి పార్వతి ఇది 25–1–80 ఆంధ్రజ్యోతిలో వచ్చింది జీవితం సర్కస్ లాంటిదని, జంతువులు, మనుషులు కూడా తమ సహజ ధోరణులకు విరుద్ధంగా, రాజీగా బతుకుతున్నారని చెప్పిన కథ.

'రాముడు లేని సీత'

ఆది మధ్యం రమణమ్మ ఇది కూడా 25–1–80 ఆంధ్రజ్యోతిలో వచ్చింది. ఈ నాటి సీతకి అడుగడుగునా ఆటంకాలే. అయినా అన్నిటినీ అధిగమించింది. ఒకనాడు రాముడు లాంటివాడు వచ్చి తియ్యని ఊహలు లేపాడు. సీతకూడా ఊహల్లో ఊరేగింది ఇంతలో చెల్లెలి పెళ్ళికోసం సీతనుచేసుకోలేని నిస్సహాయుడయ్యాడు. ఈ లోపు వయసు పెరిగి శరీరంలో సహజమైన మార్పులు వచ్చాయి వాంఛలు ఉడిగిపోయే లోపలే పురుషత్వాన్ని చవిచూడా

లని ఆహ్వానించింది. ఫలితం గర్భం. సమయం మించిపోయింది. ప్రాణాలు వదిలేసింది. ఆర్థిక స్వాతంత్ర్యం స్త్రీల వ్యక్తిత్వంలో చాలా మార్పులుతెస్తోంది. ఈ సీత చెల్లెలే ఆ 'సుధీర'. వీరి సమస్య కూడా సామాజిక సమస్యలలో భాగం కాబోతూంది.

'సుధీర'

ఆరేటి కృష్ణ ఇది విపులలో వచ్చింది. వ్యక్తిత్వం గల సుధీర శివరామ్‌ని ప్రేమించి పెళ్ళిచేసుకుంది. తర్వాత అతను తనని బానిసని చేస్తున్నాడని, వ్యక్తిత్వాన్ని చంపుతున్నాడని తెలుసుకుంటుంది. శివరామ్ కోసం వదిలేసిన ఉద్యోగాన్ని తెలివిగా మరోచోట సంపాయించుకుని అతనికి విడాకులిచ్చేసి స్వతంత్ర జీవనం సాగిసుంది. చదువుకున్న స్త్రీలలో చైతన్యవంతులవుతున్న వారికి సుధీర ప్రతినిధి.

'పృథ్వీ పుత్రి'

మంథా వెంకటరమణారావు ఇది యువలో వచ్చింది. ఈ సమాజం చేత అనేక రకాల వంచింపబడ తల్లీ బిడ్డలు పొట్టకూటి కోసం పెంటకుప్పల చుట్టూ తిరుగుతూ, మురికిలో ఊరకుక్కలూ. పందుల మధ్య మసలుతూ మానవతకే ప్రశ్నార్థకం నిలిచినవారి దయనీయ జీవితాన్ని కళ్ళకి కట్టినట్లు చిత్రించారు. రచయితగా చేసిన వ్యాఖ్యానాల ప్రవాహం కాస్త తగ్గించి వుంటే కథకు మంచి బిగువుండేది.

'పీర్ల సావిడి'

కేతు విశ్వనాథరెడ్డి. ఇది స్వాతిలో వచ్చింది. ఎలక్షన్ను, వాగ్దానాలలోని డొల్లతనాన్ని, తండ్రీ కొడుకుల ఆలోచనలలోని అంతరాన్ని ఎత్తి చూపించిన కథ. గ్రామీణ జీవితానికి సంబంధించిన ఒక పేజీఈ కథ.

'జన్మరణాల సరధిలో'—అనూరాధ. ఇది ప్రభవలో వచ్చింది. మనిషి బతికి వున్నప్పుడు లోకం చూపే నిర్దయ,నిరాకరణ, చనిపోయిన తర్వాత చూపేసానుభూతి వాక్యాలు— వ్యక్తులలోని ద్వంద్వ స్వభావం చక్కగా చిత్రించారు.

చిన్ని కథలు:

'మినీ' కథలు, కవితలు అని మొదటగా ఉపయోగించి, బాగా ప్రచారంలోకి తీసుకొచ్చింది ఆంధ్రజ్యోతివారే అనుకుంటాను. తెలుగు పదం లేనప్పుడు దాన్నే ఉపయోగించవచ్చు. ఉన్నప్పుడు 'మినీ' అనటం మాత్రం అన్యాయమే. చక్కగా చిన్న కథలు అనొచ్చు లేదా అతి చిన్నకథలు అని కూడా అనుకోవచ్చు.

జనవరినెల చిన్నకథలలో 11-1-80 ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'సరదాకి సంతకెళితే' వాణిశ్రీ రాసింది బాగుంది. పుణ్యానికి పోతే పాపం ఎదురయినట్టు సంతలో దొంగతనం చేశాడని బాదుతున్న కుర్రాడ్ని రక్షించినందుకుగాను పోలీసు చేతిలో చిక్కుకుని ముడుపు చెల్లించి బయటపడ్డ కథ. అతి సహజంగా వుంది.

'పడవ' - జి. గోపాలకృష్ణమూర్తి ఇది 25-1-80 ఆంధ్రజ్యోతిలో వచ్చింది రెండు నెలల ఎలక్షన్ తంతుని రెండు పేరాల్లో చెప్పిన కథ.

అనువాద కథలు

దాదాపు 17 అనువాద కథలున్నాయి. మూడు నాలుగు తప్ప మిగతావన్నీ బాగున్నాయి. అనువాద కథలకి 'విపుల' ప్రముఖ వేదికగా వుంది. అనువాద కథల్లో అన్నిటికన్నా బాగున్న కథలు 'విపుల'లో వచ్చిన ఒరియా కథ 'బందితులు' తమిళ కథ 'నాన్నా నేనూ వస్తా', 'ప్రగతి'లో వచ్చిన కన్నడ కథ 'బొబ్బట్లు'.

ఇక్కడే పరిశీలన లోకి వచ్చిన మరో విషయం ప్రస్తావిస్తాను. అచ్చుతప్పులు లేని పత్రిక, పుస్తకం తెలుగులో మనకు కనిపించవు. కనిపిస్తే ఆశ్చర్యపోతాం, ఆ తర్వాత ఆనందిస్తాం 'విపుల' ఈ రెండూ కలిగించింది. ఈ విషయంలో 'విపుల' మార్గం మిగతా పత్రికలు అనుసరిస్తే పాఠకులు సుఖపడతారు.

పత్రికలు :

ఈ నెల కాస్త మంచి కథలు, ఒక మాదిరి కథలు ప్రచురించిన వారపత్రికలు ముఖ్యంగా ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ. మాసపత్రికల్లో ముఖ్యంగా స్వాతి, యువ, ప్రభవ.

కథలు ఏమాత్రం బాగాలేని వారపత్రికలు ముఖ్యంగా ఆనందజ్యోతి, ప్రగతి. మాసపత్రికల్లో ముఖ్యంగా జనసుధ, సిరిమల్లె. ఆనందజ్యోతి ఎడిటింగ్ కూడా బాగాలేదు. ఉదాహరణకి సోమరాజుపల్లి చెంచెయ్యగారు రాసిన 'నాగార్జునుడు' అచ్చులో ఒక కాలమే వున్న చారిత్రక విషయం. దీన్ని కథల కింద అచ్చువేశారు.

ఇక రచయితల సంఘాల పత్రికల్లో మూసకథలు, వ్యాపార పత్రికల్లో కాస్త మంచి కథలు రావటం గమనించదగిన విషయం. స్త్రీల కోసం ప్రత్యేకంగా వస్తున్న పత్రికల్లోకథలస్థాయితక్కువగా వుండటం కూడా గమనించదగిన విషయం.

ప్రత్యేక సంచికలు :

అలజడి లేవగానే పోలీసులొచ్చినట్టు పండగలు రాగానే ప్రత్యేక సంచికలు వస్తున్నాయి. మరొక విశేషం-పేరున్న కథకులు కొందరు కథలు రాయటంలేదు. రాస్తున్న మరి కొందరిని చదివించటం లేదు

మామూలు సంచికలకూ ఈ ప్రత్యేక సంచికలకూ తేడా కేవలం సైజులోను ధరలలోను మాత్రమే. అలాకాకుండా ఎవరికివారు సంవత్సరానికో రెండు సంవత్సరాలకో తమ పత్రికల్లో వచ్చిన మంచి కథల్ని ఎన్నిక చేయించి వాటినే ప్రత్యేక సంచికల్లో వెయ్యటం మంచిది. పాత రచయితల మేలి రచనలు ఈ తరానికి అందుబాటులో ఉండటం అరుదు. వాటిని సంపాయించి పునర్ముద్రించటం కూడా చాలా అవసరం.

ప్రచురణ కర్తలు:

ప్రచురణ చిన్నసైజు కుటీర పరిశ్రమగా, విజయవాడ కేంద్రంగా వుంది. ప్రచురణ కూడా వ్యాపారమే కాబట్టి లాభనష్టాల బేరీజు ప్రచురణ కర్తలు తప్పకుండా వేసుకుంటారు. నవల లాభసాటిగా వుంది కాబట్టి ఎక్కువగా వాటిని ప్రచురించి వ్యాపారం చేస్తున్నారు. ప్రస్తుతం నవల వ్యాపార వస్తువు కాని ఒక ప్రచురణ సంస్థ సంవత్సరానికి షుమారు పది నవలలు అచ్చు వేస్తే అన్నీ ఒకేరకంగా లాభాలు సంపాయించి పెట్టవుగదా! అందుకని ప్రతి ప్రచురణ సంస్థ ఒక నవల బదులు ఒక ఉత్తమ కథం సంపుటి ప్రచురిస్తే ఈనాడు కథకివున్న దుస్థితి కొంత తగ్గుతుంది.

ఇంగ్లీషు అనువాదం:

ఇతర భాషల కథలు తెలుగులోకి వస్తున్నంత విరివిగా తెలుగు కథలు ఇతర భాషల్లోకి వెళ్ళటం తక్కువని పిస్తుంది. ప్రతి సంవత్సరం వచ్చిన మంచికథల్లోని ఉత్తమ కథల్ని ఇంగ్లీషు తదితర భాషల్లోకి అనువదించే బాధ్యత తెలుగు సాహిత్యాభిమానుల్లోని సమర్థులైన వారు చేపట్టాల్సి వుంది.

వివరాలు:

మొత్తం కథలు - 175

పత్రికలు - 20

మూడు కథలు రాసినవాళ్ళు - 2

1. చెల్లూరి సీతారాజేశ్వరరావు
2. ఎ.ఎం. అయోధ్యారెడ్డి

రెండు కథలు రాసినవాళ్ళు - 15

1. కె. గణపతిరావు
2. వాణిశ్రీ
3. నటరాజ్ ముక్కామల
4. ఆదిమధ్యం రమణమ్మ
5. డి. సుజాతాదేవి
6. వి.యస్. మోరపాకుల
7. మంథా వెంకటరమణరావు
8. ఇల్లిందల సరస్వతీదేవి
9. తులసి బాలకృష్ణ
10. హీరో
11. ఎం.డి. సౌజన్య
12. శ్రీలక్ష్మి
13. బెల్లకొండ యూనిస్
14. చివుకుల రామేశ్వర్
15. రెంటాల హనుమత్ ప్రసాద్.

(విశాఖ ఆకాశవాణి సౌజన్యంతో)

పుస్తక సమీక్ష

"కొమ్మలు - రెమ్మలు"

(కవి: నార్ల చిరంజీవి. ప్రతులకు: 3-6-361/30: హిమాయత్ నగర్. హైద్రాబాద్-29: వెల: అమూల్యం)

అనుభూతి ప్రధానమైన ద్విపాద ముక్తకాల హారం ఈ కావ్యం. ప్రతిభా వంతుడైన కవి చేతిలో ప్రళయమైనా ప్రణయమైనా సజీవత్వాన్ని సంతరించుకుంటుందని ఈ కొమ్మలు-రెమ్మలు నిరూపిస్తున్నాయి. పుస్తకాన్ని పరిచయం చేస్తూ రాంభట్లగారన్నట్లు- "చందనపు బొమ్మల్లాంటి కొమ్మల్ని ఊహించి, కుందనపు మనసులు తొడిగే రెమ్మలు ఈ పద్యాలు. ఈ ప్రణయ పద్యాలను రచించే సాహసాన్ని, 'చిరంజీవి'లో కల్పించిన కీ. శే. అట్లూరి నారాయణ ప్రసాద్ గార్కి-

"స్నేహ మధురపాన చిత్త
మెట్లున్నదో
దీని చిత్తగించి తేల్చుకొమ్మ"

అంటూ కృతిని అంకితం చేశాడు కవి.

నలుగురు పురుషులు మార్చలేని ఒక వ్యక్తిని సమర్థురాలయిన ఒక స్త్రీ మార్చగలదు. ఆలోచింపజేయగలదు. అనుభూతి చెందింపగలదు. తానేడ్చి ఎదుటివారిని విచారింపజేయగలదు. తాను ఆనందించి ఎదుటివారిని పరవశింపజేయగలదు.

"కలికి కన్నుల వెన్నెలుకొలనులాయె
కవి చిరంజీవి హృదయాన కవిత
రగిలె"

ఆ కన్నుల వెన్నెల కుప్పలే ఈ
కొమ్మలు రెమ్మలు.

ప్రతివాడూ ఆలోచించగలడు. ఆనందించగలడు. కానీ ఆ ఆలోచనలకు అక్షర సృష్టిని చేయలేడు. కవి ఆలోచన మాత్రం అక్షరబద్ధమవుతుంది. నలుగురినీ ఆలోచింపజేయగలుగుతుంది. కొన్ని కొన్ని ఊహల్ని చదివింతర్వాత నిజమే కదా! అనిపిస్తుంది. కానీ కవి చెప్పేవరకు ఆ ఊహని ఇంతరమ్యంగా చెప్పేందుకు వీలుందన్న ధ్యాపేఉండదు

"'దిష్టి'పో బుగ్గ చుక్కలు దిద్దినారు
ఎల్లవారల దృష్టి శోభిల్లెనచట!" అని

ఆలోచించే చిరంజీవులెందరు లేరు?

ప్రేయసి సాన్నిధ్యంలో ప్రియుడికి కాలమే తెలియట్లేదు, అందుకే అంటున్నాడు-

"వెనుక క్షణమొక యుగని
వింటినెపుడొ
దేవి! యుమొగక్క క్షణమని
తెలిపె నిపుడు.

అదేం చిత్రమోగానీ సాధారణంగానే ఎవరిని మరవాలనుకుంటామో వారే కళ్ళల్లో కదలాడుతుంటారు. ఎవరి ఆలోచనలను తరమాలనుకుంటామో- వారే గుండెలో గూడు కట్టుకుంటారు.

"వలదు వలదన్న కొలది నా వలపు
పెరుగు
త్రాగుచున్న కొలది కైపు తగిలి
నట్లు"

తానెంతో గొప్పవాడినని భ్రమించే ప్రియుడు ప్రేయసి గాంభీర్యాన్ని చూసి పశ్చాత్తాపుడై—

"అవనికంటె పెద్దననుకుని గర్వించి
చెలియ గుండెకన్న చిన్ననైతి"

అంత ఉన్నతమైన, ఉత్కృష్టమైన స్థానాన్ని చెలియకిస్తున్నాడు కాబట్టి—

"కొవ్వు వత్తిని వెలిగించుకొమ్మ—
కరిగి వెలిగిపోదును కడదాక చెలియ
కొరకు"

అంటూ ప్రేయసికోసం ఆత్మత్యాగం చేయడానికయినా సిద్ధపడుతున్నాడు కవి.

ఈ విధంగా ఒకానొక ప్రణయవాతావరణంలో అక్షర కల్పన చేయబడిన రసగుళికలీ పద్యాలు. దీనిలో ఎన్నితుపాకులు, ఎన్ని దైనమైట్లు ఉన్నాయి అని వెదికేవారికి అవి దొరకవు. ఇదొక ప్రయోగం. ఉర్దూ కవిత్వంలోని శేర్ షాహిరీ లాగా హృదయాన్ని పరవశింప జేసే ముక్తకాలివి: అల్పాక్షరాలలో అనల్పార్థాలను స్ఫురింపజేస్తూ, రెండే రెండు పాదాల్లో గుండెను తాకే భావుకతను సంతరించుకుంటూ హాయిగా సాగిపోయే ఈ పద్యాలు జాయిగాలనందించే వారికి వెన్నెల విహారాలు. —ఎస్వీ

అరణ్యనేత్రం

[అరణ్యనేత్రం, రచయిత జయధీర్ తిరుమలరావు, నవయుగ బుక్ హౌస్, హైదరాబాద్-1, వెల 3-50]

జయధీర్ తిరుమలరావుగారి వచన కవితల సంకలనం అరణ్యనేత్రం. ఈ గేయాలన్నింటా జయధీర్‌గారి సామాజిక తాత్వికత, ప్రజోద్యమాలపట్లఉత్సాహం, ఈ వ్యవస్థ మీద ఆగ్రహం కొట్టవచ్చినట్లు కనబడతాయి.

జి. హోనం 1979, అగ్గిపుల్ల. వాటి ప్రయోజనం మీకు తెలియదు, అరుణ తరంగం, జెండా రంగు మారకతప్పదు, లాంటి కవితలలో, ముందు ముందు ఈ కవి మంచి గీతాలు రాయగలడన్న నమ్మకం కుదురుతుంది.

కవి చెప్పేదేదో స్పష్టంగా చెప్పడం, తన భావాన్ని తేటతెల్లంగా ఆవిష్కరించడం, ఈ కవితల్లోని సుగుణాలు, కాకుంటే కాస్త భావచిత్రాల బరువు ఎక్కువైనట్లు తోస్తుంది పాఠకుడికి, శుద్ధ పఠనంలో కవిత పాకుచున్నచోట మరీ పల్చబడకుండా భావచిత్రాల తెరలు ఎక్కువగా దించారు కవి.

'అడవి ఈ దశాబ్దం పాఠశాలకు

పంతులమ్మ అన్నది జయధీర్‌గారి నమ్మకం. అడవిలోం చేవిప్లవాలుజనిస్తా యని "రేపటి విజయానికి పునాది అడవి" అనేది వీరి స్పష్టాస్పష్ట వైఖరి. ఉగ్రవాద రాజకీయాల గందరగోళ సిద్ధాంతాల మధ్య అరిగీ అరగని మెతుకు వీరి అరణ్యసిద్ధాంతమే. శ్రామికజన పోరాటాలు విప్లవ ప్రాతిపదికలు, అన్నది వీరు పట్టించుకుంటున్నారో లేదో తెలియడంలేదు. 'అడవిని కాస్త గట్టిగా ప్రేమించే రమణారెడ్డిగారు కూడా ఈ కవి సిద్ధాంతానికి కాస్త జంకి' అరణ్యం గమ్యస్థానం కాదు మజిలీ మాత్రమే-' అన్నారు. రేపటి ఉదయవృక్షం అంకు రించాల్సింది గ్రామగర్భంలోనే ననిపిస్తుంది నాకు' అన్నారు రమణారెడ్డి గారు. అదీ 'కార్మికవర్గ నాయకత్వాన' అనీ చెప్పారు. ఉగ్రవాద సిద్ధాంత వేత్తల పులుముడు అంత త్వరగా అంతు పట్టదు ఒకసారి రైతాంగ సాయుధ పోరాటమనీ, మరోసారి రైతు కూలీ ఉద్యమమనీ, ఇంకోసారి 'కార్మికవర్గ నాయకత్వాన రైతాంగ, మధ్యతరగతి ప్రజలనీ – ఇలా అనేకరకాలుగా వారూహించే ప్రజాస్వామిక విప్లవోద్య మాన్ని చిత్రీకరిస్తారు దానిలో నాయ కత్వ సమస్యమీద గానీ, ప్రజల్లో అనేక సెక్షన్ల పాత్రవర్గ పొందికల గురించిగానీ సూత్రబద్ధంగా వారేమీ చెప్పరు. సూత్ర ధారుల్లోనే పులుముడు ముదురుపాకాన ఉన్నపుడు, వాటిని అరిగించుకోలేని యువ కవులు గందరగోళంలో పడటం పెద్ద ఆశ్చర్యం కాదు.

రియలిజం ఆధారంగా వెలువరించే కవితల్లో కాస్త స్రియలిస్టు వెర్రి ధోర ణులు తలదూర్చడం మనకు శ్రీరంగ ద్వయం పెటిన భిక్ష. శ్రీరంగ ద్వయపు వారసత్వం గొప్పదే కాని స్రియలిస్టు రీతివాద క్షీణకళ్ళ వదిలెయ్యడం నవ తరానికి ఆరోగ్యం లేకుంటే ప్రతిచోటా 'చీకటి తప్పులూ', చెమ్మస్థలాలూ చోటు చేసుకొంటాయి. ఆధునికత పేరుమీద ఫార్మలిస్టు ట్రెండ్స్ తళతళలకు ఊడిగం చేస్తూ నూతన విప్లవ సెక్సును గుమ్మ రిస్తారు మోడ్రన్ పొయట్సు. అటువంటి ప్రమాదాన్ని సూచించే కొన్ని ఇమేజ రీలు : కారిడార్ వక్షాలు, పెయింట్ తెల్ల రవిక, ఎకౌంటు నితంబం, సమరాడిన నడుం, లగరీల ఆలింగనం, శీలంగడీ, ఐరన్ సేఫ్ యోని, సన చంద్రబింబం, వగైరా సామానంతా. –

డా. సి.నా.రె. కేవీయార్, నగ్నముని గారలు అరణ్య నేత్రానికి ముందు మాటల బలం యిచ్చారు. ఆ బలంతో తిరుమల రావుగారు మరిన్ని జననేత్రాలని తెరుస్తా రని ఆశిద్దాం.

—కాచినేని రామారావు

జానపద గేయాలు భాషా విశేషాలు

వాడుక భాషా సదస్సుకు సమర్పించిన వ్యాసం

బిట్టు వెంకటేశ్వర్లు ఎం. ఏ.,

ఏ భాషకైనా దాని పదజాలం దానికి గొప్పతనాన్ని చేకూరుస్తుంది. అది భాష ఉన్నతికి నిదర్శనంగా కన్పిస్తుంది. ఏ భాషైనా గ్రాంథికం కంటే వ్యావహారికంలో విస్తృతి ఎక్కువగా ఉంటుంది. తెలుగు భాషను తీసుకుంటే మనకు వాడుకభాషా పదజాలం గ్రంథరూపం కంటే వాడుక రూపంలోనే ఎక్కువగా కన్పిస్తుంది. దీన్ని ఉద్ధరించడంలో జానపద విజ్ఞానాన్ని సేకరించడం అనేది కూడా ఒక మార్గంగా తీసుకోవచ్చు. జానపద విజ్ఞానంలోని వాగ్రహిత కళలకు తప్ప మిగిలిన అన్నింటికి భాషతో సంబంధం ఉంటుంది. అందువల్ల వాటిని భారీ ఎత్తున సేకరించి తెలుగు భాషా సంస్కృతిని, తెలుగువారి సంస్కృతిని కాపాడడం ఎంతయినా అవసరం. భాషా విషయంలో ముఖ్యంగా జానపద గేయాలు ప్రధాన పాత్ర వహిస్తాయి.

వీటిని పల్లెపల్లె దిరిగి సేకరించడం అవసరం. ఒక గ్రామంలోనే ఇద్దరు వ్యక్తులు ఒకేపాట పాడినప్పుడు పాఠాంతరాలు, అధికచరణాలు కన్పిస్తాయి. ఇవి జానపద గేయాలకు ఉండే లక్షణాలు. వాటివల్ల భాషా విశేషాలు అనేకం బయటపడవచ్చు.

జానపద గేయాల్లో కన్పించే భాషా విశేషాలను కొన్నింటిని వివరించడం ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

శబ్ద విపరిణామం

I పదాదిలో హ్రస్వస్వరాలకు బదులు దీర్ఘ స్వరాలు కన్పించడం.

అ) ఆబిసేకము — అభిషేకము

ఆవుపాలు దెచ్చి నేను ఆబిసేకము సేతమంటే

ఆ) తాంబురము — తంబురము

కటకట తాంబురము కట్టైనారదుడు

ఇ) మాంచిదాని — మంచినిద

ఎద్దూ మాంచిదాని యెన్నబెట్టె రయా

1. ఈ వ్యాస రచనలో నా గురువులు ఆచార్య శ్రీ తూమాటి దొణప్పగారి ప్రోత్సాహం, సహకారం ఎంతగానో తోడ్పడ్డాయి.

2. ఈ వ్యాసంలో చూపించిన ప్రయోగాలు పల్నాటిసీమలో నేను సేకరించిన జానపద గేయాలలోనివి.

ఈ) బాక్తి—భక్తి
మేచ్చి—మెచ్చి
బాక్తిమేచ్చి ఒక్క బాలుడ్ని యిచ్చెను.

II పదమధ్య హ్రస్వస్వరాలు దీర్ఘాలుగా కన్పించడం.

అ) మేసేటి—మేసెడి
మేతాళ—మేతల
ఆయావు మేసేటిమేతాళ పేరేమి.

ఆ) తాగేటి—తాగెడి
ఆయావు తాగేటి దాహాళ పేరేమి.

ఇ) పుట్టేటి—పుట్టెడి
తూరుపునా పుట్టేటి సూర్యునితోడ

ఈ) వచ్చేటి—వచ్చెడి
ముందునా వచ్చేటి మునియావుల తల్లి

ఉ) కూకేటి—కూకెడి
పరమటా గూకేటి బాలునీతోడు

III పదాంత హ్రస్వదీర్ఘస్వరాల మార్పాటు
కడవా—కడవ
నెత్తినా—నెత్తిన
నిండు గడవా చల్ల నెత్తినా బెట్టుకొని

ఆ) జమ్మనా—జమ్మన
జమ్మనా పండిన్న గండు జెనగల్లు

ఇ) దిగరానీ—దిగరాని
దిగిదిగీ—దిగిదిగి
దిగరానీ కొండ దిగిదిగీ వచ్చింది

ఉ) ఆడవారీమొఆడవారి
ఆడవారి మాట నమ్మరాదమ్మరో

IV పదమధ్య స్వరలోపాలు

అ) వార్ని—వారిని
వార్ని గాదని పూలు ముడవబోకమ్మా
ఆ వచ్చన్దీ—పచ్చనిదీ
పచ్చన్దీ ఒకపెట్టె నీవీయవమ్మా

ఇ) వార్కి—వారికి
కల్గు—కలుగు
ఈపాట పాడిన వార్కి గల్గువరమ లోకములు

V లోపించిన అక్షరానికి ముందున్న స్వరానికి దీర్ఘం రావడం

అ) ముచ్చాల—ముత్యముల
ముచ్చాల సొమ్ములిద్దు పెళ్లెల్లో చీర లిద్దూ.

ఆ) గర్బాన—గర్భమున
బాలుడూ గర్బాన పుట్టుతాడమ్మా

ఇ) పట్నాన—పట్టణమున
పరమటా చుక బొడిసె పట్నాన తెలవారె

ఉ) ఉంగరాల—ఉంగరముల
ఉంగారాలాచేత ఊపిపోయెయ్యి

VI మహా ప్రాణాలకు బదులు అల్ప ప్రాణాలు కన్పించడం

అ) బూమిదేవి—భూదేవి
బూమిదేవి హదిరేనమ్మ

ఆ) వీదిలో—వీధిలో
వీదిలో తలకురు లిప్పబోకమ్మా

ఇ) బుదవారము—బుధవారము
పుట్టు బిదభరము నాడుగోవు నష్టం నాడు.

ఉ) బుది—బుద్ధి
బురదలోకి దించి బుద్ధి చెప్పేరయా

VII అల్పప్రాణాలకు బదులు మహా ప్రాణాలు కన్పించడం

అ) ధయ—దయ
పరమ కళ్యాణీ ధయ వుంచవమ్మా

VIII 'అ'కు బదులు పదాది హకారం

అ) హాడ — ఆడ

అరిటాకు వంటిది హాడజల్మంబు

ఆ) హంతకంటె — అంతకంటె

హంపించె — అంపించె

హంతకంటే మిక్కిలి హంపించె గాని

ఇ) హలరి — అలరి

గార్వ చిప్పలకే చందనం హలరి

ఈ) హద్దంబు — అద్దంబు

బంగారప హద్దంబు నేనిచ్చేగాని

ఉ) హడివి — అడివి

హడివిదిడుసులన్నీ అన్ని దెప్పించెను

ఊ) హన్న — అన్న

అడసిసువూ గలిగే హన్న కంసూడ

IX పదాది హకారానికి లోపం కన్పించడం

అ) అంస — హంస

అంసలంటి రోకళ్ల అమ్మకోడళ్ల

ఆ) అమసా — హంసా

అమసా నడకలు నడిచే లేమకు

ఇ) అద్దు — హద్దు

అద్దు మీరీ నడువబోకమ్మా

X ద్విత్వాలు పదాంతాన కన్పించడం

అ) గజ్జెల్ల — గజ్జెల

గజ్జెల్ల గల కోడిపుంజో నాసామి

ఆ) రాముల్ల — రాముల

రామరావూ యనియేవు రాముల్ల సీత

ఇ) కాముడిన్ని — కాముడిని

కాముడిన్ని కామట ముంచక

ఉ) కంసుడిన్ని — కంసుడిని

మామ కంసుడిన్ని జంపి మంచిపురి వేలు

ఊ) గప్పున్న — గప్పున

గౌరి పరమేశ్వరుణ్ణి గప్పున్న తలచెను

ఋ) కాగిన్న — కాగిన

కొమ్మ నా కాగిన్న కమ్మనీ పాలు

ౠ) ఆవులల్లో — ఆవులలో

ముందు యావులల్లొ ధారోరి బసవా

ఌ) పొన్నుల్లు — పొన్నులు

చుక్కలంటి రోకళ్ళు సూది పొన్నుల్లూ

ఇచ్చట పన్ను శబ్దం పొన్నుగా కన్పిస్తుంది.

XI కృతక ప్రామాణికాలు

గ్రాంథిక భాషను అనుకరించాలనే దృష్టితో చేయగా కన్పించేవి.

అ) వెందునా — ఎందునా

వెందునా కొరగాక వెయ్యేళ్ళ బతుకు

ఆ) ద్రాహము — దాహము

ఆ యావు త్రాగేటి ద్రాహాళ పేరేమి

ఇ) క్రాగిన్న — కాగిన

కొమ్మనా క్రాగిన్న కమ్మనీ పాలు

చెట్లు — సెట్లు

చెట్టి — సెట్టి — శ్రేష్ఠి

వచ్చిరి ముగ్గురు కుమ్మర చెట్లు

ఈ) ఛన్న బియ్యం — సన్నబియ్యం

చన్న బియ్య మిత్తు మీ చెంచు వారికి

XII ద్రుతానికి బదులు యడాగమం

పాలతో + ఆ మందు — పాలతో యామందు

XIII 'త్య' కు బదులు ద్విరుక్త 'చ' కారము

ముత్యాలు — ముచ్చాలు

నిత్య — నిచ్చ

జయాజయ మంగళం నిచ్చ శుభ మంగళం

ఆది సంయు కత లోపించి

XIV రేఫ నిలవడం కన్పిస్తుంది.

రాలు — రాతలు—వ్రాతలు

అగ్గిరాలు రాసే బ్రమ్మ

విభక్తులు

I. తృతీయలోని 'తోడ'కు బదులు 'తోటి, తోని' 'తో'కి బదులు 'తా' ప్రత్యయాలు కన్పించడం

అ) నీళ్ళతా—నీళ్ళతో

ఒకటి నీళ్ళతా చెయిగడుగుపిమ్మట

ఆ) మామ వస్తుండని మరి సంతసం తోటి

సంతసంతోటి

ఇ) ఇండ్లాండ్ల తోటి

ఇరుగు పొరుగు యిండ్లాండ్లతోటి

ఈ) చెలికత్తెలతోని, ఆడబిడ్డతోని

అత్తాడ బిడ్డలతోని నీతో ఆడే చెలికత్తెలతోని

ఉ) పెద్దెలతోని

దంతవ పెద్దెలతోని దవళించినట్టి

II పంచమిలో 'కంటె'కు బదులు'కన్న' అనేది కన్పించడం

అ) సూర్యచంద్రుల కన్న— సూర్య చంద్రుల కంటె

సూర్య శంద్రులకన్న సూడ చక్కని బాల

ఆ) శంద్రుని కన్న—చంద్రుని కంటె

అతియ శంద్రుని కన్న అతియ చక్కని బాల

III షష్ఠి విభక్తిలోని లోపలకు బదులుగా లోన, లోనె, లోనే అనేవి కన్పించడం

అ) దారిలోన

గొడ్లు బొయ్యే దారిలోన

ఆ) జడలోనె

జడలోనె గంగనాదరించు కున్నట్టి

ఇ) గడియలోనే

గడియలోనే పూసినాయయి కవలాశా పూలూ

సమాసాలు

అ) బ్రమ్మరాళ్ళు

అశియ బ్రమ్మరాళ్ళు రాసిన

ఆ) అడవి దినుసులు

హడవి ది ను సు ల న్ని అన్ని దెప్పించెను

ఇ) గండు జెనగల్లు

ఉ) నిష్ట పురిటిల్లు

నిష్ట పురిటిల్లు ఏమిరా కృష్ణ

ఊ) కుమ్మర చెట్లు

వచ్చిరి ముగ్గురు కుమ్మర చెట్లు

ఋ) గోరెడు కుంకం

గోరెడు కుంకం నా నొసట

ౠ) నిచ్చవాచీలు

నిచ్చ వాచీల్పెట్టి తిరిగేరయా

లయకోసం పదాలకు కావలసినవీ అన్ని పద్ధతులలో మలచుకున్నవీ అయిన బాషా విశేషాలు జానపద గేయాలలో ఎక్కువగా కన్పిస్తాయి.

కవితల పోటీ "అనిసెట్టి స్మారక బహుమతి - రు. 200"

కీ॥శే. శ్రీ అనిసెట్టి సుబ్బారావు, కవిగా వ్యక్తిగా కూడా అభ్యుదయభావాలకి ప్రవాంకుడైన గొప్పకవి; జీవితంలో, ఆదర్శాలను ఆచరించటానికి వెనుకంజ వేయక కష్టాల్ని చిరునవ్వుతో స్వీకరించిన అచ్చమయిన తెలుగు ప్రజాకవి. జీవితంలో ఔన్నత్యానికి, కవిత్వంలో కళా విలువలకీ, ప్రాధాన్యమిచ్చినమహావ్యక్తి ఈనాడు ఆయన వ్యక్తిత్వాని విశ్లేషించుకోవటంవర్ధమానకవులకుఅవశ్యకర్తవ్యం సమాజానికి ఉపయుక్తమైన కవిత్వానికి ప్రేరణ పొందేందుకు అటువంటి మహనీయుల స్మరణఅత్యావసరం.ఆ దృష్టితో, 'సాంస్కృతీ సమాఖ్య - యువసాహితీ వికాసవేదిక - కడపజిల్లా సభ్యులు' అనిసెట్టి స్మారక బహుమతి-రు 200లు కవులకు యివ్వడానికి 'కవితల పోటీ' ఏర్పరిచారు.

కవితల పోటీలో పాల్గొనే రచయిత (త్రు) లకు సూచనలు

1/4 సైజు తెల్లకాగితం మీద 20 పంక్తులకు మించకుండా ఒక వైపునే కవిత వ్రాయాలి. అది స్వీయరచనని, అనువాదం అనుసరణకాదని కవితలపోటీ పరిశీలనార్థమై వ్రాయబడిందని హామీ వ్రాయాలి. క్రింద విధిగా స్వంత చిరునామా వివరంగా వ్రాయాలి.

ఒకే రచయిత [త్రి] 1 నుండి 3కవితల వరకూ ఒకేసారి పంపవచ్చు. దీనితో పోటీ ప్రవేశ చందా రెండు రూపాయలు మనిఆర్డరు చేసిన రశీదు విధిగా జతపరచాలి. పోటీ వ్యవధిలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ఆయా రచయిత[త్రు]లకు విధిగా తెలియపరచటం కోసం సంస్థ భరించాల్సిన తపాలా ఖర్చుల సౌలభ్యం కోసమై "ప్రవేశ చందా" నియమం వర్తింప చేయడమైనదిగా సహృదయులు భావించగలరు. 4) కవితలు, ప్రవేశ చందాలు 1980 మే, 25వ తేదీలోపుగా సమాఖ్య కడపజిల్లా కమిటీ సమావేశకర్త శ్రీ వి. ఎన్. సుబ్బన్న (సమాఖ్య ప్రదేశ్ కార్యనిర్వాహక కార్యదర్శి), ముద్దనూరు, కడపజిల్లా-516 380 అను చిరునామాకు పంపాలి. జూన్ 4 5తేదీన పోటీకి వచ్చిన కవితలు, రచయితల వివరాలు అందరికి తెలియపరచగలం. జూన్ 2వ వారంతో న్యాయనిర్ణేతల పరిశీలన జరిపించటం. 20వ తేదీకల్లా విజేతలను ప్రకటించటం బహుమతుల నివ్వటం మొదలగు పూర్తి కార్యక్రమం ముగుస్తుంది. -మీరు, మీ మిత్రులు అందరూ ఈ కార్యక్రమానికి చేయూతనివ్వండి.

అందరికి ఆహ్వానం-అభినందనలతో-:

ఎం. జానకిరామ్ ఎం. ఏ.,
సమాఖ్య కడపజిల్లా అధ్యక్షులు

సాతవల్లి సత్యనారాయణ
సమాఖ్య కడపజిల్లా కార్యదర్శి
సాంస్కృతీ సమాఖ్య.
నున్న,
విజయవాడ -521 212.

వాడుకభాషా సదస్సు-ఒక సమీక్ష

విశాఖపట్నంలో ఆర్ టి.సి బస్సు డిపో ముందు ఆ రోజు ఉదయంనుండి హడావుడిగాఉంది దాదాపు 10 గంట్లకి కార్లూ బస్సులలో చాలామంది వచ్చారు. అక్కడ అంట్యాకుల పైడిరాజు చెక్కిన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. అంత హడావుడిగానూ వెళ్ళిపోయారు. పెద్ద సంఖ్యలో అక్కడ చేరిన జనం ఆశ్చర్యంగా వారిలోనే వారు ఏమిటేమిటని ప్రశ్నించుకుంటూ కదిలిపోయారు. ఊళ్ళో అనేక విగ్రహాలకి ఏవో సందర్భాలలో పూలమాలలు వేయడం రివాజుంది. ఈ విగ్రహాన్ని ఎవరు ఎప్పుడు పట్టించుకోగా చూడలేదు ఇది వింతగానే అనిపించింది అది గురజాడ విగ్రహం. పెద్దలంతా ఆ విగ్రహానికి పూలమాలలు వేయడంతో అరసం ఆధ్వర్యాన వాడుక భాషమీద రెండు రోజుల సదస్సు ఆరంభమైంది.

అప్పటికే ఈ సదస్సు గురించి పత్రికలలోను ముఖ్యంగా ఈనాడులోను, పోస్టర్లతో తిరుగుతున్న సిటీబస్సుల ద్వారాను తెలుసుకున్న విశాఖ పౌరులు ఆసక్తిగానే ఎదురు చూస్తున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కాలేజి సరసనే అసెంబ్లీ హాల్‌కు చేరుకున్నాయి కార్లూ బస్సులూ. సదస్సు ప్రారంభోత్సవ ప్రసంగ పత్రం సమర్పించిన రాష్ట్ర విద్యామంత్రి భవనం వెంకట్రాం గారితో సహా పత్రాలు సమర్పించే విద్యావేత్తలు, భాషావేత్తలు రచయితలు పెద్ద సంఖ్యలో ప్రతినిధులు ఉందరూ అపుడే ఆలశ్యంగా వచ్చిన రైలులో దిగి సరాసరి గురజాడ విగ్రహానికి అంజలించి ఇటు చేరుకున్నారు.

అసెంబ్లీ హాలు ముందు 'అబ్బూరి నగర్' అన్న అందమైన అక్షరాలు స్వాగతం పలుకుతున్నాయి. లోపల విశాలమైన వేదిక నేపథ్యంలో తెరమీద అంట్యాకుల పైడిరాజు ఈ సదస్సుకోసం ప్రత్యేకంగా చిత్రించిన గిడుగు, గురజాడల చిత్రాలు జీవం ఉట్టిపడుతున్నాయి. ఏడు వందలకు పైగా సీట్లున్న ఆ పెద్ద ఆడిటోరియం మొదట్లో పల్చపల్చగా నిర్వాహకులకు గుండె చెదురుగా ఉన్నా, విశాఖ సంస్కృతికి తగ్గట్టు సభ ఆరంభమయేసరికి నిండి గౌరవం నిలబెట్టింది.

ఏప్రిల్ 26 శనివారం అలా ఆరంభమైన సదస్సు రెండురోజులపాటు గిడుగు, గురజాడల వాడుకభాష పతాకను మళ్ళీ సగర్వంగా తెలుగు దేశంమీద ఎగరేసింది. ఆరంభించిన విద్యామంత్రి శ్రీ వెంకట్రాం అధ్యక్షత వహించిన ఆహ్వానసంఘ గౌరవాధ్యక్షులు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ ఎం. ఆర్. అప్పారావులు సైతం పత్రాలు సమర్పించడం ఇలాటి సభల్లో చాలా అరుదైన విషయం ఆ రోజు

ఉదయం ఈ పత్రంతోబాటు అరసం అధ్యక్షవర్గ సభ్యులు డా. బూదరాజు రాధాకృష్ణ [తెలుగు అకాడమీ] పాఠశాలల్లో వాడుకభాషపైన, ప్రొ. చేకూరి రామారావు [సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్] ప్రొ. కొత్తపల్లి వీరభద్రరావు [హైద్రాబాదు సెంట్రల్ యూనివర్శిటి] [పరిశోధక వ్యాసాలు గ్రంథాలయ భాషపై] కళాప్రపూర్ణ వావిలాల గోపాలకృష్ణయ్యలు [పరిపాలన భాషపై] విలువైన పత్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 1-30 వరకు సదస్సుసాగి మధ్యలో భోజన విరామానంతరం తిరిగి 3-30 కి డా. రంగనాథాచార్యులు అధ్యక్షతన ఆరంభమైంది. ఉదయం సమర్పించిన పత్రాలన్నిటిమీద రసవత్తరమైన చర్చ సాగింది. విద్యామంత్రి శ్రీ వెంకట్రాం పత్రంలో వెలిబుచ్చిన కొన్ని పరస్పర విరుద్ధమైన అంశాలను గ్రాంథికవాదులకు తోడ్పడే అంశాలను ప్రతినిధులు నిర్మొహమాటంగానూ సగౌరవంగానూ వివరించడంతో పరిణితమైన అరసం రచయితల ప్రతిభ, సంస్కారం వెల్లడైంది. తేదలచిన మార్పులపై మంత్రి ప్రకటించిన మంచి అంశాలను హృదయపూర్వకంగా ప్రతినిధులు హర్షించి స్వీకరించారు.

సాయంత్రం రెండవ గోష్ఠికి డా. నాయని కృష్ణకుమారి [ఉస్మానియా యూనివర్శిటీ] అధ్యక్షత వహించగా ప్రొఫెసర్ తూమాటి దోణప్ప [నాగార్జున విశ్వవిద్యాలయం] డా. శివరామమూర్తి [ప్రపంచ తెలుగుసంస్థ] [ప్రామాణిక భాష] శ్రీ వరుముల వెంకటేశ్వర్లు [వ్యావహారిక భాష వ్యాకరణం] శ్రీమతి కృష్ణకుమారి [విజయనగరం విద్యార్థిని] [వరుముల వారిపై] తమ పత్రాలు సమర్పించారు. విద్యుత్ వైఫల్యం జరిగినా చీకట్లో కూడా చర్చలు నిర్విఘ్నంగా సాగాయి. తరువాత మిమిక్రీ, యూనివర్శిటీ కళాకారుల నాటిక విశేషంగా ఆకర్షించాయి.

మర్నాడు ఉదయం ప్రొ. దోణప్ప అధ్యక్షతన శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి శ్రీ లక్ష్మణరెడ్డి [పత్రికలలో భాషపై] డా. నాయని కృష్ణకుమారి [జానపద సాహిత్యంలో భాషపై], డా. అక్కిరాజు రమాపతిరావు [తెలుగు అకాడమి] [వ్యావహారిక భాషపై] బిట్టు వెంకటేశ్వర్లు, బి. ఎన్. రెడ్డి [రిసెర్చి స్కాలర్స్] పత్రాలు సమర్పించారు.

ఆ తరువాత వెంటనే మరో గోష్ఠిలో ప్రొ. రోణంకి అప్పలస్వామి అధ్యక్షతన కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి [వాడుక భాషావాదుల ప్రస్తుత కర్తవ్యం] కంభంపాటి సత్యనారాయణ సీనియర్ [పాఠ్యపుస్తకాలలో అవకతవకలు] ఆటూరి పురుషోత్తం [మాతృభాషలో బోధన] కొవ్విడి నరసింహం [హైకోర్టు న్యాయవాది న్యాయపాలనా భాషపై] పత్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 4-30 దాకా ఇది సాగింది. భోజన విరామానంతరం మళ్ళీ 3 గంటలకే మధ్యాహ్నం గోష్ఠికి శ్రీమతి డా॥ ఎల్. శ్యామసుందరి (ఆంధ్రయూనివర్శిటీ జువాలజీ శాఖ రీడర్) అధ్యక్షత వహించగా తెలుగులో సాంఘిక శాస్త్ర గ్రంథా

సాహిత్య విమర్శపై అరసం సదస్సు

1980 ఆగస్టు కడపలో

అరసం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సదస్సులలో మూడవది "సాహిత్య విమర్శ"పై కడపలో బహుశా ఆగస్టు నెల మూడవ వారంలో జరుగుతుంది.

తేదీలు, ఇతర వివరాలు అభ్యుదయ జులై పత్రికలో ప్రచురించగలం.

వివరాలకు శ్రీ వై. సి. వి. రెడ్డి అధ్యక్షులు కడపజిల్లా అరసం 2/76 A. నాగరాజు పేట. కడప చిరునామాకు రాయండి.

లపై శ్రీ కొత్తపల్లి కేశవరావు, విజ్ఞాన శాస్త్ర గ్రంధాలపై శ్రీ జమ్మి కోనేటి రావు పత్రాలు సమర్పించారు.

ఆ తరువాత చరిత్రాత్మకమైన అరసం ప్రకటన సభకు శ్రీ చాగంటి సోమయాజులు అధ్యక్షత వహించగా. డా॥ పురిపండా ప్రకటన చదివారు. సోమసుందర్ ప్రసంగించారు. (వివరాలు వేరే యిచ్చాం).

సాయంత్రం శ్రీ సోమసుందర్ అధ్యక్షతన సృజనాత్మక సాహిత్యంపై గోష్ఠిలో కళారంగంలో భాషను గురించి ఆంధ్రాయూనివర్శిటీ రంగస్థల శాఖ అధిపతి శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ, సృజనాత్మక సాహిత్యంలో భాషపై శ్రీ వాకాటి పాండురంగారావు, డా॥ రంగనాధాచారి, (ప్రిన్సిపాల్ ఆంధ్ర సారస్వత పరిషత్ కళాశాల) తమ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి డా॥ చందు సుబ్బారావు వందన సమర్పణ చేశారు.

ఆ రోజు సాయంత్రం సదస్సు ముగింపు సందర్భంగా అరసం అధ్యక్ష వర్గ అధ్యక్షులు కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామిగారికి సన్మాన సంఘం ఆధ్వర్యాన సన్మానం జరిగింది.

వైస్ ఛాన్సలర్ శ్రీ ఎం. ఆర్. అప్పారావు అధ్యక్షత వహించగా, సన్మాన సంఘ అధ్యక్షులు ప్రొఫెసర్ సుందరరెడ్డి సన్మానం జరిపారు.

యూనివర్శిటీ ప్రొఫెసర్లు. అధ్యాపకులు. విశాఖ నగర ముఖ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సన్మాన సభ రెండురోజుల సదస్సుకొక నిండుదనం సమకూర్చింది.

ఈ విధంగా జరిగిన రెండు రోజుల సదస్సు ఫలవంతమైనదనడంలో ఎవరికీ సందేహంలేదు. అయితే ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగినా అక్కడి తెలుగు శాఖవారే ఇదేదో తమకి వ్యతిరేకమైనదన్నట్టు ప్రవర్తించడం విచారకరం.

విశాఖ సదస్సు ప్రకటన

విశాఖ పట్టణంలో అరసం నిర్వహించిన వాడుక భాషాసదస్సు ముగింపురోజు 27 వ తేదీ మధ్యాహ్నం అరసం అధ్యక్ష వర్గ సభ్యులు విఖ్యాత కథానిక రచయిత శ్రీ చాగంటి సోమయాజులు అధ్యక్షత వహించిన విశిష్టత సమావేశంలో అరసం అధ్యక్ష వర్గ అధ్యక్షులు కళా ప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి చరిత్రాత్మకమైన ప్రకటన చదివి వినిపించారు. ప్రకటనను విశదీకరిస్తూ అరసం అధ్యక్ష వర్గ సభ్యులు విఖ్యాత కవి శ్రీ ఆవంత్స సోమ సుందర్ ఆవేశపూరితంగా ప్రసంగించారు. సభ కరతాళ ధ్వనులతో ప్రకటనను బలపర్చింది.

ప్రకటన పూర్తి పాఠం ఈ క్రిందనిస్తున్నాం.

"ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని అబ్బూరి నగర్‌లో 1980 ఏప్రిల్ 26,27 తేదీలలో ఆంధ్రప్రదేశ్ అరసం నిర్వహించిన వాడుక భాషా సదస్సులో జరిగిన చర్చలనుప్పురస్కరించుకుని అరసం ఈ ప్రకటన చేస్తున్నది.

1. పాఠశాలల్లో పాఠ్య గ్రంథాల్లో వాడుక భాషను తక్షణం ప్రవేశ పెట్టాలి.

2. విద్యా సంస్థలలో పఠన పాఠనాదులు వాడుకభాషలోమాత్రమేజరపాలి.

3 ఇంతకు ముందెన్నడో ప్రభుత్వం తానే నిర్ణయించిన ప్రకారం వాడుక భాషలో పాఠ్య గ్రంధాలు రాయించి ప్రచురించడంతక్షణమేఆచరణలోపెట్టాలి.

4. ఇప్పుడు చలామణిలో ఉన్న గ్రాంధిక పాఠ్య గ్రంథాలను వెంటనే వాడుక భాషలో తిరగ రాయించాలి.

5. అన్ని స్థాయిల్లోనూ తెలుగు ప్రశ్న పత్రాలు వాడుక భాషలోనే ఉండాలి విద్యార్థులు వాడుక భాషలోనే రాయటానికి అనుమతించాలి

ఈ సందర్భంలో అరసంతో సహకరించి వ్యవహారికోద్యమానికి తోడ్పడిన తోడ్పడుతున్న సంస్థలకూ, వ్యక్తులకూ అరసం ధన్యవాదాలు చెప్తూ ఈ ఉద్యమానికి చేయూత నిమ్మని విద్యాభిమానులందరికీ విజ్ఞప్తి చేస్తున్నది.

ఈ ఉద్యమాన్ని దెబ్బతియ్యటానికి ప్రయత్నించిన, ప్రయత్నిస్తున్న సంస్థలనూ, వ్యక్తులనూ గర్హిస్తున్నది."

వ్యతిరేక గీతాలు

[యువర్ ప్యాస్ట్ లైఫ్ ఎరౌండ్ చర్చ్
— లూయీ మేకనీస్]

చర్చి మీద విశ్వాసం
ఎవరికుంది మేకనీస్
విరిగిన విశ్వాసమే నోయ్
చివరకు చర్చి —
[లెట్ యువర్ పాయిజన్ బీ యువర్
క్యూర్ — లూయీ మేకనీస్]

పుటకతో పాటు
ఒక క్రమం పూరి.
వ్యాధిగ్రస్తతతో పాటు
ఒక తప్పు —
మెడియర్ కవీ !
విషం ఎప్పుడూ విషమే
అయితే —
నువ్వు తాగావు దాన్ని
నీకు మాత్రం ఔషధం అయింది.

ప్రదేశ్ హిందీకవితకు తెలుగు: కేయం

సంపాదకవర్గం విజ్ఞప్తి

అభ్యుదయ ప్రచురణలో అనివార్యమైన కారణాలు తప్పనిసరి ఒడిదుడుకుల వల్ల మార్చి నుండి ప్రచురణ ఆలశ్యం కావడం. చందాదార్లకు ఏజెంట్లకు. సకాలంలో పంపలేకపోవడం జరిగింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం.

ఇబ్బందుల్ని అధిగమించి మార్చి, ఏప్రిల్ సంచికలు కొంత ఆలస్యంగా పంపగలిగాం. ఈ సంవత్సరంలో ఇప్పటికే హెచ్చు పేజీలతో అధికవ్యయంతో జనవరిలో–నవలమీద ఏప్రిల్‌లో వాడుక భాషమీద–రెండు విశేష సంచికలు చందాదార్లకు అందించాం.

ఇప్పుడు తప్పనిసరై మే జూన్ నెలలు కలిపి ఒకే సంచికగా తేవాల్సి వచ్చింది.

ఇక నుంచి ఏనెల కానెల ఆలశ్యం లేకుండా పత్రికను అందించగలమని విశ్వశిస్తున్నాం.

అనేకమంది మిత్రుల చందాలు ముగిశాయి. వారిని వెంటనే పునరుద్ధరించు కోవల్సిందిగా కోరుతున్నాం.

పత్రికలు అందకపోయినట్లయితే మాకు రాయడంతోబాటు తపాలా శాఖకు కూడా ఫిర్యాదు చేయల్సిందిగా విజ్ఞప్తి. పాత ప్రతులు మా వద్ద లభించడం కష్టమని మనవి.

ఈ సంవత్సరం మరో మూడు నాలుగు విశేష సంచికలు వెలువడే అవకాశం ఉంది. వెంటనే చందాదారులుగా చేరకపోతే పరిమిత సంఖ్యలో ప్రచురించే ఆ సంచికలు లభించడం కష్టమౌతుంది.

నవల, భాష విశేష సంచికలు 'విశాలాంధ్ర బుక్ హౌస్ శాఖలన్నింటిలోనూ లభిస్తున్నాయి

నవల సంచిక వెల. రు. 6/- భాష సంచిక వెల. రు 5/-

ఓ గేయం ఓ గాయం

— రవి

మంచు – తెల్లగా – ఎప్పటిలా –
అక్షరం – హ్రస్వం – తగినంతగా –
తరగదు – తరిగి పోలేదు –
సాయంత్రం – దీర్ఘంగా – బాధించెను
నను

మంచు – కురుసోంది – చిత్తడిగా –
చీకటి – సంధ్య వెలుగులో – కాంతి
లేదు – వెచ్చదనం – నను తాకదు –
దగ్గుత్తిక – ఆవహించె – నా చుట్టూ –
అయినా – ఒక మనిషీ – చలిగా
వణకడు

ప్రతి మనిషీ – ఆడా – మగా
కుర్రకారూ – ముసలివారూ –
ఆకలిగా – ఆత్రంగా
మంటలా – వెన్నంటు – తోటి మనిషి
పైకి

మంచు కురుసోంది – అనంతంగా –
అక్షరం – హ్రస్వం – ఎప్పటిలా
సాయంత్రం – నిష్ప్రేమం– నిస్స్నేహం
మంచు – లేదు – స్వచ్ఛంగా – ఉండదు

[ఎడార్డ్ మెఘలెటిస్‌కు కించిత్ స్వేచ్ఛానువాదం] రవి.

వరుసలవారూ - వ్యావహారిక భాష

శ్రీమతి కృష్ణకుమారి

వ్యాకరణోపాధ్యాయులు, కళాప్రపూర్ణులు, ఆంధ్ర పతంజలులు, సంస్కృత ప్రాకృతాంధ్ర పండితులు, తమిళ కర్ణాటక మళయాళ భాషావేత్తలు, వ్యాకరణశాస్త్ర తత్వవేధులైన శ్రీ వరుల చిన సీతా రామస్వామి శాస్త్రిగారు గ్రాంధికాంధ్ర భాషా సంరక్షకులేగాక వ్యావహారిక భాషా పక్షాన న్యాయవాదులు కూడా. వీరిలాంటి గ్రాంధికాంధ్ర పండిత ప్రకాండులు కూడా వ్యావహారిక భాషని ఆమోదించడం యీ వాదానికే తిరుగులేని వరం. యింకా అడపాదడపా వ్యావహారిక భాషపట్ల వున్న అపోహలు తొలగడానికిదోహదం చేస్తుందనే వుదేశ్యంతో ఈ వ్యాసం మీ ముందుంచుతున్నాం.

వీరు 1910 లో విజయనగరంరిప్పన్ హైస్కూల్లో పండితులుగప్రవేశించారు. అనతికాలంలోనే గురజాడ, సంస్కృతాంగ్ల కళాశాల అధ్యక్షులు కిళాంబిరామానుజాచార్యులగార్ల ప్రాపం పొందారు. అప్పటికే గురజాడ వారు వ్యావహారిక భాషోద్యమం చేపట్టారు వీరినిగూడ వారి వుద్యమప్రచారకర్తలుగామలచుకొన్నారు. ఆనాటి నుండి వరుసలవారు వ్యావహారిక భాషా సమర్థకులయ్యారు. the telugu literary association లో కూడా చురుకైన పాత్రను వహించి వ్యావహారిక భాషా వాదానికి వెన్నెముగా నిలిచారు.

గిడుగు గురజాడలలో 1914 లో కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్ సమావేశానికి వెళ్లారు. ఆనాటి పరిషత్సభలో పాల్గొనడానికి అవకాశం యివ్వక పోతే పోలవరం జమీందారు గారైన కొచ్చెర్లకోట కృష్ణారావు బహద్దరువారి ఆధ్వర్యంలో జరిగిన సభల్లో "వరుల తెలుగు వ్యాకరణాల ధర్మాన్ని గురించి ప్రసంగించి నేటి వ్యావహారికాంధ్రభాషా లక్షణం కూడా చేర్చుకోవాలన్నారు."[1] 1914 లో ఎలమంచిలి సభలో "శిష్ట వ్యవహారమందున్నభాష గ్రామ్యమనుట శాస్త్ర విరుద్ధమనెడియు పాపదనమున" వీరూ ఆమోదించారు.[2] యింకా కృష్ణా పత్రిక, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, ఆంగ్ల కళాశాల పత్రికల్లో యీ వాదాన్ని సమర్థిస్తూ వ్యాసాలు వ్రాశారు.

ఆనాటి గ్రాంధిక వ్యావహారిక భాషా

---

1. గిడుగు వెంకట రామమూర్తి జీవిత చరిత్రము. 28 పుట.

2. ఆంధ్రభాషాను శాసనము. విజ్ఞప్తి పుట.

సమరంలో వ్యావహారిక భాష తరఫున పాల్గొన్నవారంతా ఆంగ్లభాషా పండితులే తప్ప సంస్కృతాంధ్ర పండితులు కాదనే అభాండం ఒకటి వుండేది. కాని బుర్రా శేషగిరిరావుగారి వ్రాతల్నిబట్టి చూస్తే వ్యావహారిక భాషోద్యమం అనేది ఆంగ్ల వాసనలు ఆవగింజంతైనాలేనిశుద్ధ సంప్రదాయ పండితులు అప్పారావుగారికి ముందే లేవదీసిదేనని గురజాడ జాగ్రత్త చేసిన అచ్చు పత్రికల ప్రతుల్లో వుందనే విషయం తెలియవస్తుంది.3

గ్రాంథిక భాషా వాదాని కొమ్ము కాసిన పండితులందరికీ భాషాంతరం సంస్కృతం వొక్కటే అయితే వ్యావహారిక భాషా ప్రామాణికభాషా నిర్మాణానికి ప్రముఖమైన సాధనం అని విశ్వసించే వీరికి సంస్కృత పాకృతాంధ్ర భాషల్తో పాటు ద్రవిడ భాషలుకూడా కరతలామలకములే. వీటన్నిటిలోని అనుపానులు జీర్ణించుకొన్న వారవడంనుంచి ప్రాచీన సంప్రదాయాన్ని తెలుసుకొని కాలంతోపాటు పరిణామాన్ని గుర్తించి వ్యావహారిక భాషలోకూడా వ్రాయడం నిజమైన సంప్రదాయమనినొక్కి వాక్రాణించారు. కొందరు గ్రాంథిక వాదులైన వాళ్ళు వరుసవారు వ్యావహారిక వాదాన్నే తోసిపుచ్చుతున్నారనీ దానికో వ్యాకరణం వ్రాస్తే పరిహసిసారనీ అపోహపడ్డారు. దానికి వీరు "వ్యావహారిక భాషతో గ్రంథములను వ్రాయరాదని నేను వాదించు వాడను గాను వస్తాడు పోతాడు మొదలగు వ్యావహారిక శబ్దములు ప్రాచీన మహాకావ్యములలో గలవనుట సత్యవిదూరమని మాత్రమే నా యభిప్రాయము.... వ్యావహారికభాషలో సైతము గ్రంథములు వ్రాయవచ్చును." అని నిర్ద్వంద్వంగా స్పష్టీకరించారు.4

అపభ్రంశ ప్రయోగాలా ప్రయోగార్హాలే

సంస్కృత భాష వ్యవహార భ్రష్టమవడం నుంచి పండితులు ఆ భాషను నియమించి అనేక లక్షణ గ్రంథాలు వ్రాశారు. అందుకని ఆ లక్షణాలకి లొంగని ప్రయోగాలన్నీదుష్ట ప్రయోగాలని వారి సిద్ధాంతం. మొదట్నుంచీ సంస్కృత భాషా పోకడలు పోయే మనవారూ తెలుగుభాష వ్యాకరణాలకి లొంగి వుండని భాష గ్రాహ్యం కాదనీ అన్నారు. కానితెలుగు నిత్యం వ్యవహారంలో, వుండడంవల్ల వాడుక పదాల్ని కవులు ప్రయోగించారు. ఆ ప్రయోగాల్నే గ్రామ్యమనే పేరుతో వ్యవహరించే యీ అపభ్రంశ ప్రయోగాలు సద్వ్యవహారగతాలైతే ప్రయోగయోగ్యాలే అని వీరు వసు చరిత్ర విమర్శనంలో విమర్శించారు. ఆ ప్రయోగాలుకొన్ని చూడండి.

1. ముసలి మానులు [ఆ 1. ప 45]

ఈ యుదాహరణమున వ్యవహారసమగు పదాది వర్ణ సంయుక్త రేఫలోపము చూపబడినది. మరియునందు సువర్ణాంత శబ్దములకు బహువచనమునందు

3. గురజాడ అప్పారావు. ఆంధ్రభాషా సారస్వతోద్ధారకము.

4. వైయాకరణపారిజాతము. విజ్ఞప్తియనుబంధము.

వచ్చు కుణాగమము రాకుండుటయు జూప బడినది. త్రాగు ప్రోగు మ్రగ్గు మొద లగుమరికొన్ని పదములందలి పదాది వర్ణ సంయుక్త రేఫలోపమును సైతమంగీక రించి శబ్ద రత్నాకరమున బహుజనపల్లి సీతారామాచార్యులవారుదాహ రించి యున్నారు.

ఈ యుదాహరణమున నచ్చు పర మగునపుడును మధ్యము పురుష 'ము'వర్ణ లోపము గలుగను వ్యావహారికాంధ్ర భాషా నియమము చూపఁబడినది. 'చూడు చూడవి పిలిచె'నను మొదలగు వాడు కలలో నీ నియమ మగపడుచున్నది. ఇట్టివి మరికొన్ని ప్రయోగములును గలవు. 'ఆడిదె నీదు పందెము') కళా. ఆ.6) భవచ్చిత్తేప్సితం బెద్ది చెప్పనినన్ (మార్కం. ఆ,')

ఇంకను కన్గొఁజాక, మనమరాలు, డించగన్, అమ్మని, కొమ్మంచున్ మొ॥ ఉదాహరించారు. 5

హరిశ్చంద్ర నలోపాఖ్యాన విమర్శ నంలో కూడా కొన్ని రామరాజభూష ణుని వ్యాకరణ విరుద్ధాలయిన ప్రయో గాల్ని పేర్కొంటూ (ఆడ, ఏడ, సంపు, త్రావడం, సమయించన్) అట్టివి వ్యావ హారిక భాషనుండి యేర్చి కవులచే ప్రయో గింపబడ్డ పదాలే అని నిర్ధరించారు. ఆ ప్రయోగాల సాధుత్వాన్ని శంకించలేదు.

ప్రాచీన గ్రంథాలు - వ్యావహారిక భాష

ముద్రణా యంత్రాలు లేని కాలంలో గ్రంథాలు వ్రాసేవారు వారి వారి ఉచ్చార ణానుకూలంగా వ్రాయడం చేతనూ, అర్ధానుస్వార శకరేటఫ సరళా దేశాదుల పాటింపకుండా వ్రాయడం చేతనూ లక్షణ విరుద్ధ పదాల్ని వ్యావహారిక భాషా ప్రభా వంతో వ్రాయడంచేతనూ ఆ గ్రంథాన్ని యథాస్థితంగా ముద్రించడానికి సమ్మ తించక సవరణచేయడం ఆలవాటై పోయింది. అపండితులైన లేఖకులూ అరకొరగా ఉన్న లాక్షణిక గ్రంథాల్ని బట్టి యధేచ్ఛగా దిద్ది వేస్తున్నారని అంటూ "ప్రాచీన వ్యాకరణము లత్యల్ప విషయము లగుటచేత భాష వ్యవహార సమై పెరుగుచుండుట చేతను నవి భాష లోని యే దేశమును సయితము నియ మింప జాలకున్నవి. మహాకవుల కావ్య ములలోని ప్రయోగములను బట్టి నియ మించుకొన వలెనందమా! అవి తప్పు లతో నిండియున్నందున వానియందు లేఖకాదుల ప్రమాదమున బడిన తప్పు లేవో, లేఖకాది ప్రమాద జనితములని భ్రమించి యత్యల్పములై యసంపూర్ణ ములై యున్న చిన్న వ్యాకరణముల నాధారముగా జేసికొని యిటీవలి లాక్షణికు లును బండితులను దిద్దివేసిన భాగము లేవో నిజమయిన కవి ప్రయోగములేవో తెలిసికొనుట దుర్ఘటమై యున్నది—" అని నిరసించారు. 6

పై వ్రాతవల్ల 1. తెలుగు వ్యాకరణా లోని అసమగ్రత, 2. పరిష్కర్తల సంకుచిత దృష్టి, 3. వ్యావహారిక రూపా లను గ్రంథ వ్యవహారంలో ఎప్పటి

5. వసుచరిత్ర విమర్శనము- 105 పు.

6. హరిశ్చంద్ర నలోపాఖ్యాన విమర్శ నము - 82 పు

కప్పుడు చేర్చుకోవలసిన ఆవశ్యకత అనే విషయాన్ని గూర్చి వజ్ఝలవారు తీవ్రంగా యోచించినట్లు తెలుస్తూంది.

వ్యావహారిక భాషే నిజమయిన సంప్రదాయం

సాధారణంగా వచన గ్రంథాలూ వ్యాఖ్యానాలూ వ్యావహారిక భాషలో వ్రాయడం కన్పిస్తుంది. వాటికి సంబంధించిన తాళపత్ర గ్రంథాలు వేలకొద్దీ కన్పిస్తున్నాయని హరిశ్చంద్ర నలోపాఖ్యానంలో సోదాహరణంగా చూపారు. చిత్రకవి అనంతకవి వ్రాసిన హరిశ్చంద్ర నలోపాఖ్యాన వ్యాఖ్యానాన్ని కాకరపర్తి కృష్ణకవి స్వయంగా వ్రాసికొన్న ప్రతినుండి మొదటి పద్య వ్యాఖ్యానం నుంచే ఇలా చూపించేరు.

"శ్రీ వైదేహసుతన్, సీతనున్ను భృగూద్వహ జయశ్రీ, భార్గవ జయ లక్ష్మినిన్ని, అబ్జభృచ్చాప, శివవిష్ణు చాపాలయొక్క లీలావ్యాప్తి చాతను అబ్జశంఖశశాంకేచ-అమరః ....

....

పండిత కవియగు కృష్ణకవి పయిరీతిని వ్రాయుటను బట్టి యాలోచింపఁగాఁ బూర్వకాలముననట్లు వ్రాయుచుండుటయే నిజమయిన సంప్రదాయమని విశదమగుచున్నది. కృష్ణకవి వ్యాకరణజ్ఞానము లేనివాఁడనిగాని మాతృకకు సరిగా వ్రాయలేని వాఁడనిగాని, తాను వ్రాయుచున్నది వ్యావహారిక భాషయని తెలిసి కొనలేని వాఁడనిగాని చెప్పఁజాలము గదా!"[7]

వ్యావహారికభాష పరిణామం

వ్యావహారిక భాష మార్పులు పొంది తీరుతుందనే విషయం సర్వసాధారణమైంది. కాలంతోపాటు భాష అనేక రకాలైన పరిణామాలకు లోనవుతుంటుంది. మన ముఖ యంత్రంలోని స్వభావం, యితర భాషా జనుల సంపర్కం, సౌలభ్యాపేక్ష, పద స్వరూప జ్ఞానం, వుచ్చారణంలోని త్వర, అస్పష్ట శ్రవణం, వుచ్చారణంలోని సుఖాపేక్ష. వర్ణోత్పత్తి స్థానాలలోని లోపాలు, దేశంలోని శీతోష్ణస్థితి భేదాలూ ఆ భాషా పరిణామానికి హేతువులంటారు. ఈ మార్పులెలా వస్తాయో లక్ష్యపూర్వకంగా నిర్దేశించారు.

I. మహాప్రాణ వర్ణపగు హకారముచ్చారణ సౌలభ్యాపేక్షచే లోపించును.

ఉ॥ హరితాళము = అరిదళము—
హజ్జు = అజ్జు. సహజము = సాము—
పదహారు = పదారు.

2. కొన్ని యెడల దీర్ఘపుటూనిక పరాక్షరద్విత్వముగాఁ బరిణమించును.

ఉ॥ చేయి = చెయ్యి పూవు = పువ్వు
ఆ చోట = అచ్చోట. పోయేవారు = పొయ్యేవారు.

3. అస్పష్ట శ్రవణము,సౌలభ్యాపేక్ష ప్రసిద్ధ పదసామ్య భ్రమ అను మొదలగు కారణములచే లోపాగమాదేశాదులు

---

7. హరిశ్చంద్ర నలోపాఖ్యాన విమర్శనము- 83-84 పుటలు.

వచ్చు: ను. మహాత్మ్యము = మహాత్మ్యము స్యమంతకము = శమంతకము: కవ లలు = కలవలు: ఎండకాలము = ఎండా కాలము, (వర్షాకాలము).[8]

ఈ రకమైన మార్పులనింకా ఆయన సోదాహరణంగా చూపించారు. తత్సమా లకి ఇలాంటి వ్యావహారికపు వికృతులు పొందితే తద్భవాలౌతాయని కూడా చెప్పారు.

ఒకప్పటి శబ్దాలే వ్యావహారిక వశాన వర్ణలోపాది వికారములు పొంది విభ క్తులుగా పరిణమించాయని గుర్తించక వానిని అవ్యుత్పన్నాలైన ప్రత్యయా లుగా భ్రమించారన్న భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం వీరికీ సమ్మతమే. మన తెలుగు భాషలో కూడ విభక్తులు ఇలాగే వచ్చాయని అంటూ "డు, ము, వు, లు, ను, కు మొదలగునవియు నొకప్పుడు శబ్దములయి యుండెడి వనియు, నవి వర్ణాగమవర్ణ లోపాది వికారములను వ్యవహార వశ మున నంది యుండుటచే వాని తొంటి ప్రకృతులు మనకిప్పుడు విశదపడకున్న వనియు నూహింపవచ్చునుగదా!"– అంటారు;

నియమ శూన్యంగా వ్రాయడం పరిహసనీయం

నియమం యే భాషకయినా అత్యావ శ్యకమే. స్వస్థాన వేష భాషాభిమానులైన కవులంతా పండిత వ్యవహార భాషను సంస్కరించి నియమాన్ని కల్పించిన ఆ భాషను అద్యతన కవులు గ్రంథాల్లో నిస్సందేహంగా ప్రయోగించవచ్చని ఉపదేశిస్తూ. "పాశ్చాత్య విజ్ఞానము తెలుగులోనికి రావలెనన్నపుడును నట్టి విజ్ఞానముగలవారు కావ్యభాషతో గ్రంథ ములు వ్రాయజాలనపుడును గ్రాంధిక భాషకన్న వ్యావహారిక భాష సుబోధ మగునపుడును బండిత వ్యవహారనాంధ్ర భాషను గ్రాంథిక భాషగా నెల్లవారును నంగీకరించి తీరవలెను గదా! కాని ఈ వరకిట్టివారు వ్రాయుచున్న పద్ధతిని నియమశూన్యముగా వ్రాయుట పరిహాస నీయము. అట్టి రచనతోడి గ్రంథము వాఙ్మయములోనికిఁ జేరనేరదు. కాన నన్నయ కాలమునందు వలెనే నేఁడును నాంధ్ర పండితులు సంఘముగ నేర్పడి కొన్ని సుగమములగు నియమముల నేర్పరిచి వ్యావహారికాంధ్రమును సంస్క రించుటయు నట్టి నియమములతో నొప్పెడి వ్యావహారిక భాషతో వారు గ్రంథ రచనము చేయఁబూనుట యుక్త మని"[10] వీరి అభిప్రాయం. ఆ నియ మాలు కొన్ని వైయాకరణ పారిజాతం లోనూ కొన్ని వసుచరిత్ర" విమర్శనం లోను చొప్పించి యున్నారు. వైయా కరణ పారిజాతంలోని నియమాలివి.

i. వ్యవహార భ్రష్టములగు నర్ధాను స్వార శకట రేఫముల నుపేక్షించుట.

ii. వ్యవహారమున లేని సరళాదేశా దులను చేయ మానుట. "కాబట్టి తెల్ల వారెను" మున్నగు చోటులందు మాత్రమే సరళాదేశములను బాటించుట.

---

8. వజ్ఝల చినసీతారామస్వామిశాస్త్రిగారి అముద్రిత వ్యాసం.

9. అథర్వణ కారికావళి విమర్శనము, 52వ పుట.

10 వైయాకరణ పారిజాతం 38వపుట.

iii కళా ద్రుత ప్రకృతి కత్వముల తోడి సంధుల నుపేక్షించుట. విసంధిగ నజాది పదములను యథాస్థితముగనే వ్రాయుట అట్టి మొదలఁబదాంతద్రుత లోపాదికము [నాచేత అతడు మొ] నంగీకరించుట.

iv వ్యవహారభాషనుండియథారుచిగఁ బదములను సమాస పదములను గ్రహించుట. అనేకమంది, మనుషులు మొ॥

v అన్యదేశ్య పదములకు సరియగు ప్రసిద్ధ సంస్కృతాంధ్ర పదములు దొరకనపుడా యన్యదేశ్య పదములనే యాంధ్ర సంప్రదాయము చొప్పున ద్విత్వోత్వాదులను జేర్చి వాడుట మొ॥ రైలు రోడ్డు మొ॥

ఇలాంటి నియమ సహితమైనపుడే వ్యావహారిక భాష ప్రామాణికమై లోకోపయోగం అవుతుందనీ వీరి నిర్ణయం. 1973 The telugu launguage commitee on the use of modern standard telugu- వారు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సమర్పించిన నివేదికలో "ఆధునిక-ప్రమాణ భాషా స్వరూపం-రచనకు కొన్ని సూచనలు" అని చెప్పిన భాగాన్ని రూపొందించడానికి తగిన కలాలోచనలు వరుులవారి సూచనకు అనుగుణ్యమైనవని భావించవచ్చు.

వాడుకలో వున్న భాషకు లోకమె పెద్ద వ్యాకరణం

ప్రయోగ శరణాః వైయాకరణాః- అనే పరిభాషని బట్టి లోకవ్యవహారమే

11 చూడుడు 105వ పుట.

వ్యాకరణ రచనకు ప్రమాణం. కన పండితలోక వ్యవహారాలై శ్రుతిహితాః సుమనోహరులైన పదాల్ని గ్రహిం గ్రంథాల్లో ప్రయోగిస్తారని చెప్ప "గ్రంథములు కొన్ని వెలసిన వెను కొన్ని మార్పులు పురాతన నవీన భాష కుండుటచేతను వానిని చెప్పుటకు నక్రమముగాఁ కొన్ని విధములగు భాష నియమములు దెలియుటకును, విది సుశ మును జ్ఞానము గాఢమగు లక్ష్య పరిశ్ర లేనివారికిఁ గూడఁగలుగుటకును వ్యాకర మావశ్యకమగును అట్టి వ్యాకరణము తొలుదొల్త సాకల్యముగా భాషను నిం మింపఁజాలవు. వాడుకలోనున్న భాషకు బెద్ద వ్యాకరణము లోకమె గాన భా లోని సామాన్యములగు కొన్ని నిం మములు మాత్రము పైకారణముల బండితులు సంగ్రహింతురు. అ గ్రంథమునే వ్యాకరణ మందుము" అ నిర్ణయించారు.[12]

వీరు మార్గోపదేశిక పేరుతో విద్యా శాఖ వారి నిబంధనల ప్రకారం విద్యా వ్యాకరణం వ్రాస్తూ వాడుక పదాల్ని ఇచ్చారు. అప్పటి తెలుగు వ్యాక లెవ్వరూ కూడా వాడుక రూపా చూపిస్తూ భాషా స్వరూపాల్ని తెలి జెప్పలేదు. వీరు "దేశ భాషలలో గ్రామ భాష వేరుగను వావ్యహారి భా వేరుగను నేర్పడుచుండు[13] న వుద్దేశ్యం కలవారు కనుకనే విద్యార్థు

12. వఝులచిన సీతారామస్వామిశాస్త్రి గారి అముద్రిత వ్యాసం,

13. చింతామణి విషయ పరిశోధనము 86 పు.

గ్రాంథిక రూపాలను సులభంగా అవగాహన చేసుకోవడానికి వ్యావహారిక రూపాలను గ్రహించ వలసిన అవసరం యెంతైనా వుందని వీరు భావించారు. అంగ్లంలో ఆలోచించి తెలుగులో వాక్య నిర్మాణం చేసే కొందరు ఆధునికుల పద్ధతిని నిరసిస్తూ వ్యావహారిక భాషలో ఆలోచించి దానిని గ్రాంథిక భాషలోకి మార్చే విధానాన్ని వీరు ప్రోత్సహించారు.

ప్రథమ నవీనాంధ్ర వ్యాకర్త

ఆనంద గజపతి[14], గురజాడ,[15] మండలక్ష్మీ[16] కామేస్వరశాస్త్రి, పారనండి రామశాస్త్రి[17] గిడుగు[18] సీతాపతి, చిలుకూరి[19] నారాయణరావు అయల[20] సోమయాజుల నరసింహశర్మ, చేకుమళ్ళ కామేశ్వరరావు మొదలైన వాళ్ళంతా వ్యావహారిక భాషా వ్యాకరణం వ్రాయాలని సంకల్పించారు. వఝులవారు వ్యాకరణం వ్రాశారు. వల్లమూడి గోపాల కృష్ణయ్యగారి "వ్యావహారిక భాషా వ్యాకరణం, వజ్ఝల వెంకటేశ్వర్లు గారి "ఆధునిక ప్రామాణికకాంధ్ర వ్యాకరణం" వెలువడ్డాయి.

---

14. మాటమంతీ అవీ యివీ - 152 పు

15. మహాకవి డైరీలు. 136 పు.

16. ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణ 430 పు.

17 వినికిడి

18. కిన్నెర, 1952 వ్యవహారిక భాషకు వ్యాకరణం సీభాపతిగారి సూచనలు.

19. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1948-1949. నవ్యాంధ్ర వ్యాకరణ నిర్మాణం.

20. వైయాకరణ పారిజాతం, 38 పు.

ఆనాడు వ్యావహారికాన్ని మోడరన్ తెలుగు అని వ్యవహరిస్తూ ఉండేవారు. ఇప్పటి దేశస్థితిని బట్టి కన్నడమును వలె నెయాంధ్రమును నయితము ప్రాచీనాంధ్రము నవీనాంధ్రమునని రెండు విధములుగా విభాగించుకొనుట యావశ్యకమై యున్నట్లగపడుచున్నది"[2] నడం వల్ల వీరూ వ్యావహారిక భాషను నవీనాంధ్రమని వ్యవహరించినట్లు తెలుస్తూంది. వీరి వ్యాకరణాన్ని గూడ "నవీనాంధ్ర వ్యాకరణము"నే వ్యవహరించారు. యీ వ్యాకరణంలో ప్రాచీనాంధ్రాన్ని నవీనాంధ్రాన్ని తులనాత్మకంగా పరిశీలిస్తూ వచ్చారు. మేం చూసిన ప్రతిలో సంజ్ఞా సంధివిషయాల్తో కూడిన మొదటి పరిచ్ఛేదం వుంది. ఆ పరిచ్ఛేదంలోవే మచ్చుకి రెండు సూత్రాలు చూదాం.

1 సూ. ప్రాచీనాంధ్రమునకు వర్ణములేబదియాఱు అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ ం ః క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ఱ ల వ శ ష స హ (ప్రాచీనాంధ్రమనగా నిదివరకంగీకరింపబడియున్న కోశాదిస్థితి భాష.)

2 సూ. నవీనాంధ్రమునకు వర్ణములేంబదియాఱు. పై నుదాహరింపంబడిన వర్ణములలో నర్ధానుస్వారశకట రేఫలు వ్యవహారమున లేమింజేసి వానిని విడిచి యన్యభాషా సంపర్కముచే వచ్చిన "ఫజ" యను రెండక్షరములును జేర్పంబడినవని గ్రహించునది 'సాఫుగా'నను చోట ఫకారమాంగ్లేయ భాషలోని

'full' అను శబ్దమున వినఁబడు 'f' అను దాని యొక్కయు రోజులను చోట జకార మాంగ్లేయ భాషలోని 'Zone' అను శబ్దమున వినబడు 'z' అనుదాని యొక్కయు, నుచ్చారణములను గలిగి యున్నవి గదా. యిట్టి యుచ్చారణ భేద మును దులుపుటకు జెఫేలపై కొక బొట్టు నుంచునది.

3సూ. అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఐ ఒ ఓ ఔ "యను వర్ణములకు శుద్ధోచ్చారణమును గొన్ని చోట్లఁ బరస్పర సంబంధ జన్యమగు మిశ్రోచ్చారణము గలవు. అట్టిమిశ్రోచ్చారణమును దెలుపుటకె వానిమీదనొక యడుగీటు గీచున్నది.

శుద్ధోచ్చారణము మిశ్రోచ్చారణము

ఆ-ఆమె తాటి + ఆకు = తాటాకు

[వ. తాకు_తాటాకు నను ప్రయోగములు ప్రాచీనాంధ్రమునందును గలవు]

9. ప్రాచీనాంధ్ర వైయాకరణులు తెనుగు భాష దేశము సంస్కృత సమము' సంస్కృతభవము గ్రామ్యము నని నాలుగు విభజించిరిగాని గ్రామ్యము నొక భాషఁగా బరిగణించుట యనావశ్యకమని తోఁచు చున్నది. మఱియును నన్య దేశ్యములు సైతము సంస్కృత ప్రాకృత పదములవలెనే తెలుగులోఁ బ్రవేశించి యుండుటచే సంస్కృత సమము. సంస్కృత భవమునని విభజించుటకంటె భాషాంతర సమము భాషాంతర భవమునని గ్రహించుట యుక్తము.

10. భాషాంతరాగతములు గాక యాంధ్ర దేశమున వ్యవహరింపబడు పదములు దేశ్యములు. ఉ॥ పాలు, పెరుగు. దేశ్య మార్గంచ రూఢత్వాంత్। స్వతంత్రత్వాచ్చ భూయాసాః లక్ష్మనాపేక్షతేతస్య। సంప్రదామోహి బోధకః: యని యధర్వణాచార్యుడు దేశ్య భాషా స్వరూపమును జెప్పియున్నాడు.[21]

ఒక పదము గ్రామ్యమా? సాధువా? అని నిర్ణయించే శక్తి వ్యాకరణాల గ్రంథాల కన్న శిష్ట వ్యావహారానికే ఎక్కువగా వుంటుందని వఝలవారు. భావించారు. వ్యాకరణంగ్రామ్యాలుగాప్రదర్శించినపదాలను(లంజె, గద్దె, ఆడ, ఏడమొ.) కూచిమంచి తిమ్మకవి సాధురూపాలనడం, బాల వ్యాకర్త అనింద్యగ్రామ్యాలని చూపించిన ప్రయోగాలను ప్రౌఢవ్యాకర్త నింద్య గ్రామ్యాలని ప్రదర్శించడం ఇందుకు వుపపత్తిగా చూపిస్తూ వీరు శిష్ట వ్యవహారికాన్ని ప్రమాణంగా గ్రహించి "స్తా" రూపముకూడ సాధువే యనదగునని నిర్ణయించారు.[22]

34. సూ. దంత్యహల్లు పరమైనప్పుడు చతాచ మకారములకు దంత్యమగు సకారము వచ్చును. ఉ॥ గెలుచుచున్నాఁడు, గెలుచుతున్నాడు (గెలుచున్నాడు) గెలుస్తున్నాడు. గెలుచుతాను = గెలుస్తాను. రక్షించుతాడు. = రక్షిస్తాడు (సూ 25) చేయుచున్నాఁడు. = చేయుతున్నాడు = (చేయున్నాడు) చేస్తున్నాడు

21. నవీనాంధ్ర వ్యాకరణము, వఝలచిన సీతారామస్వామిశాస్త్రి. అముద్రితం.

22. వఝల చిన సీతారామస్వామిశాస్త్రి గారి అముద్రితవ్యాసం.

(చేయుతాను = చేయ్తాను) = చేస్తాను- ఇచ్చితిని- ఇస్తిని.[23]

పైన పేర్కొన్న విధంగా గురజాడ మొదలగు వాళ్ళంతా వ్రాయదలచిన వ్యాకరణాలు కొన్నిసంకల్పంలోనే నిలిచి పోవడం వల్లనూ: కొన్ని లభించక పోవ డం వల్లను, వయులవారు గిడుగువారి వుద్యమంలో పాల్గొన్న తొలినాళ్ళలోనే అంటే 1910 -1912 మధ్య యీ వ్యాక రణం వ్రాసి వుండవచ్చునని వూహించ డానికి అవకాశం వుండడంవల్లనూ, వీరు ప్రథమ నవీనాంధ్ర వ్యాకర్తలని చెప్పడం సమంజసగా వుంటుంది.

ఇహ రాను రాను యీ వుద్యమ తీవ్రత తగ్గు ముఖం పట్టడంవల్లనైతే నేమి, తరాంత తర్వాత వీరిని వరించిన పదవుల వల్లనైతేనేమి లక్ష్య రూపంగా వీరి వ్యావహారిక భాషాభిమానం ఎక్కడా కనబడ్డంలేదు.

కనక ఈ వ్యాసాన్నిబట్టి వయులవారు వ్యావహారికభాషా వ్యతిరేకి కారనీ, మొదట్నుంచీ వీరు వ్యావహారిక వాదాన్నే ఆమోదిస్తూ వచ్చారనీ తెలుస్తూంది. ఈనాడు లక్షణ విరుద్ధాలనే ప్రయోగా లన్నీ ఒకప్పటి వ్యావహారిక పదాలేనని, తత్కాలిక సద్వ్యవహారాన్ని ప్రమా ణంగా స్వీకరించాలనీ పూర్వం వ్యావ హారికంలోనే వ్యాఖ్యానాలూ వచన గ్రంథాలూ ఉద్దండ పండితులే వ్రాసే వారనీ అదే నిజమైన సంప్రదాయమనీ, వ్యావహారిక భాషకి నియమం వుండాలనీ, యమరహిత భాష లోకోపయోగిని కాదనీ, వ్యావహారిక భాషని సంస్క రిస్తేనే గ్రాందిక మవుతుందనీ వయుల వారు భావించారని గ్రహించవచ్చు.

చివరగా చెప్పవచ్చే దేమంటే మొదట్నుండీ చివరవరకూ ప్రామాణిక భాషా నిర్ణయంలో వ్యావహారిక భాషగ్గల ప్రబలమైనస్థానాన్ని వీరు సమర్థిస్తూ వచ్చా రని నిర్ణయించడం. 1956 లో జరిగిన పండిత సన్మాన సందర్భంలో వీరు చెప్పిన పద్యాలే అందుకు తార్కాణం.

క॥ నానా శాస్త్రంబుల వి
జ్ఞానము గడియించు నాంధ్ర
సచ్చీలుర వి
జ్ఞానముఁ దోడుకొకీఁగా
నానందగుఁగాక వ్యావహారిక భాషన్‌।

మ॥ వ్యవహారస్థమునే గ్రహించి
విబుధుల్ వాఙ్మై పుణం బొప్పన్
సవరింపంగద గ్రాంధికంబు వెలసెన్
దానన్యమే యద్దితన్
వ్యవహారానయురోప మత్వరను
మార్పందంగఁ బోకుండఁ గా
చు: విశాలోజ్వల వాఙ్మయ గ్రథిత
తచ్ఛుద్ధంబె గ్రాహ్యంబగున్‌।

23. నవీనాంధ్ర వ్యాకరణము. అముద్రితం.

మోహన్‌దాస్ అమరస్మృతికి

కర్పూర కళిక

హార్మనీ గమకాల నర్తించు ఆ వేళ్ళు
ఆగిపోయిన వన్న నమ్మలేకున్నాము—
హృది విప్పి ఆర్ద్రమై రవళించి ఆ వాణి
మూగవోయిన దన్న ఊహించలేము
ప్రజా కళా రంగాన
కర్పూర కళికలై
జనగాన పరిమళం
వెదజల్లి మలిగావు ||హార్మనీ||

జన సమర గీతాల
నీ-రాగాల ఊపిరులు
నిత్యమై నిలిచేను
యువ గాత్ర హృదయాల ||హార్మనీ||

తుదివరకు జీవితం
అంకితం చేశావు
విప్లవాదర్శాల
అమరత్వ మొందావు
నీ పథం జనపథం
అనుగమనం మా శపథం
||హార్మనీ||

—మల్లిక్

"స్మృతి గీతం"

ఆగిపోయిందా మోహన రాగం
మూగవోయిందా విప్లవగానం ||ఆగి||

ప్రజల కోసమె గానమంటూ
ప్రజల కవితలు పాడమంటూ
ప్రజల భాషను—ప్రజల బాణిని
ప్రజలకే అందించి పోయెవా ||ఆగి||

కళ్ళలో కన్నీరు దాచుకు
గుండెలో వ్యధలెన్నో మోసుకు
వేళ్ళ ఉద్యమ నాడి మీటితె
గొంతు విప్లవ గర్జనాయెనా ||ఆగి||

సొంత లాభం విస్మరించిన
కాంతి ఆ నిస్వార్థగానం
జాతినే మేల్కొల్పు వెలిగిన
జ్యోతి ఆ వైప్లవ్య రాగం ||ఆగి||

కష్టజీవుల కంటి-నీరై
కర్షకుల నిట్టూర్పు సెగయై
యువతరం ఉద్రేక శిఖియై
ఉద్యమాలకు ఊపిరాయెనా ||ఆగి||

—ఎస్వీ

కసి పిడికిళ్ళు

ఓరిమి కొలిమంటు కొందిరా
వేడిమి నింగందు కొందిరా
కనలి కనలి జన సహనం
అనలం చిమ్మిందిరా ।

మాయదారిచే యిప్పుడు
మనిషి కొంపకూల్చెరా
మండే గుండెలు కదిలీ
కార్చిచ్చై కాల్చురా ॥

ఉక్కు బూట్ల దొరతనాల
గూండాగిరి చెల్లదురా
కలిమి జులం కలకాలం
కష్టజీవు లొల్లదురా ॥

కూలిన గుడిసెల కోసం
మంటల జండాలులా
ఏలె రాబందుల మెడ
నులిమే ఉరితాళ్ళురా ॥

వీచే ప్రతిగాలి చూడు
పగసెగ లెగబోసెరా
విసిరే ప్రతి చేయి నేడు
కసి పిడికిళ్ళాపెరా॥

ఓరిమి కొలిమంటు కొందిరా
వేడిమి నింగందు కొందిరా.

—ఏటుకూరి ప్రసాద్

మూడు చిత్రాలు

సాయంత్రం –
సాయంత్రానికి
నావలు మునిగిపోతాయి
అరచేతిలో
ఒక సముద్రం ఉబుకుతుంది.

కాలం –
గూని గుర్రంలా కాలం
దాన్ని మనం చూడం
అది మనల్ని చూడదు
అయినా వెళ్ళిపోతుంది
డెక్కల చప్పుళ్ళని వినిపిస్తూ.

గతం –
ఇంటి వెలుపల
శతాబ్దాలు ఏడుస్తాయి
ఇంటి లోపల
చరిత్ర నవ్వుతుంటుంది
మరలాంటి బతుకు
మూసిన గుప్పెట్లో
ఆవగింజలా మొలుస్తుంది.
ఇళ్ళ నడికొప్పులమీంచి రాబందు
వెలుగు చీకట్లను గడుస్తుంది.

అనామిక హిందీ కవితకి ఖాదర్
మొహియుద్దీన్ తెలుగు.

– తెలుగు : ఖాదర్

Edited, Printed & Published By T. Venkataramaiah,
3-6-737/3, HIMAYATNAGAR, HYD-29
Printed at Swatantra Art Printers, Vijayawada - 520004